సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 | సంచిక: 225

SUNDAY Special | ఆదివారం 6-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



ఇంగ్లండ్ హిట్... ఆసీస్ అవుట్

టి20 ప్రపంచకప్‌లో శ్రీలంకపై నెగ్గి సెమీఫైనల్ చేరిన ఇంగ్లండ్. గ్రూప్ దశలోనే నిష్క్రమించిన డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా. నేడు జింబాబ్వేతో భారత్ చివరి మ్యాచ్.

- వివరాలు 12లో



కండరాల జబ్బు మయోసైటిస్..

ఈ జబ్బు గురించి చాలా మందికి అవగాహన లేదు. అసలు ఈ కండరాల జబ్బు ఏంటి.. మయోసైటిస్ లక్షణాలు, నిర్ధారణ, చికిత్స వంటి అంశాలపై ప్రత్యేక కథనం..

- వివరాలు 11లో



తొలి ఓటర్ నేగీ కన్నుమూత

స్వతంత్ర భారతదేశంలో తొలి ఓటర్‌గా చరిత్రకెక్కిన 106 ఏళ్ల శ్యామ్ శరణ్ నేగీ శనివారం తుదిశ్వాస విడిచారు.

వివరాలు 6లో



ఇండియన్స్ వెరీ టాలెంటెడ్

భారతీయులు చాలా ప్రతిభావంతులని, అనుకున్నది సాధిస్తారని రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు.

వివరాలు 6లో

లక్ష్యానికి ఆమడ దూరం

వాతావరణం నానాటికీ విషతుల్యంగా మారుతున్న నేపథ్యంలో ఐరాస ఆధ్వర్యంలో కాప్-27 సదస్సు నేడు మొదలవుతోంది.

వివరాలు 6లో



ఉద్యోగుల తొలగింపు తప్పదు

ట్విట్టర్‌కు లక్షలాది డాలర్ల నష్టం వాటిల్లుతోందని, ఉద్యోగుల తొలగింపు తప్ప మరోదారి లేదని ఎలాన్ మస్క్ తేల్చిచెప్పారు.

వివరాలు 6లో

న్యూస్‌రీల్


మూడు రాజధానుల కోసం గళమెత్తిన విద్యార్థి లోకం



మూడు రాజధానుల కోసం విద్యార్థి లోకం గళమెత్తింది. ఒక రాజధాని వద్దు.. మూడు రాజధానులు ముద్దు అంటూ ఒంగోలు నగరం మార్మోగింది. శనివారం విద్యార్థులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. మూడు రాజధానులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని విద్యార్థులు అన్నారు.

వివరాలు 2లో ▸

కనులపండువగా సత్యదేవుని తెప్పోత్సవం



క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై కొలువైన శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామి వారి తెప్పోత్సవం శనివారం రాత్రి పంపా నదిలో కనులపండువగా జరిగింది. వేలసంఖ్యలో భక్తులు తెప్పోత్సవాన్ని తిలకించారు.

వివరాలు 5లో ▸

నేడు దక్షిణ కోస్తాలో తేలికపాటి జల్లులు



రాష్ట్రంలో ప్రస్తుతం అల్పపీడన ద్రోణి, ఉపరితల ఆవర్తనాలు లేవు. అయినా ఆదివారం దక్షిణ కోస్తాంధ్రలో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని, సోమ, మంగళవారాల్లో రాష్ట్రమంతా పొడి వాతావరణం ఉంటుందని ఐఎండీ వెల్లడించింది.

వివరాలు 3లో ▸

సంఘటితం.. సమారాధనం



కార్తీక వనభోజనాల రూపు నేడు మారింది. ఒక కులానికి చెందిన వారంతా ఒక చోటకు చేరుతున్నారు. రాజకీయాలు, ఆర్థిక తారతమ్యాలకు అతీతంగా వనభోజనాల్లో ఐక్యతా రాగం పాడుతున్నారు. ఉత్తేజపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. తమ కులస్థులు ఉన్నత స్థాయికి ఎదిగే ప్రణాళికలు వేస్తున్నారు.

వివరాలు 5లో ▸

'ఉపాధి'లో అగ్రస్థానం

పని దినాల కల్పన, వేతనాల చెల్లింపులో ఏపీ నంబర్‌వన్


- ఈ ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో 15.11 కోట్ల పనిదినాల కల్పన
- కూలీలకు వేతనాలుగా రూ.3,084.94 కోట్లు
- మరే రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో లేని ఉపాధి కల్పన, వేతనాలు
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం అమల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఎక్కువ పని దినాలు కల్పించడంలోనే కాకుండా వేతనాల చెల్లింపులోనూ నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకుంది. ఈ మేరకు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక ఏడాది (2022–23) తొలి త్రైమాసికంలో (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) ఆంధ్రప్రదేశ్ ఏకంగా 15.11 కోట్లకు పైగా పని దినాలను కల్పించింది. వీరికి వేతనాల రూపంలో రూ.3,084.94 కోట్లు చెల్లించింది. మరే రాష్ట్రం ఇంత పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడం, వేతనాలు చెల్లించడం చేయలేదని నివేదిక స్పష్టం చేసింది. కేవలం ఉపాధి హామీ పథకం అమలులోనే కాకుండా ఎస్సీ ఉపప్రణాళిక ద్వారా ఎస్సీ కుటుంబాలకు సాయం అందించడం, ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు మంజూరులోనూ వైఎస్ జగన్ ప్రభుత్వం చాలా మంచి పనితీరు కనబరిచిందని నివేదిక పేర్కొంది. లక్ష్యాల్లో 90 శాతానికిపైగా అమలు చేసిన రాష్ట్రాలను చాలా మంచి పనితీరు చూపినవాటిగా తెలిపింది. 80 శాతం నుంచి 90 శాతం మేర

మిగతా 2వ పేజీలో ▶





అడవి పిలుస్తోంది!

ప్రకృతి ప్రేమికులకు రాష్ట్రంలోనే అద్భుతమైన అటవీ ప్రాంతాలు

నల్లమల, శేషాచలం, తూర్పు కనుమలు వంటి అనేక అడవులు

అందుబాటులో 30 పర్యావరణ పర్యాటక ప్రదేశాలు

వాటిని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు

అటవీ ప్రేమికులను ఆకర్షించడమే లక్ష్యం

సాక్షి, అమరావతి: ప్రకృతి ఒడిలో సేద తీరాలని.. ఈ ఉరుకుల పరుగుల జీవితం నుంచి కొద్ది రోజులపాటు దూరంగా, ప్రశాంతంగా గడపాలనుకునేవారికి అడవి ఆహ్వానం పలుకుతోంది. ఇందుకోసం అటవీ ప్రేమికులు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. మన రాష్ట్రంలోనే ఎన్నో ప్రకృతి రమణీయ ప్రదేశాలు అటవీ ప్రాంతాల్లో నెలకొని ఉన్నాయి. తూర్పు కనుమలు, నల్లమల, శేషాచలం, ఎర్రమల, పాపికొండలు ఇలా పలు అడవులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. ఈ అడవుల్లోని కొత్త ప్రదేశాలు, కొండలు, లోయల సందర్శనలు, ట్రెక్కింగ్ పట్ల పర్యాటకులు

మిగతా 14వ పేజీలో ▶

పాపికొండలు.. పోదాం పద

- విహారయాత్రకు అనుమతులు మంజూరు.. ట్రయిల్ రన్ నిర్వహించిన అధికారులు
- పోశమ్మ గండి పాయింట్‌లో 8 బోట్లకు అనుమతి
- నేటి నుంచి ప్రారంభం

14లో

దారంతా హడావుడే

రెచ్చగొట్టే వ్యాఖ్యలు.. ఉన్మాద పోకడలతో పవన్ ఇప్పటం పర్యటన



కారుపైకి ఎక్కి ప్రయాణిస్తున్న పవన్

3లో

■ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరోసారి తనదైన శైలిలో రెచ్చిపోయారు.. ఆక్రమణలన్నీ సక్రమమేనని సర్టిఫికెట్ ఇచ్చేశారు.. రోడ్డు వెడల్పు చేయండని ఎవరడిగారంటూ రెచ్చిపోయారు.. కేవలం ప్రహరీలు మాత్రమే కూల్చివేయగా, ఇళ్లన్నీ కూల్చేసినట్లు కలరింగ్ ఇస్తూ మాట్లాడారు.. కాస్త సంయమనం పాటించండంటూ పోలీసులు విజ్ఞప్తి చేయగా, వారిపై కూడా నోరు పారేసుకున్నారు.. 'మీరు రేప్ చేసిన వాళ్లను రక్షిస్తారు.. ఇళ్లు కూలగొట్టిన వారికి అండగా ఉంటారు' అంటూ మండిపడ్డారు.. ఇక ప్రభుత్వంపై ఆయన చేసిన వ్యాఖ్యలు విన్న గ్రామస్తులే విస్తుపోయారు.

పవన్ పిచ్చికూతలు.. బాబు చెత్త ట్వీట్లు



- ఇప్పటంలో ఒక్క ఇంటినీ కూల్చలేదు.. డ్రైనేజీ ఆక్రమణలే తొలగింపు
- ఇప్పటానికి ఇస్తానన్న రూ.50 లక్షలు అడిగితే ఈ డ్రామాలేంటి?
- పవన్‌పై రెక్కీచేసే అవసరం బాబుకే ఉంటుంది.. ఈనాడు రామోజీ ఇప్పటం వచ్చి చూస్తే వాస్తవాలు తెలుస్తాయి
- మంత్రి జోగి రమేష్ ఫైర్

3లో

పవన్ కళ్యాణ్‌ది ఉన్మాద రాజకీయం



- రాష్ట్రాన్ని ప్రమాదకర స్థితిలోకి నెట్టేస్తున్నాడు
- ప్రభుత్వాన్ని కూల్చండంటూ పిచ్చి వ్యాఖ్యలు
- తాగుబోతుల గొడవను చూసి భయపడిన వాడు బీరాలు పలకడం సిగ్గుచేటు
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం

3లో

వెంకన్న వద్ద 10,258.37 కిలోల బంగారం

ప్రముఖ జాతీయ బ్యాంకుల్లోనే శ్రీవారి బంగారం, నగదు



గత మూడేళ్లలో భారీగా పెరిగిన డిపాజిట్లు

- శ్రీవారి డిపాజిట్లపై శ్వేతపత్రం
- 2019 జూన్ నాటికి ఉన్న బంగారం 7,339 కిలోలు
- ఇప్పుడు బంగారమంతా రెండు జాతీయ బ్యాంకుల్లోనే
- శ్రీవారి బ్యాంకు డిపాజిట్లు రూ.15,938.68 కోట్లు
- 2019 జూన్ నాటికి ఉన్న డిపాజిట్లు రూ.13,025 కోట్లు
- అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని భక్తులకు టీటీడీ వినతి

10లో



ఇండస్ట్రీ.4.0 సీవోఈ పోటీకి విశేష స్పందన

- 260కుపైగా పోటీపడ్డ స్టార్టప్‌లు
- మూడు దశల్లో పరిశీలన తర్వాత స్టార్టప్‌లు ఎంపిక
- 6 సమస్యలపై స్టార్టప్‌ల నుంచి అత్యుత్తమ పరిష్కారం కోసం పోటీ

2లో



మునుగోడు తీర్పు నేడే

- మరికొన్ని గంటల్లో వెలువడనున్న ఫలితం
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- మధ్యాహ్నానికల్లా విజేతపై స్పష్టత!
- గెలుపుపై టీఆర్ఎస్, బీజేపీ ధీమా

10లో

ఇదండీ సంగతి



అంత ఆవేశం పనికిరాదు! ఇక్కడ ఎవరి మాట ఎవరు వింటున్నారని..!

మరపురాని మహా 'సంకల్పం'

ప్రజా సంకల్పయాత్రకు నేటితో ఐదేళ్లు పూర్తి

- విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన యాత్ర
- జనం కష్టాలను స్వయంగా తెలుసుకున్న జననేత
- మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను నెరవేర్చిన మాట తప్పని నాయకుడు
- నేడు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు.. సేవా కార్యక్రమాలు నిర్వహించాలని శ్రేణులకు వైఎస్సార్‌సీపీ పిలుపు

2లో

"నాకున్నదల్లా ఒక్కటే కసి. నేను చనిపోయాక కూడా ప్రజల గుండెల్లో బతకాలన్న కసి. రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలని.. అక్క చెల్లెమ్మలు, రైతన్నలు, విద్యార్థులకు మంచి జరగాలన్న కసి. అన్ని కులాల్లోని పేదలను ఆదుకోవాలన్న కసి. రాష్ట్రాన్ని దేశ శిఖరాగ్రాన నిలపాలన్న కసి.

- ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్



క్లుప్తంగా

ఇండస్ట్రీ 4.0 సీవోఈ పోటీకి విశేష స్పందన

- 260కుపైగా పోటీపడ్డ స్టార్టప్‌లు
- మూడు దశల్లో పరిశీలన తర్వాత స్టార్టప్‌ల ఎంపిక
- 6 సమస్యలపై స్టార్టప్‌ల నుంచి అత్యుత్తమ పరిష్కారం కోసం పోటీ

సాక్షి, అమరావతి: పరిశ్రమల్లో ఆటోమేషన్, రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి నాలుగోతరం టెక్నాలజీ (ఇండస్ట్రీ4.0) ఆవిష్కరణలను ప్రోత్సహించే విధంగా పెట్టిన పోటీకి స్టార్టప్‌ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. కల్పతరువు ఇండస్ట్రీ4 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) చాలెంజ్‌కు 260కు పైగా స్టార్టప్‌ల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) విశాఖ చాప్టర్ అడిషనల్ డైరెక్టర్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)కు చెందిన ఆరు సమస్యలతో పాటు ఇండస్ట్రీ4 కు సంబంధించి ఒక అత్యుత్తమ పరిష్కారాన్ని కోరుతూ చాలెంజ్ ప్రోగ్రాం–1ను సీవోఈ ప్రకటించింది. ఇందులో వచ్చిన దరఖాస్తులను 3 దశల్లో పరిశీలించి అత్యుత్తమ పరిష్కారాన్ని కమిటీ ఎంపిక చేస్తుందని, ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి 45 రోజులకుపైగా సమయం పడుతుందని సురేష్ చెప్పారు. ఎంపికైన స్టార్టప్‌లకు కల్పతరువులో ఇంక్యుబేషన్ సెంటర్‌తో పాటు ల్యాబ్, ఆర్థిక సహకారం వంటి ప్రయోజనాలను కల్పిస్తారు. ప్రభుత్వరంగ సంస్థల్లో నూతన టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా ప్రమాదాల సంఖ్యను తగ్గిస్తూ ఉత్పత్తిని పెంచుకునే లక్ష్యంలోభాగంగా దేశంలో తొలి ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని రూ.20 కోట్లతో విశాఖలో ఏర్పాటు చేశారు.

జపాన్‌కు భారత నౌకాదళాధిపతి

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో భారత్‌కు ప్రాతినిధ్యం



సాక్షి, విశాఖపట్నం: జపాన్‌లో ఆదివారం ప్రారంభం కానున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో ఇండియన్ నేవీ తరఫున పాల్గొనేందుకు భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ శనివారం చేరుకున్నారు. ఇప్పటికే భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ శివాలిక్, ఐఎన్ఎస్ కమోర్తా యుద్ధ నౌకలు ఐఎఫ్ఆర్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. యెకొసుకా తీరంలో జరిగే ఐఎఫ్ఆర్‌లో 13 దేశాలకు చెందిన 40 యుద్ధనౌకలు, జలాంతర్గాములు పాల్గొంటున్నాయి. ఐఎఫ్ఆర్‌లో నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్ పాల్గొన్న తర్వాత.. అదే రోజు సాయంత్రం జపాన్ ప్రధాని ఫుమియో కిషిడాతో కలిసి జపాన్ మారీటైమ్ ఫర్ సెల్ఫ్ డిఫెన్స్ 70వ వార్షికోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం యెకొహోమాలో 7,8 తేదీల్లో జరిగే వెస్టన్ పసిఫిక్ నేవల్ సింపోజియమ్‌కు హాజరు కానున్నారు. ఆ తర్వాత జపాన్‌లో జరిగే మలబార్ 26వ ఎడిషన్ విన్యాసాల్లో పాల్గొంటారు. నవంబర్ 8 నుంచి 18 వరకూ జరిగే మలబార్‌లో భారత్, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాల నౌకాదళాలు పాల్గొంటాయి.

ముగిసిన భారత్-ఆస్ట్రేలియా యుద్ధ విన్యాసాలు

- ఇండో పసిఫిక్ ఎండీవర్–2022లో భాగంగా విశాఖలో ఆస్ట్రేలియా నౌకాదళం
- చివరి రోజు విన్యాసాల్లో పాల్గొన్న రాయల్ ఆస్ట్రేలియా త్రివిధ దళాలు



యుద్ధ విన్యాసాల్లో భారత్-ఆస్ట్రేలియా త్రివిధ దళాలు

సాక్షి, విశాఖపట్నం: భారత్–ఆస్ట్రేలియా రక్షణ దళాల మధ్య నిర్వహించిన మారీటైమ్ విన్యాసాలు శనివారం ముగిశాయి. విశాఖ తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం సమీపంలోని బంగాళాఖాతం తీరం ఈ విన్యాసాలకు వేదికైంది. ఇండో పసిఫిక్ ఎండీవర్(ఐపీఈ)–2022లో భాగంగా గత నెల 30న రాయల్ ఆస్ట్రేలియా రక్షణ దళాలు విశాఖ చేరుకున్నాయి. శనివారం నిర్వహించిన విన్యాసాల ముగింపు నేపథ్యంలో రాయల్ ఆస్ట్రేలియన్ నేవీకి చెందిన హెచ్ఎంఏఎస్ అడిలైడ్, హెచ్ఎంఏఎస్ అంజాక్ యుద్ధ నౌకలు, తూర్పు నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ జలాశ్వ, ఐఎన్ఎస్ కవరత్తి యుద్ధ నౌకలతో పాటు హెలికాప్టర్లు విన్యాసాల్లో పాల్గొని సత్తా చాటాయి. చివరి రోజు విన్యాసాల్లో ఆస్ట్రేలియా, భారత్‌కు చెందిన త్రివిధదళాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా భారత్‌కు చెందిన యుద్ధ నౌకల్ని ఆస్ట్రేలియా రక్షణ బృందం సందర్శించాయి. హార్బర్ ఫేజ్‌లో ఉమ్మడి రక్షణ ప్రణాళికలు, పరస్పర అవగాహన ఒప్పందాలు, రక్షణ వ్యవస్థలో సహకార చర్యలు మొదలైన అంశాలపై చర్చించినట్లు తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ముజంబికకు వితంతు పింఛన్ అందిస్తున్న వలంటీర్ షేక్ షాజిదాబేగం



గుంటూరులోని బావాజీనగర్‌కు చెందిన మస్తానమ్మకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లుంబిని



శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆనంద్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ భారతి



నెల్లూరు జిల్లా వేగూరుకు చెందిన వెంకయ్యకు పింఛన్ ఇస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి

మరపురాని మహా 'సంకల్పం'

ప్రజా సంకల్పయాత్రకు నేటితో ఐదేళ్లు పూర్తి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో నిర్వహించిన 'ప్రజా సంకల్ప యాత్ర'కు ఆదివారంతో సరిగ్గా ఐదేళ్లు పూర్తయ్యాయి. దేశ రాజకీయాల్లోనే ఈ యాత్ర ఓ సంచలనం సృష్టించి చరిత్రకెక్కింది. మళ్లీ రాజన్న రాజ్యాన్ని తేవాలన్న సంకల్పంతో వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద 2017 నవంబర్ 6వ తొలి అడుగు వేశారు. ప్రజల వద్దకు వెళ్లి స్వయంగా వారి కష్టాలు తెలుసుకుని కన్నీళ్లను తుడిచారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చి హామీలను మేనిఫెస్టోలో చేర్చారు. అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పొందుపరచిన 98 శాతం హామీలను మూడున్నరేళ్లలోనే నెరవేర్చారు. కోట్లాది హృదయాలను స్పృశించిన ప్రజా సంకల్ప పాదయాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో 2019 జనవరి 9వ తేదీన ముగిసింది. 134 అసెంబ్లీ నియోజక వర్గాలు, 231 మండలాలు, 2,516 గ్రామాల మీదుగా 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. 124 చోట్ల సభలు, 55 ఆత్మీయ సమ్మేళనాల్లో వైఎస్ జగన్ ప్రసంగించారు. పాదయాత్ర ఆద్యంతం జననేతను కలుసుకోని వర్గం అంటూ లేదు. 'జయహో జగన్' అంటూ తరలి వచ్చిన ప్రజానీకం తమ సాధక బాధకాలను తెలియచేసింది. పూలబాట పరచి అపూర్వ స్వాగతం పలికారు. నుదుట కుంకుమ దిద్దారు. నిరుపేద మహిళలు, చేయూతకు నోచుకోని వృద్ధులు, అనాథలు, ఉపాధి లేని యువత, విద్యార్థులు, రైతన్నలు పాదయాత్రలో భాగస్వాములయ్యారు.

జగన్ అనే నేను..

పాదయాత్రలో 'వైఎస్ జగన్ అనే నేను..' అంటూ ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు, భరోసాలే 'వైఎస్ జగన్ అనే నేను.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేస్తున్నాను..' అని చెప్పే వరకు నడిపించాయి. అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, మహిళా సాధికారత, విద్యా దీవెన, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, నాడు – నేడు కార్యక్రమాల ద్వారా ఇంకా నడిపిస్తునే ఉన్నాయి. 2019 మే 23న ఎన్నికల ఫలితాలు వెలువడ్డ రోజు చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 175 అసెంబ్లీ స్థానాలకు గాను 151 చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు. మొత్తం 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో 22 చోట్ల వైఎస్సార్ సీపీ ఎంపీలు గెలిచి చరిత్ర సృష్టించారు. బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే తానిచ్చిన మాటకు కట్టుబడి అవ్వాతాతల పింఛన్‌ను రూ.2,250కి పెంచుతూ సీఎం జగన్ తొలి సంతకం చేశారు. మంత్రివర్గ కూర్పులో తనదైన శైలిని కనబరిచారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు 50 శాతానికి పైగా మంత్రి పదవులను కేటాయించి రాజకీయ సంచలనం సృష్టించారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు, మైనారిటీలకు ఐదు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చి చరిత్రను తిరగరాశారు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ఏకంగా 19 చట్టాలు చేశారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా..

మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తానని తొలిరోజే ప్రకటించిన సీఎం జగన్ అందులో పేర్కొన్న 'నవరత్నాల' అమలును వడివడిగా చేపట్టారు. భారీ ఎత్తున సంక్షేమాభివృద్ధి పథకాల అమలుకు శ్రీకారం చుట్టారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నామినేటెడ్ కాంట్రాక్టుల్లో 50 శాతం అవకాశం కల్పిస్తూ చట్టం చేశారు. అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. మహిళల భద్రత కోసం దేశంలో ఎక్కడాలేని విధంగా దిశ బిల్లు రూపొందించి కేంద్రానికి పంపారు. దిశ యాప్ ద్వారా ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలిచారు. రాష్ట్రం నలుమూలలా అభివృద్ధి జరగాలనే దృఢ సంకల్పంతో మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారు. అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలని, అన్ని కులాలు రాజకీయంగా సమానంగా ఎదగాలన్నదే సీఎం జగన్ లక్ష్యం. ఇవన్నీ ఒక ఎత్తు కాగా కోవిడ్ కష్టకాలంలోనూ నిర్విఘ్నంగా సంక్షేమ పథకాలు అందించి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడం మరోఎత్తు. ఒక వైపు గత సర్కారు రాష్ట్రాన్ని ఊహకు అందనంత అప్పుల్లో ముంచెత్తి ఖాళీ ఖజానా అప్పగించింది. మరో వైపు ప్రపంచ వాప్తంగా మహమ్మారి కరోనా కమ్మేసింది. అయినా సరే మొక్కవోని దీక్షతో ఖర్చుకు వెనుకాడకుండా రాష్ట్రానికి పునరుజ్జీవం కల్పించారు. సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని కళ్లెదుట ఆవిష్కరించారు.

నేడు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు, కేక్ కటింగ్‌లు

జననేత వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్రకు నవంబర్ 6వతేదీతో ఐదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో ఆదివారం ఉదయం దివంగత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాలని, సర్వమత ప్రార్థనలు, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, కేక్ కటింగ్‌లు చేయాలని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం సూచించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజక వర్గ సమన్వయకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. పాదయాత్ర అనుభవాలనే మేనిఫెస్టోగా మలుచుకుని అధికారం చేపట్టిన రెండేళ్లలోనే 97 శాతం హామీలను ముఖ్యమంత్రి జగన్ అమలు చేశారని పేర్కొంది. నాటి పాదయాత్రను గుర్తు చేస్తూ నేటి జగనన్న పరిపాలనను వివరిస్తూ ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది.

అప్పుల్లో ముంచిన అపర మేధావి!

- యనమలపై మంత్రి అమర్‌నాథ్ ధ్వజం
- పన్ను పీకించుకునేందుకు రూ.2 లక్షల ప్రజాధనంతో సింగపూర్‌కా?!



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): సెల్ఫ్ సర్టిఫైడ్ మేధావి లాంటి యనమల రామకృష్ణుడు భాగస్వామ్యంతోనే గత సర్కారు రూ.లక్షల కోట్లు అప్పు చేసిందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. విశాఖలో శనివారం మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.80 లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. ప్రభుత్వ ఆర్థిక కష్టాలన్నింటికి యనమల, చంద్రబాబే కారణమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం మూడేళ్లలో రూ.1.70 లక్షల కోట్లు వెచ్చించి నేరుగా, పారదర్శకంగా అందించిందన్నారు. రూ.1.60 లక్షల కోట్లు అప్పులు చేసిన గత సర్కారు ఎవరికి ఇచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. యనమల నోటి పన్ను తొలగించుకునేందుకు రూ.2 లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి సింగపూర్ వెళ్లారని, లోకేష్ విమానాశ్రయాలలో జీడిపప్పు కోసం రూ.20 లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేశారన్నారు. అప్పులపై చర్చించేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖ వస్తున్న ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయడం తమ బాధ్యతన్నారు.

ఇప్పటం ప్రజలకు రూ.50 లక్షలిచ్చి మాట్లాడాలి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గతంలో ఇప్పటంలో సభ నిర్వహించినప్పుడు గ్రామానికి రూ.50 లక్షలు ఇస్తానని ప్రకటించారని మంత్రి అమర్‌నాథ్ గుర్తు చేశారు. ఆ సొమ్ము ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. డబ్బులు ఇచ్చిన తరువాత ఆ గ్రామానికి వెళ్తే బాగుంటుందని సూచించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తితే పవన్ కళ్యాణే కాదు, ఎవర్నైనా పోలీసులు అడ్డుకుంటారన్నారు.

'ఉపాధి'లో అగ్రస్థానం

▶ మొదటి పేజీ తరువాయి

అమలు చేసిన రాష్ట్రాలు మంచి పనితీరు కనబరిచినట్లు పేర్కొంది. ఇక లక్ష్యాల అమలులో 80 శాతం లోపు నిలిచినవాటిని పనితీరు బాగోలేని రాష్ట్రాలుగా వర్గీకరించింది.

పెద్ద రాష్ట్రాలను మించి..

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సామాజిక ఆస్తుల కల్పనలో భాగంగా పెద్ద ఎత్తున గ్రామ, వార్డు సచివాలయ భవనాలు నిర్మిస్తోంది. అలాగే రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్, వార్డు హెల్త్ క్లినిక్స్ నిర్మాణాలను కూడా చేపడుతోంది. మరోవైపు నాడు–నేడు కింద విద్య, వైద్య రంగాల్లో ఆస్తుల కల్పన పనులను చేపట్టింది. దీంతో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పెద్ద ఎత్తున పని కల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో 11.66 కోట్ల పని దినాలు, రాజస్థాన్‌లో 10.26 కోట్ల పని దినాలను కల్పించినట్టు నివేదిక తెలిపింది. ఈ రెండూ ఆంధ్రప్రదేశ్ కంటే కంటే పెద్ద రాష్ట్రాలైనప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా పనిదినాలు కల్పించడం గమనార్హం.

ప్రస్తుత ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో వివిధ రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకం అమలు పురోగతి ఇలా

రాష్ట్రం	ఉపాధి కల్పించిన పని దినాల సంఖ్య	వేతనాల రూపంలో చెల్లింపు (రూ.కోట్లలో)
ఆంధ్రప్రదేశ్	15,11,44,000	3,084.94
బిహార్	9,93,87,000	2,545.56
ఉత్తరప్రదేశ్	11,66,48,950	1,955.21
రాజస్థాన్	10,26,49,000	2,068.10
తమిళనాడు	8,66,05,000	1,687.73
కర్ణాటక	4,29,87,000	2,276.75
కేరళ	1,50,70,792	472.20
మహారాష్ట్ర	3,40,18,183	746.84
పంజాబ్	82,30,877	193.33

ఎస్సీ ఉప ప్రణాళిక అమల్లోనూ ఏపీ భేష్..

దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా ఎస్సీ ఉప ప్రణాళికను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాగా అమలు చేసిందని నివేదికలో కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ప్రశంసించింది. 23 రాష్ట్రాల్లో ఎస్సీ ఉప ప్రణాళిక కింద మొత్తం 20,61,846 ఎస్సీ కుటుంబాలకు సాయం అందగా.. అందులో ఒక్క ఏపీలోనే 20,29,192 ఎస్సీ కుటుంబాలకు సహాయం అందించినట్లు వెల్లడించింది. అలాగే 23 రాష్ట్రాల్లో తొలి త్రైమాసికంలో మొత్తం 7.62 లక్షల మంది ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద సాయం అందగా.. ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 3.98 లక్షల మందికి అందించడం విశేషం. అలాగే రైతుల వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చాలా మంచి పనితీరు చూపినట్టు నివేదిక స్పష్టం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2022–23) 24,852 విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి త్రైమాసికంలో 6,123 పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యం కాగా లక్ష్యానికి మించి ఏకంగా 285 శాతం మేర 17,708 కనెక్షన్లు ఇచ్చినట్లు నివేదిక పేర్కొంది.

రాజకీయ టూరిస్టులు పెరిగారు: కొడాలి నాని



గుడివాడ టౌన్: రాష్ట్రంలో అసలు ప్రతిపక్షమే లేదని, రాజకీయ టూరిస్టులు మాత్రం ఎక్కువయ్యారని ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం మీడియాతో మాట్లాడారు. మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి అంశాన్నీ అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు చంద్రబాబు, పవన్‌కు సమస్యలు కానరాక ఉనికి కోసం పొలిటికల్ టూరిస్టుల్లా పర్యటించి తెలంగాణకు తిరిగి వెళ్తున్నారని చెప్పారు. రాజకీయ జీవితంపై ఆందోళనతో ఏం చేయాలో తోచక పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పవన్ ఎందుకొచ్చారో.. ఎందుకు వెళ్లారో ఆయనకే తెలియదన్నారు. రూ.250 కోట్లు ప్యాకేజీ ఇచ్చి ఆయన్ను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించడం హాస్యాస్పదమని, అంత డబ్బులుంటే ఎవరికో ఇచ్చేకంటే పవన్‌కు ఇస్తే మావద్దకే వస్తారు కదా అన్నారు. బాబుపై రాళ్ల దాడి చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు.

ప్రకృతి సేద్యంలో ఏపీ ఫస్ట్

- 17 రాష్ట్రాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్న 16.78 లక్షల మంది రైతులు
- దేశవ్యాప్తంగా 10.03 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ప్రకృతి సేద్యం
- అత్యధికంగా ఏపీలో ప్రకృతి సేద్యం చేస్తున్న 6.30 లక్షల మంది రైతులు
- ప్రకృతి వ్యవసాయంపై ప్రారంభించిన అధికారిక పోర్టల్‌లో కేంద్రం వెల్లడి

ప్రకృతి వ్యవసాయం 17 రాష్ట్రాలకు విస్తరించింది. మొత్తం 16.78 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో అత్యధికంగా 6.30 లక్షల మంది రైతులు ఆంధ్రప్రదేశ్‌లోనే (2.90 లక్షల హెక్టార్లలో) ప్రకృతి సేద్యం చేస్తుండగా.. గుజరాత్‌లో 2.49 లక్షల మంది రైతులు (అత్యధికంగా 3.17 లక్షల హెక్టార్లలో) ప్రకృతి సేద్యం చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రారంభించిన జాతీయ పోర్టల్‌లో ఈ విషయాన్ని పేర్కొంది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ అధ్యక్షతన న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో 'జాతీయ ప్రకృతి సేద్య కార్యక్రమం' సారథ్య సంఘం మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తోమర్ ప్రకృతి వ్యవసాయంపై జాతీయ పోర్టల్‌ను ప్రారంభించారు. ప్రకృతి సేద్య విస్తరణ కార్యక్రమాన్ని అందరి సహకారంతో ముందుకు తీసుకువెళ్తామని ఆయన చెప్పారు. బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం ఉపయోగించి రసాయన రహితంగా పంటలు పండించడాన్ని ప్రకృతి సేద్యంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర శాఖలతో సమన్వయం చేసుకుని మార్కెట్లను అనుసంధానించాలని అధికారులను కోరారు. తద్వారా, రైతులు తమ ఉత్పత్తులను మరింత సులభంగా విక్రయించుకునేందుకు వీలవుతుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తదితరులు హాజరయ్యారు. ఈ పోర్టల్‌ను కేంద్ర వ్యవసాయ–రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసింది. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం గురించి పూర్తి సమాచారం, అమలు విధానం, వనరులు, అమలు పురోగతి వివరాలను తెలిపే ఈ పోర్టల్ దేశంలో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుందని మంత్రి తెలిపారు. 2021 డిసెంబర్ తర్వాత 17 రాష్ట్రాల్లో 4.78 లక్షల హెక్టార్లకు పైగా అదనపు వ్యవసాయ భూములను ప్రకృతి సేద్యం కిందకు తీసుకువచ్చినట్టు మంత్రి తోమర్ వెల్లడించారు. గంగా నది ఒడ్డున నాలుగు రాష్ట్రాల్లో 1.48 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం జరుగుతున్నట్లు తెలిపారు.

– సాక్షి, సాగుబడి డెస్క్



ప్రకృతి వ్యవసాయం ఏ రాష్ట్రంలో ఎంతంటే..

రాష్ట్రం	విస్తీర్ణం (హెక్టార్లు)	రైతుల సంఖ్య
ఆంధ్రప్రదేశ్	2,90,000	6,30,000
కేరళ	79,769	3,42,902
గుజరాత్	3,17,201	2,49,801
హిమాచల్‌ప్రదేశ్	9,421	1,71,063
మహారాష్ట్ర	74,000	82,000
ఉత్తరప్రదేశ్	62,200	63,000
మధ్యప్రదేశ్	1,11,000	59,071
రాజస్థాన్	9,000	36,213
ఒడిశా	24,000	27,009
జమ్మూకశ్మీర్	12,120	3,850
హరియాణా	7,931	2,992
తెలంగాణ	2,403	2,002
పంజాబ్	2,217	1,853
కర్ణాటక	2,000	4,400
తమిళనాడు	2,000	2,360
బిహార్	311	137
జార్ఖండ్	50	40

మూడు రాజధానుల కోసం గళమెత్తిన విద్యార్థి లోకం

- ఒక రాజధాని వద్దు.. మూడు రాజధానులు ముద్దు అంటూ నినాదాలు
- ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ



ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు

ఒంగోలు సబర్బన్: మూడు రాజధానుల కోసం విద్యార్థి లోకం గళమెత్తింది. ఒక రాజధాని వద్దు.. మూడు రాజధానులు ముద్దు అంటూ ఒంగోలు నగరం మార్మోగింది. శనివారం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముంగమూరు రోడ్డు జంక్షన్ నుంచి లాయర్ పేట షిర్డీ సాయిబాబా గుడి వరకు సాగింది. విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ.. అమరావతిని శాసన రాజధానిగా, విశాఖను పరిపాలనా రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా చేయాలని డిమాండ్ చేశారు. మూడు రాజధానులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణతో పాటు పరిపాలనా వికేంద్రీకరణ జరిగిన నాడే అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో మూడు రాజధానులను ఏర్పాటు చేయాలని చూస్తుంటే.. ప్రతిపక్ష టీడీపీతో పాటు దాని తోక పార్టీలు అమరావతే రాజధాని కావాలని పట్టుబట్టడం వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారాలే కారణమని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే మూడు రాజధానులు అవశ్యమని పేర్కొన్నారు. తెలంగాణ విషయంలో మోసపోయింది చాలదన్నట్లు అమరావతి ఒక్కదానినే రాజధానిని చేయాలని టీడీపీ పట్టుబట్టడం వెనుక ఆంతర్యం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని అన్నారు. అమరావతిలో రాష్ట్ర సచివాలయం నిర్మిస్తే వర్షం వస్తే వర్షపు నీరు కారి బకెట్లు పెట్టుకోవాల్సిన పరిస్థితిని తీసుకొచ్చిన ఘనత టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుదేనని విమర్శించారు. రాష్ట్ర ప్రజలందరూ బాగుండాలని కోరుకోవాల్సింది పోయి ఏ ప్రాంతం ఏమైపోతే మాకేమి.. అమరావతి ఒక్కటే బాగుపడితే చాలు అన్న చందంగా చంద్రబాబు ఉండటాన్ని మిగతా ప్రాంతాల ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రేల్లా అమర్‌నాథరెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు దాట్ల యశ్వంత్, విద్యార్థి విభాగం నాయకులు కొండూరు నవీన్, కృష్ణారెడ్డి, పురిణి శ్రీనివాసులురెడ్డి, నరసింహ, శ్రీకాంత్‌రెడ్డి, చంద్ర, హరీష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

దారంతా హడావుడే

రెచ్చగొట్టే వ్యాఖ్యలు.. ఉన్మాద పోకడలతో పవన్ ఇప్పటం పర్యటన

- ప్రహరీ తొలగిస్తే ఇళ్ల తొలగింపు అంటూ రెచ్చిపోయిన వైనం
- కొద్దిసేపు కాలినడకన, తర్వాత కారు పై కూర్చొని గ్రామంలోకి ప్రవేశం
- వైసీపీ గూండాలంటూ రెచ్చ గొడుతూ ప్రసంగాలు
- తాగుబోతుల హంగామాను రెక్కీ అంటూ ప్రస్తావన
- పరామర్శల యాత్రలో పూలు చల్లుతూ కార్యకర్తల అత్యుత్సాహం
- ఇస్తానన్న రూ.50 లక్షలు ఇవ్వకుండా ఈ హంగామా ఏంటని ఆశ్చర్యపోయిన గ్రామస్తులు

సాక్షి, అమరావతి: మంగళగిరి నియోజకవర్గం ఇప్పటం గ్రామంలో అధికారులు రోడ్డు పక్కన ఉండే ఆక్రమణలు తొలగించడంపై జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్.. పార్టీ నాయకులను, కార్యకర్తలను వెంట బెట్టుకొని వెళ్లి హడావుడి చేశారు. ఆక్రమణలు తొలగింపులో భాగంగా అధికారులు కొన్ని ఇళ్ల ప్రహరీ గోడలను మాత్రమే కూల్చి వేయగా, గ్రామంలోని తమ పార్టీ అభిమానుల ఇళ్లను ప్రభుత్వం కక్షపూరితంగా కూల్చి వేసిందంటూ హంగామా చేశారు. అధికారులు శుక్రవారం రోడ్లకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలు తొలగించిన ఇప్పటం గ్రామంలో శనివారం పవన్‌కళ్యాణ్ పర్యటించారు. ఉదయం మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి నడుచుకుంటూ బయలు దేరిన ఆయన.. కాసేపటి తర్వాత తాను ప్రయాణించే కారు పైకెక్కి కూర్చొని ఇప్పటం గ్రామం వైపు వెళ్లారు. మధ్యలో నార్త్‌జోన్ డీఎస్పీ రాంబాబు శాంతిభద్రతల సమస్య గురించి పవన్‌కు నచ్చచెబుతుండగా వినిపించు కోకుండా.. 'ఊరుకోండి సార్ మీరు చెబుతారు.. రేప్ చేసిన వారిని రక్షిస్తారు.. కూలగొట్టిన వారికి అండగా ఉంటారు'.. అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. గ్రామంలోకి చేరుకున్నాక, తొలగించిన ఆక్రమణల శిథిలాలను పరిశీలిస్తూ.. కొద్దిమంది స్థానికులతో తీవ్రంగా స్పందించి.. జనసేన అభిమానుల ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా కూల్చివేసిందంటూ ఆరోపించారు. ఆ సమయంలో ఆ పార్టీ నేత ఒకరు.. 'నేను ఈ రోజు మీతో కలిసి ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడతానని చాలెంజ్ చేశాను' అంటూ చెప్పగా.. 'మాట్లాడు' అంటూ పవన్ ఆవేశంగా ఆయనను మీడియా వైపు చూపించారు.

ఇదేమైనా రాజమండ్రా..

రోడ్డు వెడల్పు చేయడానికి ఇదేమన్నా కాకినాడా.. లేదంటే రాజమండ్రినా అంటూ పవన్ ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటి ముందు రోడ్డు 15 అడుగుల పరిధిలోనే ఉందని.. అక్కడ ఇలాంటివి వర్తించవా అని అన్నారు. మార్చిలో జరిగిన తమ పార్టీ ఆవిర్భావ సభకు ఈ గ్రామస్తులు స్థలం ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టి మొన్న ఏప్రిల్‌లో ఆక్రమణల తొలగింపు పేరిట నోటీసు లిచ్చారని చెప్పారు. 'వైసీపీ గూండాలకు చెబుతున్నా.. మీరు ఇలాగే చేస్తా ఉండండి.. ఇడుపులపాయలో మీ మీద హైవే వేస్తాం. గుర్తుపెట్టుకోండి. ఈ ప్రభుత్వాన్ని కూల్చి పడదొబ్బాల్సిందే' అని వ్యాఖ్యానించారు.

రూ.వెయ్యి కోట్లిచ్చి రెక్కీ నిర్వహించుకోండి..

హైదరాబాద్‌లో తన ఇంటి దగ్గర కొందరు తాగుబోతులు గొడవ చేయడాన్ని ఉద్దేశించి పవన్ మాట్లాడుతూ.. 'మీరు నన్ను ఏదో చేయడానికి రెక్కీలు, సుపారీలు, సున్నాలు, కన్నాలు ఏవేవో ప్లాన్ చేస్తున్నారు. రెక్కీ నిర్వహించుకో వడానికి రూ.250 కోట్లు కాకపోతే రూ.వెయ్యి కోట్లు ఇచ్చుకోండి' అని వ్యాఖ్యానించారు. ఇలాంటి పిచ్చి పనులకు పవన్‌కళ్యాణ్ గానీ, జనసేనగానీ భయపడద న్నారు. తాము వెనకడుగు వేసే ప్రసక్తేలేదు, గుర్తుపెట్టు కోండన్నారు. మరోవైపు.. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి డీఫ్యాక్టో ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తు న్నారని.. ఎవరి ప్రాణాలు పోయినా అన్నింటికీ సజ్జలదే బాధ్యత అని హెచ్చరించారు.

వారి భాషలోనే మాట్లాడండి

ఇప్పటం గ్రామ పర్యటన అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలను ఉద్దేశించి మరోసారి పవన్ మాట్లాడుతూ.. 'జన సైనికులకు చెబుతున్నా, ఇక నుంచి వైసీపీ నాయకులు ప్రజాస్వామ్య భాషలో మాట్లాడితే అలాగే మాట్లాడండి. కాదు కూడదు అంటే వారి భాషలోనే మీరూ మాట్లాడండి. కేసులు, బెదిరింపులు, దౌర్జన్యాలు చేస్తామంటే వాటిని ఎదుర్కోవడానికి మీతో పాటు నేను సిద్ధంగానే ఉన్నాను. ఎంతకాలం వీరి అరాచకాలకు భయపడితే అంతకాలం వీరి రాక్షసత్వానికి అంతుండదు. ప్రతి లెక్కకు మీరు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుంది' అని అన్నారు. కాగా, పరామర్శ కోసం గ్రామానికి విచ్చేసిన పవన్‌కళ్యాణ్‌పై పలుచోట్ల పార్టీ శ్రేణులు పూలు చల్లడంపై గ్రామంలో విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే, ఎంపిక చేసిన కొన్ని ఇళ్ల వారిని పవన్ పరామర్శించినా, వారికి ఎలాంటి భరోసా ఇవ్వకపోవడంతో ఆయన పర్యటనపై గ్రామస్తులు పెదవి విరిచారు. గ్రామానికి ఇస్తానన్న రూ.50 లక్షలు ఇవ్వకుండా ఈ హంగామా ఏమిటని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఆస్పత్రులకు వచ్చి చూడండి

- ఆరోగ్యశ్రీపై చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని



చిలకలూరిపేట: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆరోగ్యశ్రీ గురించి మాట్లాడటం అత్యంత హాస్యాస్పదమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆమె శని వారం మీడియాతో మాట్లాడారు. ఆస్పత్రులను సందర్శించి, రోగుల వద్దకు వెళ్లి పలకరించి ఆరోగ్యశ్రీ ఎలా అమలవుతోందో తెలుసుకోవాలని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజాక్షేత్రంలో అభా సుపాలవుతారని సూచించారు. 2007లో దివంగత వైఎస్సార్ 946 ప్రొసీజర్లతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెడితే.. ఇప్పుడు వైఎస్ జగన్ ఏకంగా 3,255కి పెంచారని గుర్తు చేశారు. చంద్రబాబు తన సొంత మనుషులతోనే రాళ్లు వేయిం చుకున్నట్లు అనుమానాలున్నాయన్నారు. ఇప్పటం గ్రామంలో ఏం జరిగిందో ప్రజలకు అంతా తెలుసని మంత్రి రజిని తెలిపారు.

కూల్చింది ప్రహరీలే.. ఇళ్లు కాదు

- జనసేన సభకు స్థలం ఇచ్చిన వారిలో ఒక్కరే విస్తరణ బాధితుడు
- అతనికి కోర్టు స్టే ఇచ్చింది
- జనవరిలోనే టెండర్లు పిలిచినా తప్పుదోవ పట్టించే యత్నం
- అసలు ఒక్క ఇల్లూ కూల్చలేదు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఈ ఏడాది మార్చిలో జనసేన సభకు స్థలం ఇచ్చినం దునే కక్షసాధింపుతో తమ పార్టీ వారి ఇళ్లను పడగొడుతున్నారంటూ పవన్ తప్పుడు ఆరోపణలు చేశారు. మొత్తం 53 ఇళ్లకు సంబంధించి ఆక్రమణలు తొలగింపు చేప డితే అందులో ఒక్కరే జనసేన సభ కోసం స్థలం ఇచ్చారు. అతను కూడా హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో ఆ స్థలం మినహా మిగిలిన స్థలాల్లో ఉన్న ఆక్రమణలను మంగ ళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తొలగించారు. ఏ ఒక్క ఇల్లు కూడా కూల్చలేదు. కేవలం ఆక్రమిత స్థలంలో ఉన్న ప్రహరీలు, చిన్నచిన్న దుకాణాలను మాత్రమే తొలగించారు.

ఇక ఇప్పటం రోడ్డు ప్రస్తుతం 50–60 అడుగుల వరకూ మాత్రమే ఉంది. రికార్డుల ప్రకారం ఆ డొంక రోడ్డు 73 నుంచి 80 అడుగుల వరకూ ఉండాలి. మిగిలిన భూమిని స్థానికులు ఆక్రమించి ప్రహరీలు నిర్మించగా, కొంతమంది షాపులు కట్టి అద్దె లకు ఇచ్చారు. ఈ రోడ్డును రికార్డుల ప్రకారం 73 నుంచి 80 అడుగుల వరకూ విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఏప్రిల్, మే నెలల్లో అధికారులు ఆక్రమణలు తొలగించాలంటూ నోటీసు లిచ్చారు. ఎవరూ స్పందించలేదు. మొత్తం 53 అతిక్రమణలు ఉన్నట్లు గుర్తించగా ఒకరు హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. మిగిలిన 52 అతిక్రమణలను అధికారులు బుధ, గురువారాల్లో తొలగించారు. ఈ రోడ్డు ఆర్ అండ్ బీది కాగా, డ్రెయిన్ల నిర్మాణం, నిర్వహణ మున్సిపల్ కార్పొరేషన్ చూస్తోంది. ఆక్రమ ణలను తొలగించే అధికారం స్థానిక సంస్థలకు ఉంటుంది. అయితే, ఇప్పటం గ్రామంలో 120 అడుగుల వరకూ రోడ్డును విస్త రిస్తున్నారని, ఒక గ్రామంలో అంత రోడ్డు ఎందుకంటూ పవన్‌కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తప్పుడు ప్రచారానికి పూనుకున్నారు. దీనికి ఎల్లో మీడియా కూడా వంతపాడుతోంది.

చట్టప్రకారం నోటీసులు జారీచేసి యాభై శాతం ఆక్రమణలు తొలగించే పనుల చేపట్టారు. ఆక్రమణలు మొత్తం 53 వుండగా పంచాయతీ కార్యాలయం పోను మిగిలిన ఆక్రమణలలో కాపులు 28, రెడ్లు 13, బీసీలు 12 మంది ఉండగా.. కాపు సామాజిక వర్గా నికి చెందిన వ్యక్తులవి మాత్రమే కూల్చుతు న్నట్లు పవన్‌కళ్యాణ్‌తో పాటు మిగిలిన రాజకీయ పార్టీలు రాజకీయాలు చేయడం దుర్మార్గమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులు ఇచ్చాకే పనులు చేపట్టారు



రోడ్డు విస్తరణలో నా ప్రహరీ పోయింది. అధికారులు నాకు నోటీసు ఇవ్వగా దానిని తీసుకుని సహకరించాను. ఇరవై ఏళ్ల కిందట టీడీపీ ప్రభుత్వంలోనే మార్కింగ్ చేశారు. తర్వాత పట్టించుకోలేదు. జనసేన ఇప్పుడు వచ్చింది.. జనసేన నాయకుల గురించి చేశారనేది అపోహే. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను మాత్రమే తొలగించారు. ఇళ్లు తొల గించలేదు. కేవలం రాజకీయాల కోసమే గ్రామంలో అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు.

– లచ్చి వెంకటేశ్వరరావు, ఇప్పటం

జనసేన ఆరోపణలు కరెక్టు కాదు



జనసేన గురించి చేశారనేది పూర్తిగా అవాస్తవం. రోడ్లు వెడల్పుగా లేకపోవడంతో స్కూలు బస్సులు రావడం ఇబ్బందిగా వుంది. ఇప్పటివరకు గ్రామంలో అందరం అన్నదమ్ముల్లా ఉన్నాం. రాజకీయాల కోసం గ్రామాభివృద్ధిని అడ్డుకోవడంతో పాటు గ్రామంలో అశాంతిని సృష్టించొద్దు.

– వీరంకి బాజి, ఇప్పటం

ఎవర్ని పరామర్శిస్తారు



పవన్‌కళ్యాణ్ ఇప్పటం వచ్చి ఎవరిని పరామర్శిస్తారు. ఆక్రమణలు తొలగించారు కాని ఏ ఒక్క ఇల్లు కూల్చలేదు. పవన్ సభకు భూములిచ్చిన ఏ ఒక్కరి స్థలం పోలేదు. ఒక్కరే కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఆర్కే రూ ఆరు కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. పవన్‌కు చిత్తశుద్ధి ఉంటే తన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో ప్రకటించిన విధంగా గ్రామానికి రూ.50 లక్షలు ఇవ్వాలి.

– మోదుగుల బ్రహ్మారెడ్డి, ఇప్పటం

పవన్‌ది ఉన్మాద రాజకీయం

మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం

సాక్షి, అమరావతి: పవన్‌కళ్యాణ్ ఉన్మాద రాజకీ యాలతో రాష్ట్రాన్ని ప్రమాదంలోకి తీసుకెళ్తున్నాడని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాల యంలో శనివారం ఆయన మీడియాతో మాట్లా డుతూ.. చంద్రబాబు సహకారంతో ప్రభుత్వాన్ని కూల్చేయాలని అజ్ఞానం, అవివేకం, నిరాశ, నిస్పృ హలతో వ్యాఖ్యలు చేస్తున్నాడని విమర్శించారు. 'ఈ ప్రభుత్వాన్ని కూల్చిపారదొబ్బండి అంటూ పవన్ మాట్లాడుతున్నాడు. కూల్చిపారేయడానికి ఇదేమీ సినిమా సెట్టింగ్ కాదు. సినిమా షూటింగ్ అంతకంటే కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం. దీనిని కూల్చే దమ్ము ఎవరికీ లేదు' అని అంబటి స్పష్టంచేశారు. ఈనాడు పత్రికలో ఇళ్ల కూల్చివేతపై పచ్చి అబద్ధపు రాతలు రాస్తే.. చంద్రబాబు సల హాతో పవన్ ఇప్పటంలో రంకెలేసి వెళ్లాడన్నారు. వాస్తవానికి చంద్రబాబుపై రాళ్లు, పవన్‌పై రెక్కీ అంతా బోగస్, ప్రీ ప్లాన్ కుట్రలన్నారు. పవన్ కళ్యాణ్‌ను భౌతికంగా లేకుండా చేయాల్సిన అవ సరం ఎవరికీ లేదన్నారు. రెక్కీ నిర్వహించి, రూ.250 కోట్ల సుపారీ ఇవ్వాల్సిన పనిలేదని.. అందులో సగం పవన్‌కు ఇస్తే వాళ్ల ఇంటికే తోకూపు కుంటూ తిరుగుతాడని ఎద్దేవా చేశారు. అంబటి ఇంకా ఏమన్నారంటే..

పవన్‌లో ఏదో తేడా ఉంది

ఇడుపులపాయపై నేషనల్ హైవే వేస్తాడా? పవన్‌లో ఏదో కొంత తేడా ఉంది. దానిని సరిచే సుకోవాలి. మొన్న బూతులు మాట్లాడుతూ.. కాళ్లకు వేసుకోవాల్సినవి చేతులతో పట్టుకున్నాడు. తాగి డ్యాన్సులు చేసిన వారిని చూసి తనపై రెక్కీచే శారని గగ్గోలు పెట్టాడు. తెలంగాణ పోలీసులు వాస్తవం నిగ్గుతేల్చినా ఇప్పటంలో మళ్లీ అదే ఏడుపు. చంద్రబాబు, పవన్ కలిసి తప్పుడు మాట లను ప్రజల్లో వ్యాప్తిచేసి వారి గ్రాఫ్‌ను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల ముసుగులు తొలగిపోయిన తర్వాత ఉన్మాదిలా కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేలా ఉపన్యాసాలు ఇస్తు న్నాడు. ప్రజలను రెచ్చగొట్టి ఘర్షణలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ, ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటం ప్రజలు రూ.50 లక్షలు అడిగితే సమాధానం చెప్పట్లేదు.

కుక్క తోకతో గోదావరి ఈదొద్దు

కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదొద్దని పవన్ అభి మానులకు మనవి చేస్తున్నా. 175 సీట్లలో రాజ్యాం గబద్ధంగా పోటీచేసి గెలవండి. అంతేకాని.. ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ధిపొందాలనుకోవడం మంచిది కాదు. మా దగ్గర గూండాలు, రౌడీలులేరు. వారి అవసరం మాకులేదు. అటువంటి వారు పవన్ దగ్గరే ఉన్నారు. ఎక్కడైనా అభివృద్ధి చేస్తున్నప్పుడు అడ్డంవస్తే ఎవరి విగ్రహాన్నైనా తొలగిస్తాం. మళ్లీ వాటిని తిరిగి భద్రంగా ప్రతిష్టిస్తాం. ఈ విషయంలో పవన్ చేస్తున్న ఆరోపణలు అర్థరహితం.

పవన్ సభ కన్నా ముందే మార్కింగ్

ఇప్పటంలో ఇళ్ల కూల్చివేతలపై ఈనాడు పత్రిక అసత్య రాతలు రాస్తోంది. ఒక్క ఇంటినైనా కూల్చినట్లు చూపించమని సవాల్ చేస్తున్నా. అభివృద్ధిలో భాగంగా ఆక్రమణల తొలగింపు సర్వసాధారణం. ఇంతకుముందు ప్రభుత్వాల్లో ఎప్పుడూ చేయలేదా? మంగళగిరి కార్పొరేషన్ అధికారులు పెదవడ్లపూడి నుంచి ఇప్పటం వరకు పెద్దరోడ్డు వేయాలన్న దృక్పథంతో జన వరిలో మార్కింగ్ చేశారు. పవన్ సభకంటే ముందే పనులు చేపట్టారు. అక్కడ టీడీపీ, జన సేన వారికి కూడా అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న విషయం తెలుసుకోవాలి.

నేడు దక్షిణ కోస్తాలో తేలికపాటి జల్లులు

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ కోస్తాలో అక్కడ క్కడా ఆదివారం తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం అల్పపీ డన ద్రోణి, ఉపరితల ఆవర్తనాలు లేవు. అయినా ఆదివారం దక్షిణ కోస్తాంధ్రలో అక్క డక్కడా తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని, సోమ, మంగళవారాల్లో రాష్ట్రమంతా పొడి వాతావరణం ఉంటుందని, భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం రాత్రి నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి. శని వారం ప్రకాశం జిల్లా మార్కాపురంలో 2.6, చిత్తూరు జిల్లా గుడిపాలలో 2.1 సెం.మీల వర్షపాతం నమోదైంది.

బాబు డైరెక్షన్‌లోనే పవన్: మంత్రి రోజా



తిరుమల: రాష్ట్రంలో జరుగుతోన్న అభివృ ద్ధిని చూసి ఓర్వలేక బాబు అండ్ కో ఆరో పణలు చేస్తున్నారని మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. శ్రీవారి కల్యాణోత్సవంలో ఆమె తన భర్త సెల్వమ ణితో కలిసి శనివారం పాల్గొన్నారు. అనం తరం ఆలయం వెలుపల రోజా మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ కళ్యాణ్ నడుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే అడ్డు కుంటారని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు పవన్ కళ్యాణ్ ఏం ఉద్ధరించాడని ఇప్పటం వెళ్తున్నా రని ప్రశ్నించారు. అక్కడ ప్రజలకు ఆరు నెలల ముందే నోటీసులు ఇచ్చామని చెప్పారు. దా నికి ప్రజల అంగీకారం తెలిపారని గుర్తు చేశా రు. గడిచిన మూడేళ్లలో చేసిన అభివృద్ధి ఏమి టో చర్చించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

పవన్ పిచ్చికూతలు.. బాబు చెత్త ట్వీట్లు

మంత్రి జోగి రమేష్ ఫైర్

సాక్షి, అమరావతి: కుట్ర రాజకీయాల్లో భాగంగానే పవన్‌కళ్యాణ్ ఇప్పటం గ్రామంలో ప్రభుత్వంపై పిచ్చి కూతలు కూస్తున్నాడని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు. తాడేప ల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శని వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వీకెం డ్‌లో ప్యాకేజీ స్టార్ వచ్చి నాలుగు సినిమా డైలా గులు చెప్పి.. కథలు అల్లి రాజకీయాలు చేసుకునే వ్యక్తి రక్తాలు చిందిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొ డుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పార్ట్–1 రెక్కీ, పార్ట్–2 రాయి, పార్ట్–3 ఇప్పటంలో ఇళ్ల కూల్చివేతతో మూడ్రోజు లుగా సీరియల్ డ్రామా నడిపిస్తున్నారన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఇప్పటం గ్రామంలో ఒక్క ఇంటిని కూడా కూల్చలేదు. అక్కడ రోడ్డు విస్త రణ పనులతో తమ గ్రామం అభివృద్ధి చెందుతుం దని, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. జనవరిలో విస్తరణలకు మార్కింగ్ ఇస్తే, ఏప్రిల్–మే నెలల్లోనే మొదటి విడత పనులు ప్రారంభమయ్యాయి. కానీ, తన సభకు స్థలం ఇచ్చారనే కక్షతో ప్రభుత్వం ఇళ్లు కూల్చేసినట్లు పవన్ ఆరోపిస్తుంటే, సిగ్గులేకుండా తానా తందానా అంటూ చంద్రబాబు చెత్త ట్వీట్లు పెడుతున్నాడు. అలాగే, ఇప్పటంలో టీడీపీ, జన సేన పార్టీ వాళ్ల ఇళ్లు కూల్చేశారంటూ పచ్చ పత్రిక ఈనాడులో పిచ్చి రాతలు రాశారు. కళ్లుండి చూడ లేని రామోజీరావు హైదరాబాద్‌లో కూర్చుని నిత్యం సీఎం జగన్ ప్రభుత్వంపై విషం చిమ్ముతు న్నారు. రామోజీ ఇప్పటం వచ్చిచూస్తే వాస్తవాలు తెలుస్తాయి.

కూల్చివేతలకు కేరాఫ్ చంద్రబాబు

కూల్చివేతలపై మాట్లాడే నైతిక అర్హత చంద్రబా బుకు లేదు. ఆయన హయాంలో పుష్కరాల పేరు తో అనేక ఇళ్లను, గుళ్లను కూల్చేశారు. ఇబ్రహీంప ట్నంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని అర్ధరాత్రి కూలగొట్టించి.. బుడమేరు కాల్వలో పడేశారు. మేం అధికారంలోకి వచ్చాక గాంధీ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాం. అలాగే, ఇప్పటంలో గాంధీ, ఇందిరా గాంధీ విగ్రహాలను ధ్వంసం చేసినట్లు ఓ వర్గం మీడియా దుష్ప్రచారం చేస్తోంది. వాటిని పంచా యతీ కార్యాలయంలో భద్రంగా ఉంచాం. త్వర లోనే మళ్లీ ప్రతిష్టిస్తాం. ఆక్రమణల తొలగింపులో భాగంగా రాజశేఖర రెడ్డిగారి విగ్రహం దిమ్మెను కూడా పగులగొట్టారు. ఇక 'ఉట్టికి ఎగరలేనమ్మ.. స్వర్గానికి ఎగురుతానందని' ఇడుపులపాయపై హైవే వేస్తామంటూ పిచ్చి కళ్యాణ్ ప్రేలాపనలు చేస్తున్నాడు. గతంలో ఇప్పటంలో సభ పెట్టి గ్రామా నికి రూ.50 లక్షలు ఇస్తానని కోతలు కోశాడు. ముందు వాటిని ఇచ్చి చూపించాలి.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే పవన్ పనిగా పెట్టుకుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తేలేదు. రూ.250 కోట్ల సుపారీ ఇచ్చి తనపై రెక్కీ నిర్వహించారని చెప్పడం.. రెండ్రో జులు డ్రామా నడపడం సిగ్గుచేటు. రెక్కీపై తెలం గాణ పోలీసులు వాస్తవాలు చెబితే.. వీళ్ల దిమ్మతిరి గింది. పవన్ నీ జోలికి ఎవడు వస్తాడు? నీకు నష్టం చేస్తే తద్వారా లబ్ధిపొందేది ఒక్క చంద్రబాబే. రెక్కీలు, సుపారీలు చేస్తే ఆయనే చేయాలి.

జగన్ సర్కార్‌ను ఇంచు కూడా కదల్చలేరు..

కుప్పకూలిపోయిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు మా ప్రభుత్వాన్ని కూల్చుతామంటూ కలలు కంటు న్నారు. వీరిద్దరికీ ఒక్కటే చెబుతున్నా.. మా నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంచు కూడా కదల్చలేరు. ప్రభుత్వాన్ని అస్థిరపర చాలని మీరు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు, వీధి నాటకాలు ప్రజలు గమనిస్తున్నారు. చంద్రబాబుకి దమ్ముంటే 175 స్థానాల్లో టీడీపీ ఒంటరిగా పోటీ చేసి ముఖ్యమంత్రి అవుతానని చెప్పాలి. 2024 ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబు, మంగళగిరిలో లోకేశ్, భీమవరం, గాజువాకల్లో ఎక్కడ పోటీచేస్తే అక్కడ పవన్ ఓటమి ఖాయం.



నీతి మార్గమునందు జీవము కలదు.
దాని త్రోవలో మరణమే లేదు.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం
దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం
తిథి: శు.త్రయోదశి సా.4.25 వరకు
తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** రేవతి రా.12.51 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప.12.07 నుండి 2.34 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.54 నుండి 4.37 వరకు, **అమృతఘడియలు:** రా.10.26 నుండి 12.01 వరకు.

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం : 5.25
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కేఏ పాల్ (మునుగోడు అభ్యర్థి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"కేఏ పాల్‌జీ, మీ బ్లెస్సింగ్ కావాలి.." అన్నారు నరేంద్ర మోదీ రాత్రి ఒంటి గంట సమయంలో నాకు ఫోన్ చేసి!

అప్పుడది నేను ఇంటర్నేషనల్ కాల్స్‌లో ఉండే సమయం. నేషనల్ కాల్‌కి ఆన్సర్ చెయ్యాలా, వద్దా అని కొన్ని క్షణాలు ఆలోచించి.. "మిస్టర్ మోదీ! కొద్ది సమయం మీరు వేచి ఉండగలరా?" అని అడిగాను.

"అలాగే పాల్‌జీ! కాల్ కట్ చేయకుండా కాల్ లోపలే ఉండి వేచి ఉండమంటారా లేక కాల్ కట్ చేసి, కాల్ బయట వేచి ఉండమంటారా.." అని అడిగారు మోదీ.

బ్రిటన్ పీఎం రిషి సునాక్ కాల్‌ని హోల్డ్‌లో ఉంచి, ఇండియన్ పీఎం నరేంద్ర మోదీ కాల్‌ని లిఫ్ట్ చేసి మాట్లాడుతూ ఉన్నప్పుడు, రష్యన్ ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ నా కోసం ట్రై చేస్తూ ఉండటం హాట్ లైన్‌లో నాకు కనిపిస్తూ ఉంది.

"మిస్టర్ మోదీ! మీరు కాల్ లోపల ఉన్నా కాల్ బయట ఉన్నా నేను మీకు బ్లెస్సింగ్ ఇవ్వగలను.." అని మోదీ లైన్‌ని కట్ చేసి, హోల్డ్‌లో ఉన్న రిషి సునాక్ కాల్‌ని లిఫ్ట్ చేశాను.



"మీరే ఏదైనా చెయ్యాలి.. " అంటున్నారు వణుకుతున్న కంఠంతో రిషి సునాక్! అతడు ఆందోళన చెందుతున్నది తనకు ముందుండి వెళ్లిన బ్రిటన్ ప్రధాని లిజ్ ట్రస్ గురించి.

"ఏమైంది ఆవిడకు మిస్టర్ రిషీ" అని అడిగాను.

"ఆవిడకేం కాలేదు. ఆవిడలా నాకు అవుతుందేమోనని! బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించడానికి మీరే ఏదైనా చేయాలి మిస్టర్ కేఏ పాల్. కనీసం లిజ్ ఉన్నన్ని రోజులైనా నేను బ్రిటన్ ప్రధానిగా ఉండలేకపోతే భారత్‌కే కదా అప్రతిష్ఠ..." అంటున్నారు సునాక్!

"డోంట్ వర్రీ మిస్టర్ సునాక్. మీకు లక్ష బిలియన్ పౌండ్‌లు వచ్చేలా అమెరికన్ ప్రెసిడెంట్ జో బైడెన్‌తో మాట్లాడతాను. అయితే వాటిని డాలర్‌ల నుంచి పౌండ్‌లలోకి మార్చుకునే బాధ్యత మాత్రం మీదే. ఇబ్బందేమీ లేదు కదా..?" అని అడిగాను.

"థ్యాంక్యూ మిస్టర్ పాల్. సో కైండ్ ఆఫ్ యు.." అన్నారు సునాక్.

తర్వాత పుతిన్ కాల్ తీసుకున్నాను.

"మిస్టర్ పాల్, మీ మోదీజీ ఎంతసేపటికీ 'ఇది యుద్ధాల కాలం కాదని' అంటున్నారే కానీ, యుద్ధాన్ని ఎలా ఆపాలో అది మాత్రం చెప్పలేకపోతున్నారు. మాకిప్పుడు అర్జెంటుగా శాంతి కావాలి. ఉక్రెయిన్‌కి చెప్పి యుద్ధాన్ని ఆపించగలరా? అయితే.. మా అంతట మేము ఆపినట్లు కాకుండా, కేఏ పాల్ చెబితే తప్పనిసరై మేము ఆపినట్లుగా ప్రపంచం అర్థం చేసుకోవాలి.." అని డీలా పడిన గొంతుతో అభ్యర్థిస్తున్నారు పుతిన్!

"ష్యూర్ మిస్టర్ పుతిన్! అయితే ఆదివారం మేమిక్కడ మునుగోడు విక్టరీ ఉత్సవాల్లో ఉంటాం. అవయ్యాక ఉక్రెయిన్ ప్రెసిడెంట్‌తో డైరెక్టుగా మాట్లాడతాను. సరేనా?" అన్నాను.

"మునుగోడు! వాట్ మునుగోడు?" అన్నారు పుతిన్.

"ఇట్స్ కైండ్ ఆఫ్ వార్ మిస్టర్ పుతిన్. ఆ వార్ గురించి మీకు అర్థమయ్యేలా చెప్పమని మిస్టర్ మోదీకి చెబుతాను లెండి.." అని అంటూ ఉన్నాను.. మోదీ నుంచి మళ్లీ ఫోన్! "పాల్‌జీ! మీ బ్లెస్సింగ్స్ ప్లీజ్.." అని!

నేను కాల్ బ్యాక్ చేసేవరకు మోదీ ఆగలేకపోయారంటే.. గుజరాత్ ఎన్నికల్లో నన్ను బీజేపీ తరఫున ప్రచారానికి ఒప్పించేందుకేనని నేను సరిగ్గానే ఊహించాను.

కాల్స్ అన్నీ పూర్తయేసరికి ఉదయం ఐదైంది. మరో రెండు గంటల్లో మునుగోడు ఓట్ల లెక్కింపు. వార్ వన్ సైడే. టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల ఓటమి.. ముందే డిసైడై పోయింది. కనీసం 50 వేల ఓట్ల మెజారిటీతో మునుగోడు ఎమ్మెల్యేగా విజయం సాధించినదెవరో దేశం ఇవాళ అన్ని టీవీ చానళ్లలో చూడబోతోంది.

"స్నానానికి నీళ్లు పెట్టమంటారా పాల్ సార్..." అని అడిగాడు.. నాతో పాటు పోలింగ్ రోజు బూత్‌ల వెంట పరుగులు తీసిన ప్రజాశాంతి పార్టీ యువ కార్యకర్త.

"కేసీఆర్ వచ్చి మనల్ని అభినందనల జల్లుల్లో తడిపేశాకే బ్రో.. స్నానం.." అన్నాను.

రామోజీ - బాబోజీ అండ్ కో...

జనతంత్రం



వర్ధెల్లి మురళి

షాపూర్‌జీ - పల్లోంజీ అనేది దేశంలో ఒక పెద్ద రియల్ ఎస్టేట్ గ్రూప్. ఇలా జంటశ్రీల పేర్లతో జాయింట్ వ్యాపార సంస్థలు దేశంలో చాలా ఉన్నాయి. వీటన్నింటిలోకీ అత్యంత సృజనాత్మకమైన గ్రూప్ రామోజీ - బాబోజీ గ్రూప్! వారు తెలుగువారు కావడం తెలుగు వారందరూ ఫేస్ టర్నింగ్ ఇచ్చుకోవలసిన విషయం. అందరికీ మల్లేనే వీరికీ విడివిడిగా సంప్రదాయ వ్యాపారాలున్నాయి. పచ్చళ్లు, పాలు, పెరుగు, పూటకూళ్ల హోటళ్లు, పత్రికలూ వగైరా! వేరువేరుగా ఇన్ని వ్యాపార పీస్‌లున్నప్పటికీ వారు మాత్రం నాట్ హ్యాపీస్!

బొంబాయి మాఫియా మీద వచ్చిన అన్ని సినిమాల్లోనూ 'వుడ్ బీ డాన్'లు కామన్‌గా చెప్పే డైలాగ్ ఒకటి ఉంటుంది. 'నేను బొంబాయిలో బతకడానికి రాలేదు, బొంబాయిని ఏలడానికి వచ్చాన'ని! రామోజీ, బాబోజీ హృదయాల్లో కూడా ఇటువంటి కోరికలే ఆరని అగ్నిజ్వాలలై భగభగ మండుతూ ఉండేవని వారి బయోగ్రఫీని తిరగేస్తే మనకు అర్థమవుతుంది. నువ్వాదరినీ, నేనీదరినీ అన్నట్టుగా వేరువేరు చోట్ల మండుతున్న ఈ రెండు కంచు కాగడాలను విధియాడిన వింత నాటకం ఒక చోటకు చేర్చింది.

ఇంకేముంది! ప్రళయం రానే వచ్చింది. ఆకాశంలోని పక్షులన్నీ భయంతో అరుస్తూ రెక్కలు అల్లాడిస్తూ నేలకు రాలి పడ్డాయి. అచ్చం అలాగే ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న చిన్నచిన్న చిట్‌ఫండ్ కంపెనీలన్నీ రాలిపడ్డాయి. సూర్యుడు భగభగ మండుతూ అగ్నిగోళంలా దర్శనమిస్తాడు. ఫలితంగా భూమ్మీద ప్రజాస్వామ్యంలో దొంగలు పడ్డారు. చంద్రుడు బాబోజీ అనే అర్భకుడు రామోజీ సహకారంతో వెన్నుపోటు విద్యను ఉపయోగించుకొని దొడ్డిదారిన రాజ్యాధికారం చేపట్టాడు. చరిత్ర ఎరుగని వింతలు - విడ్డూరాలు ఒకదాని వెంట మరొకటి తరుముకుంటూ పరిణమించాయి.

బిజినెస్ మ్యాన్ బాబోజీ అలియాస్ పొలిటికల్ చంద్రబాబుకు సంబంధించిన రాజకీయ ప్రస్థానం తెలుగు ప్రజలకు చర్వితచర్వణమే. అతనిలోని నివురుగప్పిన బిజినెస్ నిప్పును రాజేయగల పెట్టుబడికి స్వయంగా స్తోమత లేదు. రెండెకరాల పేద రైతు కుటుంబం. అందుకని రాజకీయ రూట్‌లో నరుక్కు రావాలని సంకల్పించారు. ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత కాంగ్రెస్ పార్టీ చీలిపోయింది. ఇందిరా కాంగ్రెస్ టిక్కెట్ కావాలనే పేరున్న నాయకుడు ఎవరూ మిగల్లేదు. ఏదో ఒక పార్టీ టిక్కెట్ పాలిటిక్స్‌కు పాస్‌పోర్టుగా పనికొస్తుందని చంద్రబాబు చంద్రగిరి నుంచి దరఖాస్తు చేసుకున్నారు.

జాక్‌పాట్ తగిలినట్లయింది. ఇందిరమ్మ ప్రభంజనం రాష్ట్రాన్ని కమ్మేసింది. అనూహ్యంగా చంద్రబాబు ఎమ్మెల్యే అయ్యారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి అంజయ్యను ప్రసన్నం చేసుకోగలిగారు. మంత్రిపదవి లభించింది. బిజినెస్ మ్యాన్‌కు పెట్టుబడి దొరికింది. పెళ్లికాని యువకుడు, తమ సామాజికవర్గం వాడు మంత్రిపదవిలో ఉండడంతో ఎన్టీఆర్ తన కూతురిని ఇచ్చి పెళ్లి చేశారు. బిజినెస్ మొదలైంది. తొలిమెట్టుగా తిరుపతి పుణ్యక్షేత్రంలోనే సొంత స్నేహితుల్ని మోసం చేసి ఒక హోటల్‌ను సొంతం చేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఇటువంటి మోసపు మెట్లనే ఒక్కొక్కటిగా పేర్చుకుంటూ హెరిటేజ్ భవంతిని నిర్మించుకున్నారు. హెరిటేజ్ వ్యవహారంలో బాబు తనను మోసం చేశాడని మోహన్‌బాబు వంటి సెలబ్రిటీయే వాపోయిన సంగతి తెలిసిందే. కాలక్రమంలో చంద్రబాబుకు రామోజీతో ఒక సహకార ఒప్పందం కుదిరింది. 'నీకిది - నాకది' అనే సూత్రంపై కుదిరిన సహకార ఒప్పందం ఫలితంగా బాబు ముఖ్యమంత్రి అయ్యారు. రాజకీయం ఆయన బిజినెస్‌గా మారింది. బిజినెస్‌లు బినామీ పేర్లతో ఖండాంతరాల్లో ప్రవర్ధమానమవుతున్నాయన్న వార్తలు వచ్చాయి.

అడ్డగోలుగా సంపాదించాలనుకునే చాలామందికి రామోజీ కథ చాలా ఉత్తేజభరితమైనది. అనుసరించిన మార్గం ఏదయితేనేమి ఆయనొక వ్యాపార మహాసామ్రాజ్యాన్ని నిర్మించగలిగారని ఈ బ్యాచ్‌వారు కీర్తిస్తుంటారు. ఆరంభంలో చేరదీసిన జేజే రెడ్డి అనే శ్రేయోభిలాషికి రామోజీ శఠగోపం పెట్టారనే ఆరోపణలు వచ్చాయి. ఆ తరువాతనే ఆయన ప్రస్థానం వేగం పుంజుకున్నదట! 'ఈనాడు' పత్రిక కోసం విశాఖలో స్థలాన్ని అద్దెకు ఇచ్చిన రాజుగారిని మానసిక హింసకు గురిచేశారు. అదే రాజుగారు హైదరాబాద్ స్థలాన్ని కూడా లీజుకిచ్చారు. అక్కడ కూడా ఆయనకు చుక్కల్ని చూపించారట! విజయవాడ స్థలాన్నిచ్చిన సొంత తోడల్లుడు కూడా తర్వాత ఘొల్లుమనడం అందరికీ తెలిసిన విషయమే! 'ఒకటా రెండా? ఎన్నని చెప్పను మా బాబాయి లీలలు' అంటూ రామోజీ సోదరుని కుమారుడు చంద్రమౌళి ఏకంగా ఒక పుస్తకాన్నే రచించి జనంలోకి వదిలారు.

మూడు మోసాలు - ఆరు వంచనలతో ఇలా సాగుతున్న రామోజీ వ్యాపార ప్రస్థానం చంద్రబాబుతో కుదిరిన సహకార ఒప్పందం తర్వాత మరో మలుపు తిరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థ మూడు ప్రధానాంగాలపై ఆధారపడి పనిచేస్తుంది. శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాలు ఈ ప్రధానాంగాలు. వాటితోపాటు ఆరోగ్యకరమైన మీడియా కూడా ప్రజాస్వామ్య పరిపుష్టికి దోహదం చేస్తుందన్న విశ్వాసంతో దాన్ని 'ఫోర్త్ ఎస్టేట్'గా పిలిచి గౌరవించారు. అధికారంలో ఉన్నప్పుడు శాసన, కార్యనిర్వాహక విభాగాలను వారి వ్యాపార ప్రయోజనాలకే వాడుకున్నారు. వారి ప్రయోజనాలనే లోకకల్యాణంగా ప్రచారం చేసుకోవడానికి ఫోర్త్ ఎస్టేట్ మీద వారు సాధించిన ఆధిపత్యం తోడ్పడింది. లిటిగెంట్ వ్యూహాలతో, నాట్ బిఫోర్, బెంచ్ హంటింగ్ వంటి ఎత్తుగడలతో అనుకూల తీర్పులు వచ్చేలా చేసుకోవడంలో ప్రావీణ్యం సాధించారు.



ప్రజాస్వామ్యంలో అంతిమంగా ప్రజల చేతిలో ఉండవలసిన రాజదండాన్నీ ఈ ముఠా చేజిక్కించుకున్నది. వ్యవస్థల మీద పట్టుతో, మ్యానిపులేషన్లతో సకల వనరుల మీద కూడా వ్యాపార భాగస్వాములు అదుపు సాధించారు. చెరువుల్ని, గుట్టల్ని, రహదారుల్ని యథేచ్ఛగా ఆక్రమించి, చట్టాన్ని చట్టుబండగా మార్చి రామోజీ ఫిలింసిటీ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. చట్టవిరుద్ధంగా వేలకోట్ల రూపాయలు డిపాజిట్లుగా సేకరించి సొంత వ్యాపారాలకు మదుపు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే పునాది వేసిన ఐటీ టవర్స్ విషయాన్ని మూడేళ్లపాటు తొక్కిపెట్టి తమ బినామీలు, ముఠా సభ్యులతో దానిచుట్టూ రియల్ ఎస్టేట్ బేరాలు చేసిన అనంతరమే నిర్మాణాన్ని ప్రకటించారు. ఈ వ్యవహారంతో వేల కోట్ల రూపాయల లాభాన్ని వీరి ముఠా కళ్లచూడగలిగింది.

మాదాపూర్ ఐటీ ప్రాంతంలో జరిగిన వ్యాపారాన్ని సూక్ష్మరూపంగా భావిస్తే అమరావతి రాజధాని ప్రాంతం విశ్వరూపంగా పేర్కొనవచ్చు. ఈ ముఠా వేల కోట్లలో ఇక్కడ పెట్టుబడి పెట్టి ఉండవచ్చని అంచనాలున్నాయి. లక్షల కోట్లలో లాభాలు పిండుకోవాలని తహతహలాడారు. ఎన్నికల్లో చంద్రబాబు ఓటమితో కథ అడ్డం తిరిగింది. ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ భిన్నమైన పాలనా విధానాన్ని ఎంచుకోవడం ఈ వ్యాపార ముఠాకు మింగుడు పడలేదు. జగన్ ప్రభుత్వం అధికార వికేంద్రీకరణ మార్గాన్ని ఎంచుకున్నది. అధికార యంత్రాంగం ప్రజలకు చేరువగా వెళ్లడం వలన పారదర్శకత పెరుగుతుందనీ, తద్వారా అవినీతికి అవకాశం చిక్కదనీ ఈ ప్రభుత్వ ఆలోచన. దీనికితోడు టెక్నాలజీ వినియోగం ద్వారా ఒక్క పైసా వృథా కాకుండా నేరుగా లబ్ధిదారులకు చేర్చేవిధంగా కార్యక్రమాలను తయారు చేసుకున్నది.

మరోపక్క ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో కాలం చేసిన గాయాలను గమనంలోకి తీసుకొని, మరోసారి గాయపడితే మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్న నిర్ధారణతో మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఇదొక వినూత్న ఆలోచన. విస్తృతస్థాయిలో రాష్ట్ర ప్రజలకు మేలు జరిగే ప్రతిపాదన. కానీ బాబోజీ - రామోజీ కంపెనీతోపాటు దాని అనుబంధ కంపెనీలకూ గుండెల్లో అణుబాంబు పేలినట్లయింది. ఈ ప్రభుత్వాన్ని తక్షణం గద్దె దింపవలసిన అగత్యం ఈ వ్యాపార ముఠాకు ఏర్పడింది. లక్షల కోట్ల కల గాలిలో దీపంలా మారడంతో ప్రభుత్వం మీద ఈ ముఠా యుద్ధాన్ని ప్రకటించింది.

ఉచ్చమూ - నీచమూ అన్న ఇంగితం లేదు. న్యాయమూ - అన్యాయమన్న విచికిత్స లేదు. ధర్మమూ - అధర్మమన్న విచక్షణ లేదు. ప్రభుత్వం మీద బండలేయడమే ఏకైక కర్తవ్యంగా మారింది. ఈ కర్తవ్యంలో భాగమే ప్రతిరోజూ జరుగుతున్న విష ప్రచారం. రామోజీ పత్రిక ఛీనాడులో ప్రతిరోజూ శాపనార్థాలే బ్యానర్లు. ప్రజలకు ఉపాధి కల్పించే పరిశ్రమలకు ముఖ్యమంత్రి స్వయంగా శంకుస్థాపన చేస్తే అది లోపల పేజీ వార్తగా మారింది. ఒక గ్రామంలో రోడ్డు విస్తరణ కోసం ఇళ్ల ప్రహరీ గోడలను కూల్చేస్తే అది ప్రభుత్వ కక్ష అనే బ్యానర్ వార్తగా మారింది. అప్పటికే ఆ వరసలో యాభై ఇళ్ల ప్రహరీ గోడలు కూల్చారనీ, అందుకు ఆ ఇళ్ల యజమానులు సమ్మతించారనే వాస్తవాన్ని మాత్రం ఈ యెల్లో మీడియా విస్మరించింది. అంగీకరించని ముగ్గురు జనసేన కార్యకర్తల ఇళ్ల దగ్గరే 'కక్ష' సాధింపు రంగంలోకి వచ్చింది. పత్రికలో బ్యానర్ వార్త మాత్రమే సరిపోదని పాలిటిక్స్‌లో జూనియర్ ఆర్టిస్టుగా ఉన్న పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దించారు. ఆయన తన శాయశక్తుల ఓవరాక్టింగ్ చేసి వెళ్లారు. అయ్యన్నపాత్రుడు అనే సీనియర్ రాజకీయవేత్త అమ్మనాబూతులు మాట్లాడుతుంటే ఛీనాడుకు కమ్మగా తోచింది. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే, అందుకోసం ఒక రెవెన్యూ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేస్తే అయ్యన్నలో ఛీనాడుకు చిలిపితనం కనిపించింది. చేసింది తప్పు కనుక ప్రభుత్వం అరెస్ట్ చేస్తే ఛీనాడుకు కక్షసాధింపుగా కనిపించింది.

వ్యక్తిగత ఫిర్యాదుతో సీఎం క్యాంపు కార్యాలయం దగ్గర ఒక మహిళ చేతికి గాయం చేసుకున్నది. ఇది ఛీనాడుకు బ్యానర్ శీర్షిక 'నేను వినను, నేను కనను'! అంటే ముఖ్యమంత్రి ప్రజల సమస్యలను అస్సలు పట్టించుకోవడం లేదని దాని భావన. అంతకు ముందురోజే అధికారులతో స్పందన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. స్పందన కార్యక్రమాన్ని మరింత క్రియాశీలకంగా చేయాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం కోసం మరింత మెరుగైన వ్యవస్థను తయారుచేయాలని నిర్దేశించారు. ఈ సంగతిని మాత్రం ఛీనాడు రాయలేదు.

అధికార యంత్రాంగాన్ని ప్రజల గుమ్మం దగ్గరకు చేర్చడంలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి యావత్తు భారతదేశ చరిత్రలో సాటిలేనిది. ఒకటో తేదీ తెల్లవారుజామున వెలుగు రేకలు విచ్చుకోకమునుపే పెన్షన్ డబ్బులు చేతికందిస్తున్న రెండున్నర లక్షలమంది వలంటీర్ల మోముల్లో అవ్వాతాతలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిరూపాన్ని చూసుకుంటున్నారు. ప్రతి పల్లెలో, ప్రతి వీధిలో సేవకు సిద్ధంగా నిలబడిన సచివాలయాల సిబ్బందిలో ప్రజలకు జగన్ ప్రభుత్వం రోజూ కనిపిస్తూనే ఉన్నది. ఉద్యోగులే కాదు, ఎమ్మెల్యేలూ, మంత్రులు సైతం 'గడప గడపకూ జగన్ ప్రభుత్వం' పేరుతో నిత్యం జనంలోనే తిరుగుతున్నారు. వారంతా జగన్ పంపితే వస్తున్నారని ప్రజలకు తెలియదా? 'ఫ్యామిలీ డాక్టర్' ట్రయల్ రన్ జరుగుతున్నది. ఎవరికి నుస్తీ చేసినా వారింటికే డాక్టర్ రాబోతున్నాడు. ఇక మీదట జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటి ఫ్యామిలీ డాక్టర్ కూడా! ఇంతకంటే ప్రజలకు చేరువైన నాయకుడు ఈ దేశంలో ఇంకెవరున్నారో చెప్పమంటే ఏం చెబుతారు? అటువంటి జగన్‌మోహన్‌రెడ్డి 'నేను వినను - నేను కనను' అంటున్నాడని శీర్షిక పెడతారా? ఇది సిగ్గులేనితనం కాదా! ఇది బరితెగింపు కాదా?

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యావ్యవస్థ అత్యున్నత ప్రమాణాలనందుకున్నదని కేంద్ర ప్రభుత్వ సంస్థ విడుదల చేసిన పీజీఐ నివేదిక చాటిచెప్పింది. పైగా నాలుగేళ్ల కిందటి ఇదే నివేదికలో రాష్ట్రం అట్టడుగు పొరల్లో ఉంది. రెండేళ్ల కరోనా వెంటాడిన నేపథ్యంలో ఈ పురోగతి ఒక వండర్! కానీ ఛీనాడు మాత్రం పాఠశాల విద్య పతనమైందని తెంపరితనంతో కూడిన వంట కథలను వండి వార్చింది. రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయ రంగంలో విప్లవాత్మక పరిణామంగా దేశవిదేశాల్లోని వ్యవసాయ రంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఛీనాడు, దాని అనుబంధ మీడియా మాత్రం రాష్ట్రంలో వ్యవసాయం పడకేసిందని కథలు అల్లుతారు. ఒక విషయం స్పష్టం. ప్రజల చేతికి అధికారాన్ని ఇచ్చే జగన్ ప్రభుత్వ విధానంపై వ్యాపార - రాజకీయ వర్గం యుద్ధం ప్రకటించింది. ప్రజల ప్రయోజనాలకూ, స్వార్థశక్తుల ప్రయోజనాలకూ మధ్యన జరుగుతున్న యుద్ధం ఇది. బాబోజీ - రామోజీ కంపెనీ నేతృత్వంలో ప్రభుత్వం మీద ప్రత్యక్షంగా, ప్రజల మీద పరోక్షంగా నిత్యం బాంబులు కురిపిస్తున్నారు. విషపూరితమైన రసాయన ఆయుధాలను ప్రయోగిస్తున్నారు. యుద్ధం ప్రకటించినవాడు ఎంతటి శక్తిమంతుడైనా, ఎంతటి ధనాఢ్యుడైనా ప్రజలు చైతన్యవంతులైతే తోక ముడవక తప్పదు. అమెరికా మీద వియత్నాం ప్రజల విజయం చాటిచెప్పిన పరమ సత్యమిదే!

vardhelli1959@gmail.com

మోసాల గురూజీ ఛీనాడు రామోజీ!

ఎవరీ రామోజీరావు?

ఒక వ్యాపారవేత్త. ఈనాడు సంస్థల అధినేత. ఫిలిం సిటీ ఓనర్. సినిమా నిర్మాత. కొంతమందికి గురుపుంగవుడు.

అంతేనా?

ఇంకా వుంది. స్వార్థంకోసం సొంత చుట్టాలను కూడా మోసం చేయడానికి వెనుకాడని కపటి. వ్యవస్థలను మేనేజ్ చేయగల ప్రావీణ్యంతో బంధువులను కూడా కోర్టుల చుట్టూ తిప్పి వాళ్ల భూముల్ని కారుచౌకగా కొట్టేసిన తిమింగలం. పత్రికను అడ్డం పెట్టుకొని కుళ్లు రాజకీయాలను రచించిన ఘనుడు.

విలువైన భూములపై ఆయన కన్ను పడితే చాలు హస్తగతం చేసుకునేంతవరకూ ఎన్ని కుట్రలైనా చేస్తాడని ఒక సన్నిహిత బంధువు స్వయంగా చెప్పాడు. తన సువిశాల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకునే క్రమంలో వేసిన ప్రతి అడుగులో బంధువుల కన్నీటి మడుగులు, బడుగుల నెత్తుటి జాడలు కనిపిస్తాయని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఇదిగో మచ్చుకు కొన్ని అడుగులు...

- విజయవాడ బెంజ్‌సర్కిల్ సమీపంలో 'ఈనాడు' కార్యాలయం ఉన్న రెండెకరాల స్థలం రామోజీది కాదు. బంధువు, భాగస్వామి, తోడల్లుడైన ముసునూరు అప్పారావు, వల్లూరి వెంకటేశ్వరరావుల నుంచి రూ. 725 అద్దెతో 33 ఏళ్ళకు లీజు తీసుకున్నది. అక్కడ 'ఈనాడు' బిల్డింగ్ కట్టిన రామోజీకి స్థలం కాజేయాలనే దుర్బుద్ధి పుట్టింది. లీజు ముగిసిపోతున్న వేళ మరో 33 ఏళ్ళ లీజు కావాలంటూ కోర్టుకెక్కారు. అప్పారావుకు ఆ స్థలం అప్పగించాలని ఆదేశిస్తూ, 2013లో కోర్టు మందలించినా లాభం లేకపోయింది. 2017లో జిల్లా కోర్టు చెప్పినా, మళ్ళీ కోర్టుకెక్కారు. తాత్సారం చేస్తున్నారు. లీజు ముగిసినా ఖాళీ చేయకపోగా, ఇవ్వాల్సిన అద్దెకు అతీగతీ లేదు. 1970 లెక్కల ప్రకారం చూసినా లక్షల్లో అద్దె బాకీ. సొంత బంధువు స్థలానికే శఠగోపం పెట్టాలని రామోజీ మార్కు విశ్వప్రయత్నం సాగుతూనే ఉంది.
- వైజాగ్‌లో డాల్ఫిన్ హోటల్ కథా ఇలాంటిదే. భూయజమానుల్ని మాయమాటలతో బెదిరించి, కారుచౌకగా స్థలం కొట్టేశారు. మొదట విశాఖలోని అల్లిపురం దగ్గర 1970 ప్రాంతంలో 8210 చ. గజాల స్థలాన్ని 50 ఏళ్ళకు రామోజీ లీజుకు తీసుకున్నారు. స్థల యజమానుల డబ్బు అవసరాన్ని గ్రహించి, వాళ్ళను మభ్యపెట్టారు. లీజు గడువు ఇంకా 16 ఏళ్ళు ఉండగానే దాదాపు రూ. 150 కోట్ల విలువ చేసే ఆ స్థలాన్ని రూ. 2.5 కోట్లకే 2005లో తన పేర ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఆ రూ. 2.5 కోట్లను కూడా మన నిరుపేద రామోజీ మూడు వాయిదాల్లో కానీ చెల్లించలేకపోయారట. మరో గమ్మత్తేమిటంటే - డాల్ఫిన్ హోటల్స్‌లో రామోజీతో సహా 172 మంది షేర్ హోల్డర్లు. రామోజీకి 95 శాతం, అంటే 3.82 లక్షల పైగా షేర్లున్నాయి. కానీ, విశాఖ, విజయవాడ, హైదరాబాద్, ఢిల్లీకి చెందిన మిగిలినవారికి లాభాల్లో కనీస వాటా కూడా చెల్లించడం లేదట.
- ప్రియా పచ్చళ్ళ కంపెనీ నిర్మాణ సమయంలోనూ రామోజీది ఇదే స్టైల్. విజయవాడ శివారు కానూరు సమీపంలో సొంత బావ నుంచి 2 ఎకరాల స్థలం లీజుకు తీసుకున్నారు. ఆ స్థలానికి వెనకే మరో 2 ఎకరాల స్థలం ఉంది. దానికి వెళ్ళాలంటే ప్రియా పచ్చళ్ళకిచ్చిన స్థలంలో నుంచే దారి. స్థలంలో నుంచి దారి ఇస్తామని మొదట ఒప్పుకున్న రామోజీ అలవాటుగా నాలుక మడత తిప్పారు. దారి ఇవ్వకుండా సొంతవాళ్ళనే ఇబ్బంది పెట్టారు. ఆ దారిలో వెళ్ళేందుకు ప్రయత్నించిన సొంత బంధువును తన పత్రికా బలంతో రాత్రి అంతా పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. చివరకు ఆ బంధువు న్యాయస్థానాన్ని ఆశ్రయించి, తన స్థలానికి తాను వెళ్ళేందుకు దారి చేసుకోవాల్సిన పరిస్థితి తెచ్చారు.

...ప్రతిచోటా కోర్టు నుంచి చీవాట్లు తిన్నా, తాను లీజుకు తీసుకున్న భూముల్ని సామ దాన భేద దండోపాయాలతో, తన చేతిలోని పచ్చ పత్రిక బలంతో కాజెయ్యడమే రామోజీ మార్కు నీతి, నిజాయతీ. ఈనాడు, మార్గదర్శి, ప్రియా... ఇలా ఆయన స్థాపించిన సామ్రాజ్యాల్లో చాలా భాగం లీజు భూముల లీగల్ కబ్జా లీలలే. న్యాయవ్యవస్థలోని కొందరు వ్యక్తుల సహకారంతో ప్రతి విషయంలో తప్పుడు మార్గాల్ని అన్వేషించే రామోజీ తన పత్రికలో ఇతరుల భూకబ్జాల గురించి రాస్తారు. గురివింద గింజనే గుర్తుకుతెస్తారు.

పత్రికారంగ స్వర్ణయుగపు వేగుచుక్క!

నివాళి



గోవిందరాజు చక్రధర్

ఒక ఆటగాడు ఓడిపోకుండా మైదానంలో ఎంతసేపు నిలబడగలిగాడు, మొత్తం విజయానికి ఏ విధంగా దోహదపడ్డాడు అనేది అతడి ట్రాక్ రికార్డ్‌కి సంకేతం. వ్యక్తిగత స్కోర్ కంటే కీలక ఘట్టాల్లో జట్టు విజయానికి అండగా నిలవడం చాలా ముఖ్యం. జర్నలిజం రంగంలో జి.యస్. వరదాచారి కూడా ఇలాంటి ఆటగాడే. ఆరు దశాబ్దాలకు పైబడి తెలుగు జర్నలిజం వికాసానికి, విలువలకు, జర్నలిస్టుల అభ్యున్నతికి అవిశ్రాంతంగా పాటుపడుతూ వచ్చిన కార్యదక్షుడు.

మరో సుప్రసిద్ధ జర్నలిస్టు సి. రాఘవాచారికి వర్తించే మాటలే వరదాచారికీ సరితూగుతాయి. తలుపు తట్టిన అవకాశాన్ని వదులుకోకుండా ఇంగ్లిష్ జర్నలిజంలోకి వరదాచారి ప్రవేశించి ఉంటే ఏ కోటంరాజు రామారావో అయ్యేవారు. న్యాయశాస్త్రం అభ్యసించిన ఆయన లాయర్‌గా ప్రాక్టీస్ చేసి ఉంటే ఏ నానాపాల్కీవాలానో అయి ఉండేవారు. యూనియనిస్టుగానే కొనసాగి ఉంటే మరో మానికొండ చలపతిరావు అయ్యేవారు. కానీ ఇవేవీ కావాలనుకోలేదు. కనుకే ఆయన గోవర్ధన సుందర వరదాచారి అయ్యారు. నమ్మిన సిద్ధాంతాల విషయంలో రాజీపడేవారు కారు. ఎదుటివారు ఏ భావజాలానికి చెందిన వారైనా తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేవారు.

నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో గోవర్ధన కృష్ణమాచార్యులు, జానకమ్మ దంపతులకు 1932 అక్టోబర్ 15న జన్మించారు. జర్నలిజంపై మక్కువతో విద్యార్థి దశలోనే కొంతకాలం 'వైష్ణవ' పత్రికను నడిపారు. జర్నలిజం వృత్తిలో ప్రవేశించడానికి విద్యార్హతల పట్టింపు లేని ఆ రోజుల్లోనే బి.ఎ. డిగ్రీ తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిజంలో పీజీ డిప్లమా పూర్తి చేశారు. కోర్సులో భాగంగా చెన్నైలోని 'ది హిందూ'లో ఇంటర్న్‌షిప్ దిగ్విజయంగా పూర్తిచేశారు. ఇంగ్లిష్ జర్నలిజంలో ప్రవేశించే అవకాశం వచ్చినా తెలుగు భాషపై మక్కువతో ఆ ఆఫర్‌ను కాదనుకుని 1956లో హైదరాబాద్‌లో 'ఆంధ్ర జనత'లో చేరారు. జర్నలిజంలో చేరిన కొత్తల్లోనే సహోద్యోగుల సందేహాలను ఓపికగా



జి.యస్. వరదాచారి

విడమరిచి చెప్పేవారు. నాటి నుంచి వరదాచారిని 'ప్రొఫెసర్' అని పొత్తూరి వెంకటేశ్వరరావు పిలిచేవారు. 'ఆంధ్రభూమి'లో న్యూస్ ఎడిటర్‌గా రెండు దశాబ్దాలు, 'ఈనాడు'లో అసిస్టెంట్ ఎడిటర్‌గా ఐదేళ్లు పనిచేశారు. తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించినప్పటి నుంచి జర్నలిజం శాఖ అధిపతిగా, ప్రొఫెసర్‌గా 22 ఏళ్లపాటు ఎందరో విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దారు. ప్రెస్ అకాడమీ సహా పలు విద్యా సంస్థల్లోనూ జర్నలిజం పాఠాలు బోధించారు. హెచ్ఎం టీవీలో తీర్పరిగా బాధ్యతలు చేపట్టి తెలుగులో తొలి అంబుడ్స్‌మన్‌గా ఖ్యాతి గడించారు.

వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కార్యాలయమైన దేశోద్ధారక భవన్ అనుమతి సాధనలో, నిర్మాణ నిధుల సేకరణలో ముఖ్య భూమిక పోషించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘానికి కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ స్థాపక కార్యదర్శిగా, జర్నలిస్టుల గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా, జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా, ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నిర్విరామ సేవలు అందిస్తూ వచ్చారు. వెటరన్ జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా రిటైరైన జర్నలిస్టుల కోసం హెల్త్ కార్డుల కోసం పాటుపడ్డారు. పాత్రికేయులకు కరదీపికలుగా నిలిచే పలు పుస్తకాలను ఈ సంఘం తరఫున ప్రచురించారు.

వరదాచారి తన ఆత్మకథను 'జ్ఞాపకాల వరద' పేరిట వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కోసం నార్ల వెంకటేశ్వరరావుపై మోనోగ్రాఫ్ రాశారు. పత్రికా రచనలో దొర్లే పొరబాట్లను సోదాహరణంగా వివరిస్తూ రాసిన 'దిద్దుబాటు' కాలమ్‌ను అదే పేరుతో సంకలనంగా వెలువరించారు. పాత్రికేయ నిష్పాక్షికతను విశ్లేషిస్తూ 'ఇలాగేనా రాయడం?' పేరుతో వ్యాసాల సంకలనం రూపొందించారు. వరదాచారి పాత్రికేయ స్వర్ణోత్సవం సందర్భంగా ఆయన బహుముఖీన కృషికి దర్పణం పడుతూ ప్రముఖుల రచనలతో 'వరద స్వర్ణాక్షరి' వెలువడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తమ పాత్రికేయుడిగా జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు.

స్వీయ ప్రతిభతో, బహుముఖీన కృషితో తెలుగు జర్నలిజం రంగాన్ని ఆరు దశాబ్దాలుగా సుసంపన్నం చేస్తూ వచ్చి పరిపూర్ణ జీవితం గడిపిన వరదాచారి ధన్యజీవి. తెలుగు పత్రికారంగ స్వర్ణయుగపు వేగుచుక్క.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

క్లుప్తంగా

హంస వాహనంపై ఆదిత్యుడి జలవిహారం

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యుడు సతీసమేతంగా హంస వాహనంపై విహరించారు. శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయంలో కార్తీక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్ది ద్వాదశి) సందర్భంగా తెప్పోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీస్వామి వారు ఇంద్ర పుష్కరిణిలో జలవిహారం చేశారు. స్వామిని దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ సమక్షంలో శ్రీచక్రార్చన పూజలు జరిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆక్వా రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సాక్షి, భీమవరం: ఆక్వా రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. భీమవరంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆక్వా ఎక్స్ ఇండియా సదస్సును శనివారం ఆయన సందర్శించి విలేకరులతో మాట్లాడారు. చేపలు, రొయ్యల ఉత్పత్తిలో సదస్సు ద్వారా రైతులు విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. విత్తనం, మేత, మందులు ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన అవసరమన్నారు. ఆక్వా హబ్‌గా పేరొందిన భీమవరంలో ఇటువంటి సదస్సులు తరచూ పెట్టడం వల్ల ఆక్వా రంగాభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. ఆక్వా ఎక్స్ ఇండియా హైదరాబాద్ సీఈవో దంతులూరి వేణు, డీసీసీబీ చైర్మన్ పి.వి.ఎల్.నర్సింహరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గోకరాజు రామరాజు, గాదిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

నాక్ గుర్తింపునకు కళాశాలలు దరఖాస్తు చేయాలి

ఏయూక్యాంపస్ : జాతీయ స్థాయిలో అందించే నేషనల్ అక్రిడిటేషన్, అసెస్‌మెంట్ కౌన్సిల్(నాక్) గుర్తింపు సాధించడానికి ప్రతి కళాశాలా దరఖాస్తు చేయాలని ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య రామమోహనరావు స్పష్టం చేశారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైఎస్ మూర్తి ఆడిటోరియంలో శనివారం న్యూ ఎడ్యుకేషన్ పాలసీ–2020 ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీస్ ఫర్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్.. అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. కళాశాలలకు సొంత భవనాలు లేకుండా, శాశ్వత బోధన సిబ్బంది లేకుండా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. నాక్ గుర్తింపు పొందే విధానం, కళాశాలల సందేహాలు, అపోహలను నివృత్తి చేశారు. ఐదేళ్ల కాలానికి నాక్ గుర్తింపు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, రెక్టార్ ఆచార్య కె.సమత తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ లెవల్ నాక్ చైర్మన్ ఆచార్య కె.రాంజీ, ఆచార్య పి.సునీత, ఆచార్య కె.సీతామాణిక్యం పాల్గొన్నారు.

'హితకారిణి' ఆస్తులను ప్రభుత్వం తీసుకోలేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ/ ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని హితకారిణి సమాజంలో జీతాలు అందని ఉపాధ్యాయుల ఇబ్బందులు చూడలేక రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలను మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేసుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆయన శనివారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతూ హితకారిణి సమాజం ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని చెప్పారు. విద్యాసంస్థలను మాత్రమే స్వాధీనం చేసుకుందని స్పష్టం చేశారు. హితకారిణి సమాజం ఆస్తులను ప్రభుత్వపరం చేయాలని చూస్తే తమ పార్టీ స్పందిస్తుందని తెలిపారు. ఉత్తరాంధ్రలో భూములను తనఖా పెట్టి ప్రభుత్వం రూ.వేల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ ఆర్థిక తిరోగమనానికి ఇది పరాకాష్టగా నిలుస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు 2015లో రాష్ట్రానికి టిడ్కో ఇళ్లు మంజూరు చేశారని, వాటిని నేటికీ రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా లబ్ధిదారులకు అప్పగించలేదన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.1.80లక్షలు ఇస్తుందని, రాష్ట్రం కేవలం రూ.30వేలు కేటాయించి జగనన్న కాలనీలుగా స్టిక్కర్లు వేసుకుంటుందని ఆరోపించారు.

ప్రధాని మోదీ పర్యటనపై బీజేపీ సమీక్ష

ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల విశాఖ పర్యటనపై బీజేపీ రాష్ట్ర ముఖ్య నాయకులు, విశాఖ నగర పార్టీ శ్రేణులతోసోము వీర్రాజు శనివారం సమీక్ష నిర్వహించారు. లాసన్స్ బే కాలనీలోని నగర పార్టీ కార్యాలయంలో ఈ సమీక్ష జరిగింది. ఈ నెల 11న సాయంత్రం విశాఖ వచ్చే ప్రధాని నరేంద్రమోదీకి బీజేపీ శ్రేణులు భారీ రోడ్ షో ద్వారా ఘన స్వాగతం పలకాలని పార్టీ శ్రేణులకు అధ్యక్షుడు సోము వీర్రాజు దిశానిర్దేశం చేశారు.



పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వృద్ధురాలికి సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న మంత్రి కారుమూరి



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మినగల్లులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వం



ఎన్టీఆర్ జిల్లా గుల్లపూడిలో లబ్ధిదారులకు బ్రోచర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



వైఎస్సార్ జిల్లా బద్వేలులో మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

సంఘటితం.. సమారాధనం

రాష్ట్రంలో కార్తీక వనభోజనాల వేదికగా 'కులస్తుల సంఘటిత' సందడి

- రాజకీయాలకు అతీతంగా ఒకే వేదికపై కుల నేతల ఐక్యతారాగం
- ఆర్థికంగా వెనుకబడ్డ కులస్తులకు చేయూత నిచ్చే కార్యక్రమాలు
- ఉన్నత స్థాయికి ఎదిగేవారికి అండదండలుగా ఉండే ప్రణాళికలు
- రాష్ట్రంలో మారుతూ వస్తున్న కార్తీక వనభోజనాల ట్రెండ్



సాక్షి, అమరావతి: అనుకూలమైన వనంలో బంధు మిత్రుల కలయిక. లక్ష్మీ దేవి స్వరూపంగా భావించే ఉసిరి చెట్టుకు పూజలు. అక్కడే వంటలు, ఆటలు, పాటలు, భోజనాలు.. ఓ వైపు ఆధ్యాత్మిక వాతావరణం. మరోవైపు ఆహ్లాదకరమైన సమారాధనం.. ఇదీ కార్తీక మాస వనభోజనాల ప్రత్యేకం. గతంలో ఇలా జరిగిన వన భోజనాల రూపు నేడు మారింది. ఒక కులానికి చెందిన వారంతా ఒక చోటకు చేరుతున్నారు. రాజకీయాలు, ఆర్థిక తారతమ్యాలకు అతీతంగా వనభోజనాల్లో ఐక్యతారాగం పాడుతున్నారు. ఉత్తేజపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. తమ కులస్తులు ఉన్నత స్థాయికి ఎదిగే ప్రణాళికలు వేస్తున్నారు. కుల జనోద్ధరణ కోసం కార్తీక వనభోజనాలను వేదికగా చేసుకోవడం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో దాదాపు 20 ఏళ్ల క్రితం మొదలైంది. అది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ట్రెండ్‌గా మారింది. కులస్థులను సంఘటితం చేసే సంకల్పంతో సమారాధనలు జరుగుతున్నాయి. తమ కులంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత నిచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమాజంలో ఎదుగుతున్న వారికి వెన్నుదన్నుగా ఎలా ఉండాలి అనే ప్రణాళికలు కూడా వేస్తున్నారు.

మునుల కాలం నుంచి..

మాసాల్లో కార్తీకమాసానిది ప్రత్యేకం. శివకేశవులు ఆరాధన, ఉపవాస నియమాలు, పుణ్యతీర్థాల్లో స్నానాలు, ఆలయాల సందర్శనలు, వివిధ మాల ధారణలు ఇలా ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిస్తూ ఉంటుంది. మరో పక్క వనభోజనాల సందడి కనిపిస్తూ ఉంటుంది. కార్తీక పౌర్ణమి రోజునే నైమిశారణ్యంలో సూత మహర్షి ఆధ్వర్యంలో మునులంతా వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నట్లు 'కార్తీక పురాణం'లో ప్రస్తావించారు. భారతీయ సంప్రదాయంలో వనవిహారానికి ప్రాముఖ్యత ఉంది. ఆయుర్వేదంలో ఉసరికి ప్రత్యేక స్థానం ఉంది. ఇలా అన్నీ కలసిన కార్తీకం మానసిక ఉల్లాసాన్నిస్తుంది.

స్థానికంగా కుల సమారాధన..

రాష్ట్రంలో ప్రధానంగా కాపు, రెడ్డి, గౌడ–శెట్టిబలిజ, యాదవ, వైశ్య, కమ్మ, క్షత్రియ తదితర కులాల వారీగా సామాజిక వన భోజనాల సందడి కొనసాగుతోంది. ఉద్యోగులు, వ్యాపారులకు విరామం దొరికే ఆదివారం అయితే మరింత జోరుగా జరుగుతుంది. ఈ ఏడాది కార్తీకమాసం తొలి ఆదివారం రాజమండ్రిలో నిర్వహించిన గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత కుల సమారాధనకు పార్టీలకు అతీతంగా పలువురు నేతలు హాజరయ్యారు. గత ఆదివారం భీమవరంలో నిర్వహించిన ఆర్యవైశ్య సమ్మేళనంలో ఆ సామాజిక వర్గానికి చెందిన పలువురు నేతలు పాల్గొని సంఘీభావం తెలిపారు. సింగపూర్‌లోని ఆర్యవైశ్యులు సైతం అక్కడి కూర్మ ద్వీపంలో (కుసు ఐలాండ్) కార్తీక వనభోజనాలను నిర్వహించుకోవడం విశేషం. చీమకుర్తి మండలం రామతీర్థంలోని మోక్ష రామలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద యోగి వేమన రెడ్ల సత్రంలో ఈ నెల 14న కార్తీక వన భోజనాలను నిర్వహించనున్నారు. రాయలసీమ ప్రాంతంలో రెడ్లు, కురుబ, యాదవ, బలిజ, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కమ్మ, కాపు, గౌడ కులాలు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో శెట్టిబలిజ–గౌడ, ఆర్యవైశ్య, క్షత్రియ, ఉత్తరాంధ్రలో తూర్పుకాపు, నగరాలు, కాళింగ తదితర కులాల వారీగా వన సమారాధనలు ఏర్పాటు చేసుకుంటున్నారు.



ట్రెండ్ మారింది.. సంఘటిత శక్తి చాటుతోంది



గతంలో ఆధ్యాత్మిక కార్యక్రమంగా బంధు మిత్రుల సమక్షంలో కార్తీక వన భోజనాలు నిర్వహించేవారు. ఆ తర్వాత ఆ వేదికలను సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఉపయోగించుకున్నారు. మరింత సామాజిక స్పృహ పెరిగి సొంత కులంలో ఆర్థికంగా దెబ్బతిన్న వారిని ఆదుకోవడానికి, విద్యా, వైద్యానికి సాయమందించడానికి కార్తీక వన సమారాధనలను వేదికగా చేసేవారు. క్రమంగా సామాజిక సంఘటిత శక్తిని చాటేందుకు ఉపయోగించుకోవడంతో పాటు రాజకీయంగా రాణించేందుకు దిశానిర్దేశం చేసేలా వన సమారాధనలు మారాయి. – పాకా వెంకట సత్యనారాయణ, కన్వీనర్, బీసీ కులాల సమాఖ్య

పుణ్యం.. పురుషార్థం



రాష్ట్రంలో కార్తీక సమారాధనలో పూజలతో పుణ్యం వస్తుంది. బంధు మిత్రులు ఒకే చోట కలుసుకుని సాధకబాధకాలు చర్చించుకుని, ఐక్యంగా పరిష్కారాలు కనుగొని ముందుకు సాగేందుకు చేసే ప్రయత్నాలతో పురుషార్థం నెరవేరుతుంది. రాష్ట్రంలో చాలా కాలంగా అనేక విధాలుగా కాపులు వన సమారాధనలు నిర్వహించి కులస్థుల్లో ఉత్సాహం నింపుతున్నారు. విహారయాత్రలు, వన సమారాధనలు నిర్వహిస్తున్నారు. అన్ని రంగాల్లోను రాణించేలా సంఘీయులు దిశానిర్దేశం చేస్తుంటారు. – చినమిల్లి వెంకట్రాయుడు, కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు, పశ్చిమగోదావరి జిల్లా


సంఘటితం.. చైతన్యం



వెనుకబడిన తరగతులకు చెందిన గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత వంటి గీత కులాల వారు ఒకే సామాజికవర్గంగా ఉన్నారు. వీరంతా మరింత సంఘటితమై చైతన్యవంతంగా ముందుకు సాగేందుకు ఎన్నో ఏళ్ల నుంచి కార్తీక వనభోజనాలను నిర్వహిస్తున్నారు. సమాజంలో వారిని వారు రక్షించుకునేందుకు మొదలైన సంఘటిత నిర్మాణం.. కార్తీక వన సమారాధనలతో మరింత చైతన్యవంతమైంది. –వేండ్ర వెంకటస్వామి, గౌడ–శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు, పశ్చిమగోదావరి జిల్లా.

ఏయూ ప్రశ్నాపత్రంపై అనవసర రాద్ధాంతం

- సిలబస్‌కు అనుగుణంగానే ప్రశ్నాపత్రం తయారీ
- గత ప్రశ్నాపత్రాల్లో టీడీపీ, బీజేపీపైనా ప్రశ్నలు



2020 పరీక్షల ప్రశ్నాపత్రంలో టీడీపీపై ఇచ్చిన ప్రశ్న

ఏయూ క్యాంపస్ (విశాఖపట్నం): ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నిర్వహించిన ఎంఏ పొలిటికల్ సైన్స్ ప్రథమ సంవత్సరం ప్రశ్నాపత్రంలో వైఎస్సార్‌సీపీకి సంబంధించిన ప్రశ్నలు అడగటంపై కొంతమంది అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. ప్రశ్నాపత్రం కూర్పు, సిలబస్ వంటి అంశాలను పరిశీలించకుండా అధికార పార్టీకి అనుకూలంగా ప్రశ్నాపత్రాన్ని తయారు చేశారని జనసేన, టీడీపీ నాయకులు ఆరోపించడం వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో ఏయూ దూరవిద్య కేంద్రం సంచాలకుడు కె.విశ్వేశ్వరరావు ఇందుకు సంబంధించిన వాస్తవాలను శనివారం వెల్లడించారు. ప్రశ్నాపత్రాల తయారీ, సిలబస్ వంటి అంశాలు ఆయన మాటల్లోనే..

ప్రశ్నాపత్రాలను ఏయూ రూపొందించదు


'ప్రశ్నాపత్రాల తయారీ ఆంధ్ర విశ్వవిద్యాలయం రూపొందించదు. ఇందుకోసం ఓ ప్రత్యేకమైన వ్యవస్థ ఉంటుంది. ఇతర విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లకు సిలబస్‌ను పంపి తదనుగుణంగా ప్రశ్నాపత్రాల రూపకల్పన చేస్తారు. ప్రశ్నాపత్రం ముద్రణ పూర్తయి పరీక్ష కేంద్రంలో సీల్ తెరిచే వరకు దానిలో ఏ ప్రశ్నలు ఇచ్చారనే విషయం ఏయూ అధికారులకు సైతం తెలిసే అవకాశం లేదు. కాగా, ఏయూ ఎంఏ పొలిటికల్ సైన్స్ కోర్సులో మొదటి సంవత్సరం ఇండియన్ పొలిటికల్ సిస్టమ్ అనే పాఠ్యాంశంలో రీజనల్ పొలిటికల్ పార్టీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశం ఉంటుంది. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల విధానాలు, కార్యక్రమాలు, ప్రజలకు ఏ విధంగా ఉపకరిస్తున్నాయి అనే అంశాలు, రాజకీయ పార్టీల సిద్ధాంతాలు తదితర అంశాలపై సిలబస్‌లో భాగంగా బోధిస్తారు. వీటిపై వార్షిక పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతారు. ముందుగా సిలబస్, దూరవిద్య కేంద్రం అందించిన పుస్తకాలను సమగ్రంగా చదివితే ఈ అంశాలు అవగతం అవుతాయి. వీటిపై అవగాహన లేకుండా ఒక పార్టీకి ప్రచారం కల్పించే విధంగా ప్రశ్నలు ఉన్నాయంటూ రాజకీయ నాయకులు మాట్లాడటం సమంజసం కాదు.

టీడీపీ, బీజేపీలపైనా ప్రశ్నలు అడిగారు

2016, 2018లో 'భారతీయ జనతా పార్టీపై ఒక వ్యాసం వ్రాయుము' అనే ప్రశ్న ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన చేపట్టిన తరువాత 2020లో జరిగిన పరీక్షల్లో 'తెలుగుదేశం పార్టీ విధానాలు–కార్యక్రమాల గురించి రాయండి' అనే ప్రశ్న ఇచ్చారు. మరో సంవత్సరం రెగ్యులర్ కోర్సులో భాగంగా నిర్వహిస్తున్న ఎంఏ పొలిటికల్ సైన్స్ ప్రశ్నాపత్రంలో 'డిఫైన్ ద ఆర్గనైజేషన్ ఆఫ్ టీడీపీ' అనే ప్రశ్న ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీలపై విద్యార్థికి ఉన్న అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఇవ్వడం చాలాకాలంగా జరుగుతోంది. ఇదే తరహాలో రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలపై విద్యార్థి అవగాహనను పరిశీలించే విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించి వైఎస్సార్ సీపీ విధానాలు–కార్యక్రమాల గురించి వివరించండి అనే ప్రశ్న ఇవ్వడం జరిగింది' అని ఏయూ దూరవిద్య కేంద్రం సంచాలకుడు విశ్వేశ్వరరావు వివరించారు.

ప్రధాని సభను విజయవంతం చేద్దాం

- సభ కోసం పొరపాటున ఒక మొక్క తీసినా.. రెండు నాటుతాం
- భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపనపై సీఎంవో నుంచి పీఎంవోకి ప్రతిపాదనలు పంపాం
- వైఎస్సార్ సీపీ ఉమ్మడి విశాఖ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



ఉమ్మడి విశాఖ వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ప్రధాని మోదీ విశాఖ పర్యటన ఉత్తరాంధ్ర ప్రజలకు పండగ వంటిదని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉమ్మడి విశాఖ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. విశాఖ మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని సభ కోసం రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బహిరంగ సభ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో పర్యావరణానికి ఎలాంటి విఘాతం కలగబోదని చెప్పారు. సభ కోసం పొరపాటున ఒక మొక్క తీసినా.. ఆ స్థానంలో రెండు, మూడు మొక్కలు నాటుతామని చెప్పారు. తొలి నుంచి ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు సంబంధించి అన్ని పిటిషన్లు హైకోర్టు కొట్టివేయడంతో ఈ నెల 12న ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపనకు సీఎంవో కార్యాలయం నుంచి ప్రధాని కార్యాలయానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. భోగాపురంపై హైకోర్టు తీర్పు ముందుగా వచ్చి ఉంటే ప్రధాని విశాఖ పర్యటనలోనే శంకుస్థాపన చేసేవారని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష మేరకు త్వరలోనే సీఎం వైఎస్ జగన్ భోగాపురం ఎయిర్‌పోర్టు పనులకు శ్రీకారం చుడతారన్నారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, పార్టీ నాయకులు, కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బీవీ సత్యవతి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, ఎ.అదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులకు మాల మహానాడు మద్దతు

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు

సీతంపేట (విశాఖ ఉత్తర): రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీఎం మంగరాజు చెప్పారు. విశాఖలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం జరిగిన దళిత గిరిజన జేఏసీ సదస్సులో పాల్గొనడానికి తాడేపల్లిగూడెం నుంచి విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ మూడు రాజధానుల్లో భాగంగా విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించడాన్ని స్వాగతించారు. కేవలం 5 వేల నుంచి 10వేల కోట్ల ఖర్చుతో విశాఖను పరిపాలన రాజధానిగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు.

కేరళ చిత్రకళాకారుడికి యూనివర్సల్ మెగా అవార్డు

చోడవరం(అనకాపల్లి జిల్లా): జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో కేరళకు చెందిన సంతోష్ మిత్రాకు యూనివర్సల్ మెగా అవార్డు లభించింది. అనకాపల్లి జిల్లా చోడవరంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి చిత్రకళా పోటీల్లో విజేతలను శనివారం ప్రకటించారు. ప్రముఖ చిత్రకారులు డాక్టర్ యు.ఆశీర్వాదం, డాక్టర్ ఎస్ఎస్ శర్మ ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ చిత్రకారులు వేసిన సుమారు 180 చిత్రాలు ఈ పోటీలో ప్రదర్శించారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న వాతావరణంలో బతకలేని పక్షులు, జీవరాశులు ఒక ప్రకాశించే లైట్‌ను ఆశ్రయించిన వైనాన్ని ఆలోచింపజేసే విధంగా తన కుంచెతో గీసి ఈ పోటీలో ప్రదర్శించిన సంతోష్ మిత్రాకు యూనివర్సల్ మెగా అవార్డు లభించింది. యర్రాజీ(విశాఖపట్నం)కు ప్రెస్టేజియస్ మెగా అవార్డులు దక్కాయి. కామేష్ (నర్సీపట్నం)కు బెస్ట్ క్రియేటివిటీ అవార్డులను సొంతం చేసుకున్నారు.

ధర్మ పరిరక్షణ మన జీవన మార్గం

విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీస్వామి



మాట్లాడుతున్న స్వాత్మానందేంద్ర సరస్వతీస్వామి

కంకిపాడు: ధర్మ పరిరక్షణ, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి జీవన మార్గం కావాలని విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి అన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులోని పురాతన శివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకెళ్లారు. స్వామి వారు శివుడికి ప్రత్యేక పూజలు చేసి హారతులు అందించారు. అర్చక స్వాములతో మాట్లాడి ఆలయ విశిష్టత, ప్రత్యేకతలను తెలుసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మందిరంలో భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి మాట్లాడుతూ పురాతన ఆలయాలు, వాటి విశిష్టతను భావి తరాలకు తెలియజేసేలా ధర్మ పరిరక్షణ, ప్రచారం చాలా అవసరం అన్నారు. ధర్మ మార్గాన్ని అనుసరిస్తూ, సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో స్వధర్మ వాహిని జిల్లా అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ, రాష్ట్ర అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ వేదాంతం రాజగోపాలచక్రవర్తి తదితరులున్నారు.

కనులపండువగా సత్యదేవుని తెప్పోత్సవం

పంపానదిలో హంసవాహనంపై స్వామి, అమ్మవార్ల విహారం



పంపానదిలో కనులపండువగా సత్యదేవుని తెప్పోత్సవం

అన్నవరం : క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి తెప్పోత్సవం శనివారం రాత్రి పంపా నదిలో కనులపండువగా జరిగింది. సర్వాంగసుందరంగా ముస్తాబు చేసిన హంసవాహనంపై సత్యదేవుడు, అమ్మవార్లు ఆశీనులు కాగా, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాంతులు, విద్యుత్ దీపాల వెలుగులు, పండితుల మంత్రోచ్చారణ మధ్య తెప్పోత్సవం వైభవంగా సాగింది. వేలసంఖ్యలో భక్తులు తెప్పోత్సవాన్ని తిలకించి పులకించారు. తొలుత సాయంత్రం సత్యదేవుడు, అమ్మవార్లను, క్షేత్రపాలకులు సీతారాములను రత్నగిరి నుంచి ఊరేగింపుగా పంపానది తీరాన గల పూజా మండపం వద్దకు తీసుకువచ్చారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేక వేదిక మీద ప్రతిష్ఠించి పండితులు పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్లను హంస వాహనంపైకి తీసుకువచ్చి తెప్పోత్సవం ప్రారంభించారు. మూడు సార్లు నదిలో స్వామి, అమ్మవారు విహరించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఇండియన్స్ వెరీ టాలెంటెడ్

అనుకున్నది సాధిస్తారు: పుతిన్



మాస్కో: రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ వారం వ్యవధి లోనే భారత్‌పై మరోసారి ప్రశంసల జల్లు కురిపించారు. దేశ అభివృద్ధి చరిత్రను కొనియాడారు. ''భారతీయులు చాలా ప్రతిభావంతులు. అనుకున్నది సాధిస్తారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో, లక్ష్యాలను అధిగమించడంలో భారతీయుల ప్రతిభాపాటవాలు చక్కగా తోడ్పడతాయి'' అన్నారు. రష్యా జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా మాస్కోలో తాజాగా నిర్వహించిన రష్యన్ హిస్టోరికల్ సొసైటీ 10వ వార్షికోత్సవంలో పుతిన్ ప్రసంగించారు. భారతదేశాన్ని, భారతీయుల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించడంతోపాటు వలసవాదం, రష్యా నాగరికత, సంస్కృతి గురించి ప్రస్తావించారు. అభివృద్ధి పయనంలో భారతీయులు అద్భుత ఫలితాలు సాధిస్తారనడంలో ఎలాంటి అనుమానం లేదన్నారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఈ నెల 7, 8వ తేదీల్లో రష్యాలో పర్యటించనున్నారు.

క్లుప్తంగా...

రష్యా కేఫ్‌లో అగ్నికీలలు
13 మంది సజీవదహనం

మాస్కో: రష్యాలోని కోస్ట్రోమా పట్టణంలో శనివారం ఓ కేఫ్‌లో ఇరు వర్గాల మధ్య గొడవలో ఫ్లేర్ గన్‌ను పేల్చడంతో చెలరేగిన మంటలకు 13 మంది బలయ్యారు. ఏకంగా 37,000 చదరపు అడుగుల మేర విస్తరించిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది చెమటోడ్చారు. సమీప భవనాల వారిని ఖాళీ చేయించారు. అనుమానితున్ని అరెస్టు చేశారు. 2009లోనూ పెర్మ్ నగరంలో నైట్‌క్లబ్‌లో బాణసంచా పేల్చడంతో మంటలంటుకుని 150 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

రష్యాకు డ్రోన్లు పంపాం: ఇరాన్

దుబాయ్: ఇరాన్ తయారీ డ్రోన్లతో తమపై రష్యా దారుణదాడులకు తెగబడుతోందన్న ఉక్రెయిన్ వాదనలు నిజమని తేలింది. రష్యాకు డ్రోన్లు సరఫరా చేసింది నిజమేనని ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీర్ అబ్దుల్లా హియాన్ వెల్లడించారు. 'అయితే ఉక్రెయిన్‌తో యుద్ధానికి చాలా నెలల ముందే కేవలం కొన్ని డ్రోన్లే సరఫరా చేశాం' అని హుస్సేన్ స్పష్టం చేశారు. 'కానీ ఉక్రెయిన్ యుద్ధంలో పౌరులపై వాటిని వినియోగించడాన్ని సమర్థించం. యుద్ధంపై మాది తటస్థ వైఖరి' అన్నారు.

దావూద్ ఇబ్రహీం, చోటా షకీల్‌పై ఎన్ఐఏ చార్జిషీట్

న్యూఢిల్లీ: అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం, అతడి సన్నిహితుడు చోటా షకీల్‌తో పాటు అరీఫ్ అబూ బాకర్ షేక్, షబ్బీర్ అబూ బాబర్ షేక్, మొహమ్మద్ సలీం ఖురేషీపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శనివారం ముంబై ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. దేశంలో ఉగ్రవాద ఘటనలు, నేర వ్యవహారాల్లో పాలుపంచుకున్న డి-కంపెనీకి సంబంధించిన కేసులో ఈ చార్జిషీట్ దాఖలు చేసినట్లు వెల్లడించింది. ముంబైకి చెందిన ఆరిఫ్, షబ్బీర్, ఖురేషీ ఇప్పటికే అరెస్టయ్యారు.

ఇమ్రాన్ ఖాన్ ప్రసంగాల ప్రసారంపై నిషేధం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లేలా, పౌరుల మధ్య విద్వేషం పెంచేలా ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రసంగాల ప్రసారం వెంటనే ఆపేయాలని టీవీ చానళ్లను దేశ ఎలక్ట్రానిక్ మీడియా, రెగ్యులేటరీ అథారిటీ (పీఈఎంఆర్ఏ) ఆదేశించింది. వీటిని ఉల్లంఘిస్తే షోకాజ్ కూడా ఇవ్వకుండా నేరుగా లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించింది. 'లాంగ్ మార్చ్' పేరిట ఇమ్రాన్ చేపట్టిన ర్యాలీ సందర్భంగా ఇటీవల చేసిన పలు ప్రసంగాల్లో.. తన హత్యకు కుట్ర పన్నాయంటూ సైన్యంసహా దేశ అత్యున్నత విభాగాలపై నిరాధార ఆరోపణలు చేశారు. ఈ ప్రసంగాలు ప్రజల మధ్య విద్వేషం పెంచే ప్రమాదముంది. శాంతిభద్రతలకు భంగం వాటిల్లే ఇలాంటి ప్రసంగాల ప్రసారం ఆపేయండి' అని పేర్కొంది.

ఒక లోక్‌సభ, 5 అసెంబ్లీ స్థానాలకు డిసెంబర్ 5న ఉప ఎన్నిక

న్యూఢిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ అగ్రనేత ములాయం సింగ్ యాదవ్ మరణంతో ఖాళీ అయిన యూపీలోని మెయిన్‌పురి లోక్‌సభ స్థానానికి డిసెంబర్ 5న ఉప ఎన్నిక జరగనుంది. రాంపూర్ (యూపీ), సర్దార్‌షహర్ (రాజస్తాన్), పదమ్‌పూర్ (ఒడిశా), కుర్హానీ (బిహార్), భానుప్రతాప్‌పూర్ (ఛత్తీస్‌గఢ్) అసెంబ్లీ స్థానాలకూ అదే రోజు ఉప ఎన్నిక నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. ఈ స్థానాలకు కూడా గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్థానాలతో పాటు డిసెంబర్ 8న కౌంటింగ్ జరగనుంది.

సిసోడియా పీఏ అరెస్టు!

న్యూఢిల్లీ: తన వ్యక్తిగత సహాయకుడు(పీఏ) దేవేంద్ర శర్మను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్టు చేశారని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత మనీశ్ సిసోడియా శనివారం చెప్పారు. ఆయన నివాసంలో సోదాలు చేశారని, ఈ సోదాల్లో ఏమీ లభించలేదని అన్నారు. ఈ వ్యవహారం వెనుక బీజేపీ నేతల హస్తం ఉందని ఆరోపించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో దేవేంద్ర శర్మను ప్రశ్నించినట్లు ఈడీ అధికారులు తెలిపారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద అతడి స్టేట్‌మెంట్ రికార్డు చేశామని వెల్లడించారు. మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఢిల్లీలో ఐదుచోట్ల ఈడీ శనివారం సోదాలు చేపట్టింది.

మన ముంగిట్లో కృష్ణబిలం



భూమికి అత్యంత సమీపంలో ఉన్న ఓ భారీ కృష్ణబిలాన్ని తాజాగా గుర్తించారు. ఇప్పటిదాకా భూమికి అతి సమీపంలో ఉన్న కృష్ణబిలం కంటే ఇది ఏకంగా మూడింతలు దగ్గరగా ఉంది! సూర్యుని కంటే 10 రెట్లు పెద్దదైన ఈ కృష్ణబిలం భూమికి 1,600 కాంతి సంవత్సరాల దూరంలో ఒఫికస్ నక్షత్ర మండలంలో ఉంది. పాలపుంతలో నిద్రాణంగా ఉన్న కృష్ణబిలాన్ని కచ్చితత్వంతో గుర్తించడం ఇదే తొలిసారి కూడా కావడం విశేషం. కృష్ణబిలాలు ఏర్పడే క్రమాన్ని మరింతగా అర్థం చేసుకునేందుకు ఇది తోడ్పడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

బాబును ఎత్తుకొని కలెక్టర్ ప్రసంగం



చంకలో మూడేళ్ల బాబుతో ప్రసంగిస్తున్నది కేరళలోని పత్తనంతిట్ట జిల్లా కలెక్టర్ దివ్య ఎస్.అయ్యర్. ప్రైవేట్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు కుమారునితో పాటు హాజరైన ఆమె బాబును చంకలో ఎత్తుకునే ప్రసంగించారు. ఈ వీడియో వైరలైంది. అయ్యర్ తీరు ఐఏఎస్ వంటి ఉన్నతాధికారి బాధ్యతల నిర్వహణలో అనుసరించాల్సిన నైతిక విలువలకు తగ్గట్టుగా లేదంటూ విమర్శలు విన్పిస్తున్నాయి. దాంతో వీడియోను డిలీట్ చేశారు. మరోవైపు పలువురు కలెక్టర్ చర్యను సమర్థిస్తున్నారు. 2018లో న్యూజిలాండ్ ప్రధాని జెసిండా ఆర్డెర్న్ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి తన మూడేళ్ల కూతురితో హాజరైన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అది అనధికారిక కార్యక్రమం కాబట్టే తన భార్య బాబును తీసుకెళ్లిందని కలెక్టర్ భర్త, కేరళ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కేఎస్ శబరినాథన్ చెప్పుకొచ్చారు.

పర్యావరణ ప్రతినలు...
లక్ష్యానికి ఆమడ దూరం

- మితిమీరిన శిలాజ ఇంధనాల వాడకం
- ప్రమాదపుటంచుల్లో పర్యావరణం

నేటినుంచి ఈజిప్ట్‌లో కాప్-27 సదస్సు



భూమి నానాటికీ వేడుక్కుతోంది. ఒకవైపు తీవ్ర కరువు. మరోవైపు పలు దేశాల్లో కనీవినీ ఎరగని వరదలు సృష్టిస్తున్న పెను బీభత్సం. ఇలాంటి ఉత్పాతాలన్నింటికీ కారణం పర్యావరణ మార్పులు. ఇది రానురానూ తీవ్ర రూపు దాలుస్తూ మానవాళిని వణికిస్తోంది. ఎవరేం చెప్పినా, దేశాలు ఎన్ని చేసినా సమస్య నానాటికీ ముదురుతోందే తప్ప పరిస్థితిలో మెరుగుదల మాత్రం కన్పించడం లేదు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణం నానాటికీ విషతుల్యంగా మారుతోంది. రోజులు గడుస్తున్న కొద్దీ పర్యావరణానికి ముప్పు పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పర్యావరణ మార్పులపై సదస్సు (కాప్–27) ఆదివారం ఈజిప్టులో మొదలవుతోంది. 12 రోజుల పాటు జరిగే ఈ సదస్సులోనైనా పర్యావరణాన్ని కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకునే దిశగా గట్టి ముందడుగు పడుతుందేమో చూడాలి...

కాగితాల్లోనే ఒప్పందాలు

గతేడాది స్కాట్లండ్‌లోని గ్లాస్గోలో జరిగిన కాప్-26లో దేశాలన్నీ మేధోమథనం చేసి గట్టి తీర్మానాలతో పర్యావరణ ఒప్పందమైతే ఆమోదించాయి. దీన్నో పెద్ద సానుకూల చర్యగా ప్రపంచమంతా కొనియాడింది. ఎందుకంటే శిలాజ ఇంధనాల వల్ల పర్యావరణానికి కలుగుతున్న తీవ్ర హానిని అంతర్జాతీయంగా తొలిసారిగా అధికారికంగా గుర్తించింది గ్లాస్గో సదస్సులోనే. వాటి వాడకాన్ని వీలైనంతగా తగ్గిస్తూ క్రమంగా పూర్తిగా నిలిపేయాలని దేశాలన్నింటికీ సదస్సు పిలుపునిచ్చింది. కానీ ఏడాది గడిచినా ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాల వాడకం నానాటికీ పెరుగుతోందే తప్ప తగ్గకపోవడం శోచనీయం.

పులిమీద పుట్రలా యుద్ధం...

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం దెబ్బకు పరిస్థితి మరింతగా దిగజారింది. రష్యా నుంచి సహజవాయు సరఫరాలు భారీగా తగ్గిపోవడంతో యూరప్ సహా పలు దేశాలు మరో దారి లేక శిలాజ ఇంధనాల వాడకాన్ని పెంచేశాయి. అందులోనూ అత్యంత కాలుష్యకారకమైన బొగ్గు వాడకం విపరీతంగా పెరిగిపోతున్న వైనం కలవరపెడుతోంది. 2022లో బొగ్గు వాడకం 2013లో నమోదైన ఆల్‌టైం రికార్డును చేరడం ఖాయమని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) జోస్యం చెబుతోంది. ఒక్క యూరోపియన్ యూనియన్‌లోనే బొగ్గు డిమాండ్ కనీసం 6.5 శాతం పెరుగుతుందని అంచనా. మొత్తమ్మీద 2030 కల్లా అంతర్జాతీయ బొగ్గు వినియోగం 2021తోపోలిస్తే 8.7 శాతానికి మించి తగ్గకపోవచ్చంటున్నారు. ఈ లెక్కన 2050 నాటికి శిలాజ ఇంధనాల వాడకాన్ని పూర్తిగా నిలిపేయాలన్న లక్ష్యం చేరడం అసాధ్యమే. అది జరగాలంటే 2030 నాటికి బొగ్గు వాడకం ఏకంగా 35 శాతం తగ్గాల్సి ఉంటుంది! గతేడాది సదస్సులో వర్ధమాన దేశాలన్నింటినీ బొగ్గు తదితర శిలాజ ఇంధనాలకు గుడ్‌బై చెప్పాలని కోరిన సంపన్న దేశాలే ఇప్పుడు ఆ దేశాలను మించి వాటిని వాడుతుండటం విషాదం. ఈ ధోరణికి వెంటనే అడ్డుకట్ట పడకుంటే 2100 నాటికి భూగోళం ఏకంగా మరో 2.6 డిగ్రీల మేరకు వేడెక్కుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భూతాపోన్నతిని 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలన్న గ్లాస్గో ఒప్పందం అమలుకు సదస్సు ఏ చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరం.

– సాక్షి, నేషనల్ డెస్క్

భద్రతా వలయంలో రిసార్టు

పర్యావరణ కార్యకర్తల నిరసనల భయాల నడుమ సీఓపీ27కు వేదిక కానున్న సినాయ్ ద్వీపకల్పంలోని షర్మెల్ షేక్‌లోని రిసార్టు వద్ద ఈజిప్టు ప్రభుత్వం అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసింది. కోరల్ రీఫ్‌లు, అత్యంత అందమైన సముద్ర తీరాలకు ఈ రిసార్టు నిలయం. స్థానికంగా టూరిజంలో పనిచేసే వాళ్లలో చాలామందిని తాత్కాలికంగా ఇళ్లకు పంపారు. మిగతా వారికి ప్రత్యేకమైన గుర్తింపు కార్డులిచ్చారు. సెలవులు గడిపేందుకు వస్తున్న టూరిస్టులను కూడా అడ్డుకుంటున్నారు. గతేడాది గ్లాస్గోలో సదస్సు జరిగిన వీధిలోకి ఏకంగా లక్షల మంది దూసుకొచ్చి నిరసనలకు దిగారు. కాప్ సదస్సు 1995 నుంచి ఏటా జరుగుతోంది.

ఆర్థిక, సాంకేతిక సాయాలకు పట్టుబట్టనున్న భారత్

వాతావరణ మార్పులు, తద్వారా వస్తున్న విపత్తులను అరికట్టేందుకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సాయాన్ని సంపన్న దేశాలు భారీగా పెంచాలని సదస్సులో భారత్ డిమాండ్ చేసే అవకాశం కన్పిస్తోంది. మన ప్రతినిధి బృందానికి కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ నేతృత్వం వహిస్తారు. మొత్తం 198 దేశాలు సదస్సులో పాల్గొంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తో పాటు 100 మందికి పైగా దేశాధినేతలు హాజరవనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనడంపై స్పష్టత లేదు.

తొలి ఓటర్ ఇక లేరు

34సార్లు ఓటేసి అరుదైన ఘనత

- 1952 నుంచి ప్రతి ఎన్నికల్లోనూ ఓటు
- ప్రధాని మోదీ తదితరుల సంతాపం



షిమ్లా: స్వతంత్ర భారతదేశంలో తొలి ఓటర్‌గా చరిత్రకెక్కిన 106 ఏళ్ల శ్యామ్ శరణ్ నేగీ ఇక లేరు. చాలారోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం కిన్నౌర్ జిల్లా కల్పా గ్రామంలోని స్వగృహంలో శనివారం తెల్లవారుజామున మరణించారు. అయితే తుదిశ్వాస వదిలేందుకు ముందు కూడా ఆయన ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం! రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల్లో ఈ నెల 2న కల్పా గ్రామంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. నేగీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయడం ఇదే తొలిసారి! ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు.

బ్రాండ్ అంబాసిడర్‌గా సేవలు

నేగీ 1917 జూలైలో జన్మించారు. పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1975లో పదవీ విరమణ పొందారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ఆయనకెంతో ఇష్టం. ఇప్పటిదాకా 34సార్లు ఓటు వేశారు. పార్లమెంట్, అసెంబ్లీ, పంచాయతీ.. ఎన్నిక ఏదైనా సరే 1951 నుంచి ఏనాడూ ఓటు వేయడం మర్చిపోలేదు. 2010లో అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లా కల్పా గ్రామంలో నేగీని ఘనంగా సత్కరించారు. 2014లో హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల సంఘం నేగీని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. 2014 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గూగుల్ సంస్థ 'ప్లెడ్జ్ టు ఓట్' ప్రచారంలో భాగంగా నేగీపై వీడియో రూపొందించింది. ఈ వీడియో ద్వారా ఆయన అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు పొందారు. ప్రతి ఎన్నిక ఓ పండుగ లాంటిదేనని, ప్రతి ఓటూ విలువైనదేనని, ఓటర్లంతా తప్పనిసరిగా ఓటు వేసి, మంచి నాయకులను ఎన్నుకోవాలని నేగీ తరచూ చెబుతుండేవారు.

యువతకు స్ఫూర్తిదాయకం: మోదీ

తొలి ఓటర్ నేగీ మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వెలిబుచ్చారు. ఆయన 34 సార్లు ఓటు వేయడం గొప్ప విషయమని కొనియాడారు. ''అనారోగ్యంతో బాధపడుతూ కూడా రెండు రోజుల క్రితమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలా మరణానికి ముందు కూడా తన విధిని చక్కగా నిర్వర్తించారు. ప్రజాస్వామ్యం పట్ల ఆయన దృక్పథం యువతకు స్ఫూర్తిదాయకం'' అంటూ ప్రశంసించారు. భారమైన హృదయంతో తలవంచి నేగీకి నివాళులర్పిస్తున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ వాద్రా, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ తదితరులు నేగీ మరణం పట్ల సంతాపం తెలిపారు. నేగీ ఇక లేరన్న నిజం బాధాకరమని పేర్కొన్నారు. బీజేపీ కూడా ట్విట్టర్‌లో సంతాపం ప్రకటించింది. నేగీ మృతి పట్ల ఎన్నికల సంఘం కూడా సంతాపం ప్రకటించింది.



నవంబర్ 2న చివరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేస్తూ...

ఇలా తొలి ఓటు...

దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు 1952 జనవరి-ఫిబ్రవరిలో జరిగాయి. కానీ, హిమాచల్ ప్రదేశ్‌లోని కిన్నౌర్ జిల్లా చినీ గ్రామంలో (నేటి కల్పా) తీవ్రమైన చలితో పాటు ముందుగానే మంచు కురుస్తుండడంతో 1951 అక్టోబర్ 25న్నే పోలింగ్ జరిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి దట్టమైన మంచులో నడుచుకుంటూ వెళ్లి నేగీ మొదటి ఓటు వేశారు. అలా స్వతంత్ర భారత్‌లో ఓటేసిన తొలి పౌరుడిగా రికార్డు సృష్టించారు.

ఉద్వాసన తప్ప దారి లేదు: మస్క్



న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సారథ్యంలో భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ట్విట్టర్‌లో పెద్ద ఎత్తున ఉద్యోగుల తొలగింపు కొనసాగుతోంది. సంస్థను ప్రక్షాళన చేసే పనిలో మస్క్ నిమగ్నమయ్యారు. సంస్థకు రోజూ 4 మిలియన్ డాలర్ల (రూ.32.79 కోట్లు) నష్టం వస్తోందని మస్క్ శనివారం ట్వీట్ చేశారు. అందుకే ఉద్యోగుల సంఖ్య తగ్గించుకోవాలని నిర్ణయించామని తెలిపారు. రాజీనామా చేసేవారికి 3 నెలల ప్యాకేజీ ఇస్తున్నామని, పట్టప్రకారం ఇవ్వాల్సిన దానికంటే ఇది 50 శాతం ఎక్కువ అని చెప్పారు. ట్విట్టర్‌ను మస్క్ గత నెలలో 44 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. సంస్థలో నిత్యం వందలాది మందికి పింక్ స్లిప్పులు అందుతున్నాయి. భారత్‌లో 200 మందికి పైగా ఉద్యోగులను ట్విట్టర్ తొలగించింది. ఇంజనీరింగ్, సేల్స్, మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ తదితర విభాగాల్లో లేఆఫ్‌లు అమలు చేస్తోంది. అమెరికాలోని కాలిఫోర్నియాలో పలువురు ట్విట్టర్ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. ట్విట్టర్ యజమాన్యం కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తోందని, చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు.

రంగంలోకి యూఎస్ సూపర్‌సోనిక్ బాంబర్లు

సియోల్: వరుస క్షిపణి పరీక్షలతో ఉద్రిక్తతలు పెంచుతున్న ఉత్తరకొరియాకు అమెరికా హెచ్చరికలు పంపింది. దక్షిణకొరియాలో జరుపుతున్న సంయుక్త సైనిక విన్యాసాల చివరి రోజు శనివారం అధునాతన సూపర్‌సోనిక్ బాంబర్ బీ-1బీ యుద్ధ విమానాలను రంగంలోకి దించింది. 2017 డిసెంబర్ తర్వాత వీటిని విమానాలను కొరియా ద్వీపకల్ప విన్యాసాల్లో వాడటం ఇదే తొలిసారి. వారం వ్యవధిలో ఉత్తర కొరియా పరీక్షల పేరిట ఏకంగా 30కి పైగా క్షిపణులు ప్రయోగించడంతో దక్షిణ కొరియా, జపాన్, అమెరికా తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. అందుకే ఈసారి విన్యాసాల్లో ఎఫ్-35 అగ్రశ్రేణి యుద్ధవిమానంసహా దాదాపు 240 యుద్ధ విమానాలతో తమ సత్తా ఏమిటో ఉ.కొరియాకు చూపే ప్రయత్నంచేశాయి. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అగ్రదేశాల మధ్య బేధాభిప్రాయలు పొడచూపడంతో ఇదే అదనుగా భావించి ఉ.కొరియా క్షిపణి పరీక్షలను ఒక్కసారిగా పెంచేసింది. శనివారం సైతం నాలుగు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. విన్యాసాల పేరిట తమ భూభాగాల దురాక్రమణకు ప్రయత్నిస్తే శక్తివంతమైన సమాధానం ఇస్తామని అమెరికా, ద.కొరియాలనుద్దేశిస్తూ ఉ.కొరియా హెచ్చరించడం గమనార్హం.



అమెరికా మధ్యంతరంలో ఐదుగురు భారతీయులు

వాషింగ్టన్: అమెరికా పార్లమెంట్ దిగువ సభకు జరుగుతున్న మధ్యంతర ఎన్నికల్లో ఐదుగురు భారతీయ అమెరికన్లు బరిలో దిగారు. కాలిఫోర్నియాలోని ఏడో కాంగ్రెషనల్ స్థానం నుంచి 57 ఏళ్ల అమీ బేరా ఆరోసారి రేసులో ఉన్నారు. 46 ఏళ్ల రో ఖన్నా కాలిఫోర్నియాలోని 17వ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. వాషింగ్టన్ రాష్ట్రంలోని ఏడో స్థానం నుంచి 57 ఏళ్ల జయపాల్ అదృష్టం పరీక్షించుకోనున్నారు. మిషిగన్‌లోని 13వ స్థానం నుంచి శ్రీ థనేదర్ పోటీకి సిద్ధమయ్యారు. రిపబ్లిక్ అభ్యర్థులతో పోలిస్తే బేరా, రాజా, ఖన్నా, ప్రమీలా బలంగా ఉన్నట్లు సమాచారం. ఇక 67 ఏళ్ల థనేదర్ అరంగేట్రం చేస్తున్నారు. ఐదుగురిలో ప్రమీలా జయపాల్ ఒక్కరే మహిళా అభ్యర్థి. హోరాహోరీ పోరు ఉండే స్థానాల్లో భారతీయ అమెరికన్ ఓటర్ల పాత్ర కీలకం కానుంది. ప్రతినిధుల సభలో 435 మంది సభ్యులుంటారు. 50 రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదికన స్థానాలను కేటాయిస్తారు. సెనేట్‌లో మాత్రం 100 మంది సెనేటర్లు ఉంటారు. ప్రతి రాష్ట్రానికి సమప్రాధాన్యత అంటే రెండు సీట్లు ఉంటాయి. మరోవైపు మేరీలాండ్ రాష్ట్రంలో డెమొక్రటిక్ మహిళా అభ్యర్థిగా లెఫ్టినెంట్ గవర్నర్ పదవి కోసం 57 ఏళ్ల అరుణా మిల్లర్ పోటీపడుతున్నారు. ఆమె గెలిస్తే ఈ పదవి చేపట్టే తొలి భారతీయ అమెరికన్‌గా చరిత్ర సృష్టిస్తారు. ప్రతినిధుల సభకు నవంబర్ ఎనిమిదో తేదీన పోలింగ్ జరగనుంది.

కాలుష్య వ్యాధుల కోరల్లో ఢిల్లీ

న్యూఢిల్లీ: కాలుష్యకాసారంగా మారిన ఢిల్లీ-రాజధాని ప్రాంత పరిసరాల (ఎన్‌సీఆర్) ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కొద్ది వారాలుగా ప్రతి ఐదింట నాలుగు కుటుంబాలు కాలుష్య సంబంధ వ్యాధులపాలవుతున్నాయని లోకల్ సర్కిల్స్ అనే సంస్థ సర్వేలో తేలింది. అందులో పాల్గొన్న వారిలో 18 శాతం ఇప్పటికే గాలి కాలుష్యంతో అస్వస్థులై ఆస్పత్రికి వెళ్లొచ్చారు. 80 శాతం కుటుంబాల్లో కనీసం ఇంటికొకరు ఒకరు శ్వాససంబంధ సమస్యను ఎదుర్కొంటున్నారు. వాయు కాలుష్యంతో బెంబేలెత్తిపోయిన ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంత ప్రజలు కొందరు స్వస్థలాలు వదిలి వేరే ప్రాంతాలకు తాత్కాలికంగా తరలిపోయారు. ఇటీవల దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా వినియోగంతో వెలువడిన దుమ్ము ధూళితో పొగచూరిన ఢిల్లీలో ఐదు రోజుల తర్వాత ప్రజాభిప్రాయం తీసుకున్నారు. అప్పుడు సైతం ఇదే తరహా కాలుష్య సంబంధ ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టాయని 70 శాతం మంది పౌరులు ఆవేదన వ్యక్తంచేయడం గమనార్హం. ప్రభుత్వ పాలన, ప్రజాసంబంధాలు, పౌరుల, వినియోగదారుల ప్రయోజనాలు, ఎదుర్కొంటున్న కష్టాలపై సామాజిక మాధ్యమ వేదికగా లోకల్‌సర్కిల్స్ సంస్థ సర్వేలు చేస్తుంటుంది.



అవినీతిమయ పార్టీలు

ఆప్, కాంగ్రెస్‌లపై మోదీ విసుర్లు

సోలన్ (హిమాచల్‌ప్రదేశ్): ''కరడుగట్టిన నిజాయితీపరుమని చెప్పుకునే ఆమ్ ఆద్మీ పార్టీ నిజానికి అత్యంత అవినీతిమయం. ఇకకాంగ్రెస్సైతే అవినీతికి, స్వార్థ రాజకీయాలకు, ఆశ్రిత పక్షపాతానికి తిరుగులేని గ్యారెంటీ'' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ రెండు పార్టీలపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. శనివారం హిమాచల్‌ప్రదేశ్‌లోని సుందర్ నగర్‌లో ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. స్థిరత్వానికి, అభివృద్ధికే ఓటేయాల్సిందిగా ప్రజలను కోరారు. ఈ హిమాలయ రాష్ట్రంతో తనకు సుదీర్ఘ అనుబంధముందని చెప్పారు. అధికార బీజేపీకి వేసే ప్రతి ఓటూ తనకు ఆశీర్వాదమని భావిస్తానన్నారు. ''మీరు వేసే ప్రతి ఓటూ వచ్చే పాతికేళ్ల కాలానికి రాష్ట్ర భవితవ్యాన్ని నిర్దేశిస్తుంది. నేను కమలం పువ్వు గుర్తు చేపట్టి మీ ముందుకొచ్చాను. మా అభ్యర్థులను చూడకండి. కమలం గుర్తును చూసి ఓటేయండి'' అని విజ్ఞప్తి చేశారు. ''కాంగ్రెస్ హయాంలో స్థిరత్వం లేని పాలన వల్ల చిన్న రాష్ట్రాలు ఎంతగానో నష్టపోయాయి. చిన్న రాష్ట్రమని హిమాచల్‌ను కాంగ్రెస్ ఏళ్ల తరబడి చిన్నచూపు చూసింది. అందుకే 21వ శతాబ్దంలో మనకు కావాల్సింది స్థిరమైన, బలమైన ప్రభుత్వాలు. అది బీజేపీకి మాత్రమే సాధ్యం'' అన్నారు. ''మందులను మాటిమాటికీ మారిస్తే రోగం తగ్గదు. ఎవరికీ మేలు జరగదు. అందుకే అధికార బీజేపీని మళ్లీ గెలిపించండి'' అని కోరారు. హిమాచల్‌లో ప్రతిసారీ అధికార పార్టీ ఓడటం ఆనవాయితీగా వస్తోంది. 68 స్థానాలున్న అసెంబ్లీకి నవంబర్ 12న పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు గుజరాత్‌తో పాటుగా డిసెంబర్ 8న జరుగుతుంది.

పామునే కొరికి చంపిన బుడతడు



ఛత్తీస్‌గడ్‌లో దీపక్ అనే ఓ ఎనిమిదేళ్ల బుడతడు తనను కరిచిన నాగుపామును అమాంతం ఒడిసిపట్టుకుని రెండుసార్లు కసిదీరా కొరికేశాడు. దాంతో పాము అక్కడికక్కడే చనిపోయింది. అతను ఇంటి వెనకాల ఆడుకుంటుంటే ఈ సంఘటన జరిగింది. ''పాము ఉన్నట్టుండి నా చేతికి చుట్టుకుని కాటందుకుంది. విపరీతమైన నొప్పి అనిపించింది. భయంతో చేతిని ఎంతగా విదిలించినా లాభం లేకపోయింది. దాంతో ఏం చేయాలో తెలియక రెండుసార్లు దాన్ని కొరికేశాను. అంతా సెకన్ల వ్యవధిలో జరిగిపోయింది'' అని తనకెదురైన ప్రాణాంతక సంఘటన గురించి దీపక్ చెప్పుకొచ్చాడు. తర్వాత పాము కరిచిందని అమ్మానాన్నలకు చెప్పడంతో వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతన్ని కుట్టినప్పుడు పాము విషం విడుదల చేయలేదని తేల్చారు. ఎందుకైనా మంచిదని విరుగుడు ఇంజక్షనిచ్చి రోజంతా అబ్జర్వేషన్లో పెట్టి ఇంటికి పంపారట.

సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 6 । నవంబర్ । 2022



కోలుకున్న విద్యార్థులు

ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ విద్యార్థులు కోలుకున్నారు. ఫుడ్ పాయిజన్‌తో ఇబ్బంది పడిన వారికి సకాలంలో వైద్యం అందించారు. - 8లో



'విశాఖ సభకు తరలి రండి'

విశాఖలో 12న జరగనున్న సభకు తరలిరా వాలని స్పీకర్ తమ్మినేని, మంత్రి బొత్స పిలుపు నిచ్చారు. కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. - 8లో

ముగిసిన బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. జిల్లాలో వర్సిటీ క్యాంపస్‌లో పరీక్షలు నిర్వహించగా, 14 కళాశాలల నుంచి 1265 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అంతర్గత పనులు పూర్తి చేసి, స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు.

అల.. ఆదిత్యపురిలో



అరసవల్లి ఇంద్ర పుష్కరిణిలో సూర్యనారాయణ స్వామి తెప్పోత్సవం, స్వామికి మొక్కుతున్న భక్తులు



- కమనీయంగా ఆదిత్యుని నౌకా విహారం
- హంసనావలో సతీసమేతంగా దర్శనమిచ్చిన సూర్యభగవానుడు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

అరసవల్లి/గార: సాయం సంధ్య వేళ సూరీడు విహారానికి బయల్దేరాడు. సతీసమేతంగా ఇంద్ర పుష్కరిణికి వచ్చి హంస నావపై తిరుగాడాడు. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన శనివారం అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో స్వామి హంస నావికా మహోత్సవం కమనీయంగా జరిగింది. ఓ వైపు బాణసంచా వెలుగులతో మరోవైపు విద్యుత్ కాంతులతో అరసవల్లి ఆలయ ప్రాంతమంతా వెలుగులమయమైంది. ఆలయ ఈఓ వి.హరిసూర్య ప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు. రెండు రోజులుగా స్వర్ణాలంకరణతో దర్శనమిస్తున్న ఆదిత్యుడు ఆదివారం కూడా అలాగే దర్శనమివ్వనున్నాడు.

తిరువీధిగా వచ్చి..

శనివారం సాయంత్రం 4.15 గంటలకు ఉషా పద్మినీ ఛాయా దేవేరులతో సూర్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను సింహ వాహనంపై ఊరేగిస్తూ పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ మూర్తులను హంస వాహనంలో ఉంచి జలవిహారం మొదలుపెట్టారు. ముందుగా ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు గంగ పూజ నిర్వహించి హారతినిచ్చారు. నావికార్చన, శ్రీచక్రార్చన అనంతరం రెండు గంటల పాటు నౌకా విహారం జరిగింది. 12 మార్లు స్వామిని పుష్కరిణిలో తిప్పారు. అనంతరం మాఢవీధుల్లో ఊరేగింపు జరిగింది. ఈ సందర్భంగా అనివెట్టి మండపంలో క్షీరాబ్ది ద్వాదశి వ్రతం చేశారు. మహిళలు దీపారాధన నిర్వహించారు. ఆలయ ఆవరణలో కాజీపేటకు చెందిన శ్రీసీతారామ నాట్య కళా మండలి ఆధ్వర్యంలో కోలాటం, చెక్క భజన బృంద పాటలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, వైఎస్సార్ సీపీనేత పిరియా రాజారావు, దేవదాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామి ఆలయంలోనూ నావికా మహోత్సవం నిర్వహించారు.

కూర్మనాథుని సన్నిధిలో..



గార: శ్రీకూర్మం శ్వేత పుష్కరిణిలో కూర్మనాథుని తెప్పోత్సవం



అరసవల్లి ఇంద్రపుష్కరిణిలో తెప్పలు వదులుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

న్యూస్‌రీల్

ముగిసిన హెల్త్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్

అరసవల్లి: జిల్లాలో వైఎస్సార్ విలేజీ హెల్త్ క్లినిక్స్‌లో ఎంపీహెచ్ఏ (మేల్ హెల్త్ అసిస్టెంట్లు) కౌన్సెలింగ్ శనివారంతో ముగిసింది. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం కొందరికి కౌన్సెలింగ్ నిర్వహించగా, మిగిలిన వారికి శనివారం పూర్తి చేసి వర్క్ ఆర్డర్లు అందజేశారు. దీంతో మొత్తం 317 మందికి ఆర్డర్లు జారీ చేశారు. కార్యక్రమాన్ని ఆర్డీఓ బి.శాంతి పర్యవేక్షించగా, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి ఆధ్వర్యంలో ప్రక్రియను చేపట్టారు.

'పరీక్షల సమాచారం చేరటం లేదు'

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా, విద్యార్థుల ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానాలు చెప్పారు. ఎక్కువ మంది విద్యార్థులు డిగ్రీ పరీక్షల షెడ్యూల్, ఫలితాల వివరాలు, రీవాల్యుయేషన్ ఫలితాలు విద్యార్థులకు తెలియజేయటం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ కాలేజీలకు ప్రతి విషయం విద్యార్థులకు చెప్పేలా, నోటీస్ బోర్డుల్లో పెట్టేలా ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి అంశాన్ని వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఎంకాం నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో జాప్యం పెరుగుతోందని విద్యార్థులు చెప్పగా..వారం రోజుల్లో రిజల్ట్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, ప్రొఫెసర్ పీలా సుజాత, సన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ్‌భాస్కర్, రీవాల్యుయేషన్ డీన్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

జిల్లా దేవదాయ శాఖాధికారిగా డీవీవీ ప్రసాదరావు



డీవీవీ ప్రసాదరావు

అరసవల్లి: జిల్లా దేవదాయ శాఖాధికారిగా డీవీవీ ప్రసాదరావును నియమిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన విజయనగరం జిల్లా రామతీర్థాలు ఆలయ ఈఓగా రెగ్యులర్ విధుల్లో ఉండగా, తాజాగా ఈ జిల్లా అధికారిగా ఈయనకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఇప్పటివరకు జిల్లా దేవదాయశాఖాధికారిగా పనిచేసిన టి.అన్నపూర్ణను ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖాధికారిగా బదిలీ చేశారు.

మది దోచే సొగసరి..

జలసిరి





బత్తరసాయి జలపాతం

- మందస మండలంలో జలపాతాల కనువిందు
- సందర్శకులను ఆకట్టుకుంటున్న సుందర దృశ్యాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అడవులు అందాలను చూపిస్తున్నాయి. వనం మధ్య పాపిడిలా ప్రవహిస్తున్న నీటి పాయలు సందర్శకులను రారమ్మని పిలుస్తున్నాయి. ముఖ్యంగా మందస మండలంలో ఇటీవలే వెలుగులోకి వచ్చిన జలపాతాల దృశ్యాలు మైమరపిస్తున్నాయి. అందులో ఒకటి దాలసరి జలపాతం కాగా, మరొకటి బత్తరసాయి జలపాతం. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో అక్కడికి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. జాగ్రత్తలు తీసుకుని వెళ్తే మంచి విహార కేంద్రంగా ఎంజాయ్ చేయొచ్చు.

SUNDAY SPECIAL

అందాలసరి..

మందస మండలంలోని చీపి పంచాయతీలో దాలసరి అనే చిన్న గిరిజన గ్రామం సమీపంలో జలపాతం ఉంది. గ్రామానికి అతి సమీపంలో కొండలపై నుంచి నీరు ప్రవాహం కిందకు జారుతోంది. దారి పొడవునా అడవులు, అందమైన దారులు, మహేంద్రగిరుల సొగసులు, ఆదివాసీల పోడు వ్యవసాయం, పచ్చదనం.. ఇలా ఒకటేమిటి.. మనసు పులకరింపజేసే దృశ్యాలెన్నో ఉన్నాయి. ఆ జలపాతంలో యువకులైతే జలకాలాడుతున్నారు. మహేంద్రగిరులకు ఈ ప్రాంతం సమీపంలో ఉండడంతో ప్రాధాన్యత పెరిగింది. ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలకు చెందిన సుమారు 9 గ్రామాలకు ఈ ప్రాంతం పవిత్రమైనదిగా గిరిజనుల నమ్మకం. గిరిజనులు తమ భాషలో ఈ ప్రాంతాన్ని లువుంరెన్గ్(నీటిలో ఎప్పటికీ తడిచే రాయి), హత్తిన్యాంల్(ఏనుగు కుంభస్థలంలా నీటిని కురిపించే కొండ) అని పూర్వీకుల నుంచి నమ్మకమని ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు చెబుతున్నారు.



బత్తరసాయి జలపాతం దిగువ దృశ్యం

ప్రయాణ మార్గమిది...

మందస వరకు బస్సులో చేరుకోవాలి. అక్కడి నుంచి బస్సులో గాని, ఆటోలో గాని, సొంత వాహనాల ద్వారా గాని చీపి గ్రామానికి చేరుకోవచ్చు. అక్కడి నుంచి బొండికరి రూట్‌లో 3 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తే దాలసరి గ్రామానికి చేరుకోచ్చు. అక్కడి నుంచి అర కిలోమీటర్ నడిచి వెళ్తే జలపాతం కనిపిస్తుంది.

బత్తరసాయి.. నట్టడివిలో దారి

ప్రకృతి ప్రసాదించిన సుందరదృశ్యాల్లో బత్తరసాయి జలపాతం ఒకటి. అడవుల మధ్యలో గలగలమంటూ సెలయేటి శబ్దాలు.. పక్షుల కిలకిలలు... వాటి మధ్య జాలువారుతున్న జలపాతంగా ఆకట్టుకుంటుంది. ఆ ప్రదేశానికి వెళ్తే చాలు తెలియని మైకం కమ్మేస్తుంది. ప్రకృతి ప్రసాదిత సోయగాలు కనువిందు చేస్తున్నాయి. మందస మండలంలోని బుడారిసింగి పంచాయతీలో గల కళింగదళ్ రిజర్వాయర్‌కు ఎగువ భాగంలో కొండలపై ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతంలో బత్తర్‌సాయి(ఒడిశా) అనే గిరిజన గ్రామం ఉంది. ఒడిశా కొండల్లో ఉద్భవించిన గంగమ్మ మందస మండలంలో మహేంద్రతనయ నది పేరిట పారుతోంది. ఈ నది ప్రవాహం సోంపేట మండలంలోని శాసనాం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

బుడారిసింగి సంస్థానాన్ని జమీందారులు పరిపాలించేటప్పుడు బత్తర్‌సాయి మందస సంస్థానంలోనే ఉండేది. రాష్ట్రాల విభజనలో ఈ ప్రాంతం ఒడిశా రాష్ట్రంలో కలిసిపోయింది. మంజూష(మందస)లను రాజులు, బుడారిసింగిని జమీందారులు పరిపాలించే సమయంలో బత్తరసాయి ప్రాంతంలో హోమాలను చేసేవారు. దీంతో ఈ ప్రాంతానికి హోమోకుండో(యజ్ఞశాల) అనే పేరు వచ్చింది. కొండలపై నుంచి జాలువారుతున్న నీరు ఒక్కచోట చేరి, జలపాతంగా మారుతుంది. కొండలు, కోనలు, వాగులు, వంకలు, పక్షులు, గిరిపుత్రులు సంస్కృతి, సంప్రదాయాలు దారిపొడవునా అలరిస్తాయి.

ఇలా చేరుకోవాలి..

బస్సులో గానీ, సొంత వాహనాల ద్వారా మందస చేరుకోవాలి. మందస నుంచి చీపి మీదుగా బత్తరసాయికి ఒక రహదారి ఉంది. బుడారిసింగి మీదుగా ఒక రహదారి ఉంది. చీపీ రహదారిలో వెళ్తే ఆరు కిలోమీటర్ల దూరం ఉంటుంది. బుడారిసింగి మీదుగా వెళ్తే 5కిలోమీటర్ల దూరం ఉంటుంది. బత్తరసాయి గ్రామం కొండపై, దిగువ జలపాతం ఉంటుంది.

కబంధ హస్తాల నుంచి విముక్తి

- రూ.3 కోట్ల విలువైన ప్రభుత్వ భవనం కాజేయాలని చూసిన అక్రమార్కుడు
- లీజు గడువు తీరినా విడిచిపెట్టని వైనం
- కలెక్టర్ చొరవతో ఎట్టకేలకు ప్రభుత్వ పరం



ప్రైవేటు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్న రూ.3 కోట్ల విలువైన భవనం

కాశీబుగ్గ:

కోట్ల విలువైన ప్రభుత్వ భవనాన్ని కాజేయడానికి కొందరు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. కలెక్టర్ చొరవ తీసుకోవడంతో ఆ భవనం ప్రభుత్వ పరమైంది. వివరాల్లోకి వెళితే.. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ న్యూకాలనీలో సర్వే నంబర్ 207/02 సబ్ డివిజన్‌లో ఐదు సెంట్ల స్థలంలో పాతికేళ్ల కిందట గ్రామ పరిపాలన భవనాన్ని నిర్మించారు. రెవెన్యూ అధికారులు ఇక్కడ పనులు చేసుకునేవారు. ఇరవై రెండేళ్ల క్రితం భవనం కింద భాగాన్ని ఓ ప్రైవేటు వ్యాపారి లీజుకు తీసుకున్నారు. అయితే అది చేతులు మారి భవనాన్ని కాజేసేంత వరకు వెళ్లింది. సచివాలయాల రాకతో ఈ భవనాన్ని వినియోగించడం ఆపేశారు. మూడేళ్లుగా అధికారులు అటువైపు వెళ్లడమే లేదు. దీంతో ఆ భవనాన్ని సొంతం చేసుకోవడానికి ప్రైవేటు వ్యక్తులు పన్నాగాలు పన్నారు. ఈ విషయం పలాస ఆర్డీఓ కార్యాలయంతో పాటు కలెక్టర్ కార్యాలయానికి తెలిసింది. లీజుకు తీసుకున్న వారు గడువు తీరినా ఇంకా భవనాన్ని వినియోగిస్తూనే ఉన్నారు. దీనికి స్థానిక టీడీపీ నాయకులు కూడా సహకరించారు. అధికారులను బెదిరిస్తూ సమస్యలు సృష్టిస్తూ బిల్డింగ్‌ను తమ అదుపులో ఉంచుకున్నారు.

కలెక్టర్ చొరవతో...

ఈ విషయం కలెక్టర్‌కు తెలియడంతో ఆయన కలుగజేసుకున్నారు. ఆ భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో పలాస తహసీల్దార్ లంబాల మధుసూదనరావు, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ రవికుమార్, పలాస మండలం రెవెన్యూ అధికారుల సంఘ అధ్యక్షులు కంచరాన ఖగేశ్వరరావు, వీఆర్ఓ సోమేశ్వరరావు, రెవెన్యూ శాఖ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొని భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

'171 గ్రామాలకు సరిహద్దు రాళ్లు అందించాం'



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. ఆయన శనివారం తన చాంబర్ నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన స్టోన్ ప్లాంటేషన్ పనుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 30 మండలాలకు సంబంధించి 171 గ్రామాలకు సరిహద్దు రాళ్లు పూర్తి స్థాయిలో అందజేశామని, నేటికి 4 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తికావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ప్రారంభం కాని గ్రామాల్లో రేపటి నుంచి ప్రారంభించి బుధవారం నాటికి పూర్తి చేయాలన్నారు. పనుల్లో పురోగతి లేని గ్రామాల సిబ్బందితో సమావేశం నిర్వహించి, జాప్యానికి గల కారణాలపై వివరణ కోరినట్లు తెలిపారు. కార్యక్రమానికి సంబంధిత గ్రామస్థాయి సిబ్బందిని వినియోగించుకోవాలని అన్నారు.

సైకిల్‌పై ప్రపంచ యాత్ర



జగతి వద్ద స్థానికులతో ముచ్చటిస్తున్న పారిస్ సైకిల్ యాత్రికులు

కవిటి: వివిధ దేశాల్లో భౌగోళిక పరిస్థితులు, ప్రజల జీవన విధానం, ప్రకృతి రమణీయతను పరిశీలించేందుకు ఇద్దరు విదేశీయులు సైకిల్‌పై ప్రపంచాన్ని చుట్టేస్తున్నారు. పారిస్‌కు చెందిన ఎరిక్, మేరీ దంపతులు సైకిల్‌పై యాత్ర చేస్తున్నారు. వీరు శనివారం కవిటి మండలం జగతికి రావడంతో స్థానికులు వారిని చూసి ముచ్చటపడ్డారు. ఏడాది కాలంగా తాము సైకిల్ యాత్ర చేస్తున్నామని, సెప్టెంబర్‌లో ఇండియాలో అడుగుపెట్టామని తెలిపారు. గతంలో కూడా తాము ఇలాంటి యాత్ర చేశామన్నారు. ఈ యాత్రను బంగ్లాదేశ్‌లో ముగించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

వీఆర్‌కు టెక్కలి ఎస్‌ఐ హరికృష్ణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): టెక్కలి ఎస్‌ఐగా పని చేస్తున్న హరికృష్ణను వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు శనివారం జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. టెక్కలిలో ఈనెల 4వ తేదీన జరిగిన బర్త్‌డే వేడుకల్లో డ్యాన్సర్లతో కలిసి స్టేజీ మీద స్టెప్పులేసిన వీడియో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

తీరంలో అస్థి పంజరం



కళింగపట్నం ఒంటూరు మధ్య తీరంలో ఒడ్డున చేరిన అస్థిపంజరం

కవిటి: మండలంలోని కళింగపట్నం, ఒంటూరు గ్రామాల నడుమన సముద్ర తీరంలో శనివారం ఉదయం ఓ మనిషి అస్థిపంజరం ఒడ్డుకు చేరింది. ఉదయం సముద్రంలో వేటకు వెళ్లిన కొంతమంది మత్స్యకారులకు ఈ అస్థి పంజరం కనిపించింది. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ వార్త వైరల్ కావడంతో విషయం తెలుసుకున్న కవిటి పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లారు. కానీ అప్పటికే సముద్రపు పోటు వల్ల అస్థి పంజరం సముద్రంలోకి వెళ్లిపోయింది. మరో రెండు రోజులు తీర ప్రాంత గ్రామాల్లో దీనిపై నిఘా వేసి మళ్లీ కనిపిస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

మూడు రాజధానులకు మండల పరిషత్ తీర్మానం



మూడు రాజధానులకు మద్దతుగా తీర్మానం చేస్తున్న దృశ్యం

సారవకోట: రాజధాని వికేంద్రీకరణకు మద్దతుగా శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు తీర్మానం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో రాజధాని వికేంద్రీకరణ, మూడు రాజధానులకు మద్దతుగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ కొండాల దేవేంద్ర, పశు సంవర్ధక శాఖ డీడీ వి.జయ రాజ్, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు ఉన్నారు.

డిసెంబర్ 16 నుంచి రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: నెల్లూరు వేదికగా ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2022 పోటీలు డిసెంబర్ 16 నుంచి 18 వరకు జరగనున్నాయి. ఇందుకుగాను శ్రీకాకుళం జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులంతా సన్నద్ధం కావాలని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డేపల్లి నారాయణ రావు, ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు, కార్యనిర్వాహణక కార్యదర్శి చల్లా జగదీష్ తెలిపారు. దీని కోసం ఆదివారం ఉదయం 6.30కు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో సమావేశం అవుతున్నట్టు వారు తెలిపారు. 35 ఏళ్లు పైబడిన మాస్టర్ అథ్లెట్స్ అంతా సమావేశానికి హాజరుకావాలని నారాయణరావు, అప్పారావు, జగదీష్ కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,380–00
బంగారం(22సి. 10గ్రా.)	46,460–00
వెండి (కిలో)	60,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

మేలైన పశు సంపదకు..

- ఆడ దూడల ఉత్పత్తి పథకంతో రైతులకు మేలు
- లాభాల బాటలో పాడి రైతులు
- లింగ నిర్ధారిత వీర్యంతో మేలైన పెయ్యిదూడలు



కృత్రిమ గర్భధారణకు వీర్యం ఎక్కిస్తున్న పశువైద్యులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

పాడి రైతులకు ఆడ దూడల ఉత్పత్తి పథకం వరంలా మారుతోంది. ప్రస్తుతం కృత్రిమ గర్భధారణ ద్వారా సగం మగ దూడలు, సగం ఆడదూడలు పుడుతున్నాయి. ప్రస్తుతం పొలం దుక్కి, ఇతర పనులు ట్రాక్టర్ వంటి పరికరాలతో చేస్తున్నందున మగ దూడల నిర్వహణ రైతుకు భారంగా మారుతోంది. ఇలాంటి తరుణంలో రాష్ట్రీయ గోకుల మిషన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆడ దూడల ఉత్పత్తి పథకాన్ని ప్రారంభించింది. ఎంపిక చేసిన గ్రామాల్లో మేలుజాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా పెయ్యి దూడలను ఎక్కువ ఉత్పత్తి చేసి తద్వారా పాల దిగుబడి పెంపొందించడమే దీని లక్ష్యం. లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా రైతులకు కావాల్సిన మేలైన పెయ్యి దూడలను 90 శాతం కచ్చితత్వంతో పుట్టించి తద్వారా పాల దిగుబడి, రైతుల ఆదాయం పెంపొందించడం చేస్తారు.

గ్రామాల ఎంపిక

ప్రతి జిల్లాలో మేలైన పశు సంపద, ఔత్సాహిక పశుపోషకులు కలిగిన గ్రామాలను ఎంపిక చేస్తారు. ఆ గ్రామాల్లో కనీసం 35 నుంచి 40 పశువులను గుర్తించి రైతులతో ఒప్పందం చేసుకొని లింగ నిర్ధారిత వీర్యంతో పశువులను కట్టిస్తే 25 ఆడ దూడలు పుట్టే అవకాశం ఉంది. అలా పుట్టిన దూడలు 3 నుంచి 4 ఏళ్ల తర్వాత చూలు కట్టి ఆ గ్రామాలలో రోజుకు కనీసం 200 నుంచి 250 లీటర్ల పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంటుంది.

లబ్ధిదారులు, పశువుల ఎంపిక

లింగ నిర్ధారిత వీర్యంపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక పశుపోషకులు అందరూ అర్హులే. ఈ మధ్య ఈనిన (60 నుంచి 90 రోజులలోపు), 1 నుంచి 3 ఈతల మధ్య క్రమం తప్పకుండా ఎదకు వచ్చే ఆరోగ్యవంతమైన, ఎలాంటి గర్భకోశ వ్యాధులు లేని పశువులలో కట్టు శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వాటిని ఎంపిక చేస్తారు. ముర్రా, జెర్సీ, హెచ్ఎఫ్, జెర్సీ క్రాస్, హెచ్ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్ మొదలైన జాతుల లింగ నిర్ధారిత వీర్య నాళికలు అందుబాటులో ఉంచుతున్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో కృత్రిమ గర్భధారణకు ఒక్కొక్కటి రూ. 675 విలువ గల లింగ నిర్ధారిత వీర్యనాళికలను రెండు పర్యాయాలు కృత్రిమ గర్భధారణ చేయడం కోసం సబ్సిడీపై అందిస్తారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది.

అమలు విధానం..

ఈ పథకంపై ఆసక్తి కలిగిన పశుపోషకులు సంబంధిత పశువైద్యాధికారులతో ఒప్పందం కుదుర్చుకొని తమ వాటాగా ఒక్కొక్క పశువుకు డబ్బులు చెల్లించాలి. ఒక వేళ రెండు పర్యాయాలు కృత్రిమ గర్భధారణ తర్వాత కూడా పశువు గర్భం దాల్చకపోతే రైతు చెల్లించిన మొత్తం తిరిగి చెల్లిస్తారు. కేవలం ఒక్కసారి మాత్రమే కృత్రిమ గర్భధారణ చేయించి తర్వాత చేయించని రైతులకు డబ్బులు తిరిగి చెల్లించరు. అలాగే మొదటి సారి మగ దూడ పుడితే డబ్బులు వాపసు ఇవ్వరు. రెండోసారి కూడా మగ దూడ పుడితే రూ.250 ఇస్తారు. దీని తర్వాత వీటిపై అవగాహన కూడా కల్పిస్తారు. లావేరు, రణస్థలం, శ్రీకాకుళం రూరల్, గార, జలుమూరు, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం మండలాల్లో ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మేలుజాతి పశు సంపదే లక్ష్యం



రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా మేలుజాతి ఆంబోతుల నుంచి సేకరించిన వీర్యాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లింగనిర్ధారిత వీర్యంగా అభివృద్ధి చేయడమే దీని లక్ష్యం. వందలో 90 శాతం ఆడ దూడలు పుట్టించి తద్వారా అతి తక్కువ కాలంలోనే అత్యుత్తమ జాతి పశుసంపద అధిక సంఖ్యలో అభివృద్ధి చేసి రైతులకు అధిక పాల దిగుబడి, అధిక రాబడి పొందడానికి ఒక వినూత్న పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. చూడి నిలబడకుంటే రైతు కట్టిన రూ.500 వాపసు ఇస్తున్నాం. జిల్లాలో 8వేల పశువులకు ఈ పథకం ద్వారా కృత్రిమ గర్భధారణ చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించాం.

– డాక్టర్ శివ్వాల మన్మధరావు, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం శ్రీకాకుళం

'విశాఖ సభకు తరలిరండి'



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, చిత్రంలో మంత్రి బొత్స తదితరులు

ఆమదాలవలస: అభివృద్ధి–సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలిస్తున్నారని శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన శనివారం సాయంత్రం ఆమదాలవలస పట్టణంలో ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేందుకు సీఎం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతు తెలపాలన్నారు. విశాఖలో ఈ నెల 12వ జరగనున్న బహిరంగ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆ కార్యక్రమానికి హాజరు కానున్నారని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో నిర్వహించే సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సీఎం హాజరవుతున్న సభకు ప్రజలను తీసుకెళ్లే బాధ్యత నాయకులదేనని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ విశాఖ సమావేశానికి పెద్ద ఎత్తున తరలివెళ్లాలన్నారు. సమావేశంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

న్యాయ చట్టాలపై అవగాహన



వెంకటాపురంలో సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ కోర్టు జడ్జి భరణి

లావేరు: న్యాయ చట్టాల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎక్సైజ్ కోర్టు జడ్జి భరణి అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా మండలంలోని వెంకటాపురం, జీజీవలస, బెజ్జిపురం గ్రామాల్లో శనివారం న్యాయచట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. సదస్సుల్లో న్యాయచట్టాలు, భూతగాదాలు, కుటుంబ తగాదాలు, క్రిమినల్ కేసులు గురించి జడ్జి వివరించారు. ఈ నెల 12వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని ఏవైనా కేసులు ఉంటే ఆరోజు పరిష్కరించుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. గ్రామాల్లో తగాదాలు పడకుండా అందరూ కలిసి ఐకమత్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొంతు ఎల్లంనాయుడు, పంచాయతీ కార్యదర్శి కె.రామకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

కోలుకున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



చికిత్స పొందుతున్న విద్యార్థినులు



అస్వస్థతకు గురైన విద్యార్థిని అంబులెన్స్‌లో తీసుకు వెళుతున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో శుక్రవారం అస్వస్థతకు గురైన విద్యార్థులు కోలుకున్నారు. ఇక్కడి ఎస్ఎం పురం క్యాంపస్‌లో ప్రస్తుతం 3200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఫుడ్ పాయిజన్ కావడం వల్ల వంద మంది వరకు అనారోగ్యానికి గురయ్యారు. వీరిలో 40 మందికి వైద్య సేవలు అందించాల్సి వచ్చింది. దీంతో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ వసతి గృహాల్లో ఉన్న ఆస్పత్రి పడకల్లో స్థానిక వైద్యులు, సిబ్బంది చికిత్స నిర్వహించారు. ఇద్దరి పరిస్థితి అదుపులోకి రాకపోవటంతో శుక్రవారం అర్ధరాత్రి శ్రీకాకుళం రిమ్స్‌కు అంబులెన్స్‌లో తరలించారు. శనివారం ఉదయం 15 మంది అస్వస్థతకు గురయ్యారు. భయం వల్ల కొంతమందికి కళ్లు తిరగటం వంటి సమస్యలు ఎక్కువయ్యాయి. ఆ తర్వాత విషయం తెలుసుకున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తహసీల్దార్ సత్యనారాయణను ట్రిపుల్ ఐటీకి పంపించారు. ఆయన ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో డాక్టర్ కిశోర్‌తో కూడిన వైద్య బృందం వైద్య సేవలు ప్రారంభించింది. ముగ్గురిని మాత్రం 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యార్థులంతా కోలుకున్నారు. ఆహారం కలుషితం కావడం వల్లే సమస్య తలెత్తినట్లు ప్రాథమికంగా గుర్తించారు. నీరు, ఆహార శ్యాంపిల్స్‌ను అధికారులు సేకరించారు.

ఇక్కడ బాలురు, బాలికలకు వేర్వేరుగా మెస్‌లు నిర్వహిస్తున్నారు. వంట మాత్రం ఒకే కిచెన్‌లో చేస్తున్నారు. రెండు మెస్‌లలో భోజనాలు చేసిన వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. చపాతీ అల్పాహారం పైనే విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ట్రిపుల్ ఐటీని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి, ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, అధికారులతో సమీక్షించారు.

ఎందుకంత నిర్లక్ష్యం..

ఈ వ్యవహారంలో ట్రిపుల్ ఐటీ అధికారుల వైఖరిపై విమర్శలు వినిపిస్తున్నాయి. వేల మంది చదువుతున్న ఈ విద్యా సంస్థలో కొందరికి ఆరోగ్య సమస్య తలెత్తితో బయటకు చెప్పలేదు. స్థానికంగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది తోనే చికిత్స చేశారు. మందులను బయటకు వెళ్లి కొని తెచ్చారు. సాధారణంగా పది మందికి మించి అస్వస్థతకు గురైతే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలి. కానీ అలా చేయలేదు. పిల్లల ఆరోగ్యం విషయంలో ఇలా గోప్యంగా వ్యవహరించడం సరి కాదని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రత్యేక వైద్య బృందాలు నిరంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సమీక్షిస్తున్నాయి. అవసరమైన మందులు, అంబులెన్స్‌ను సైతం సిద్ధంగా ఉంచారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు: మంత్రి బొత్స



ట్రిపుల్ ఐటీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: అస్వస్థతకు గురైన విద్యార్థులకు పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఆయన శనివారం సాయంత్రం శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీని పరిశీలించి డైరెక్టర్ జగదీశ్వరరావు, అధికారులతో మాట్లాడారు. విద్యార్థులు పూర్తిగా కోలుకున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చూడాలని, అందరూ కోలుకునేంత వరకు వైద్య సహాయం అందజేయాలని సూచించారు. ఆయన వెంట విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఎస్పీ జీఆర్ రాధిక, నాయకులు మెంటాడ వెంకటస్వరూప్ పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు శవమయ్యాడు!



మృతి చెందిన దుర్గాప్రసాద్ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాం అక్కివలస గ్రామానికి చెందిన లావేటి దుర్గాప్రసాద్ (24) గత నెల 24న కనిపించకుండాపోయి ఆఖరుకు శవమై తేలాడు. ఐటీఐ చేసిన ఈ యువకుడు స్థానిక పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఈయన తండ్రి సూరప్పుడు మూడు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఇంటిలో చిన్నపాటి గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గత నెల 24న దుర్గా ప్రసాద్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి శాంతి గత నెల 30న ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదృశ్యమైన వాడు తిరిగి వస్తాడనే అంతా భావించారు. అయితే అరిణాంఅక్కివలస శివారు తోటల్లో పశువుల కాపర్లు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని శనివారం గుర్తించారు. దీనిపై గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతదేహం బాగా పాడైపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. అయితే ఆనవాళ్లను నిశితంగా పరిశీలించాక చనిపోయిన వ్యక్తి దుర్గా ప్రసాద్ అని తెలిసింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని జేఆర్ పురం సీఐ స్వామి నాయుడు పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు మృతదేహాన్ని తరలించారు. నెలల వ్యవధిలో భర్త, కుమారుడుని కోల్పోయిన తల్లి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిషత్తులే నాటక రంగానికి ఊపిరి





ప్రసంగిస్తున్న ముఖ్య అతిథి శ్రీనివాస్, నాన్నా నేనొచ్చేస్తా నాటిక దృశ్యాలు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు నాటక రంగం పరిషత్తుల నిర్వహణతోనే నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక నాటక పరిషత్‌ల సమాఖ్య కార్యదర్శి జవ్వాది దాశరథి శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో రెండో రోజు నాటిక పోటీల సందర్భంగా శనివారం సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలోని రుగ్మతలను ప్రజల ముందు సజీవంగా ఉంచాలని కోరారు. ఇక్కడి సమాఖ్యను ఆదర్శంగా తీసుకొని కొన్ని సమాఖ్యలు నెలవారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా పేద కళాకారులకు నెలవారి అందించే రూ.400లు పింఛన్‌ను 30మంది కళాకారులకు అందించారు. అలాగే లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హారికా ప్రసాద్ ప్రతినెల సమాఖ్యకు పింఛన్ల కోసం రూ.500లు అందిస్తానని ప్రకటించారు.

సామాజిక సమస్యలపై

పెళ్లిపై సరైన అభిప్రాయం లేక ఎందరో తమ కాపురాలను కూల్చుకుంటున్నారు. పెళ్లయిన కూతురు నేనొచ్చేస్తా అన్న మాటలకు స్వస్తి పలికి నాన్నా మీరు మా ఇంటికి రండి అని ఆహ్వానం పలికే రోజులు రావాలనే ఇతి వృత్తంతో సాగిన నాన్నా నేనొచ్చేస్తా నాటిక అందరినీ ఆకట్టుకుంది. పాత్రుని పాపారావు సౌజన్యంతో చిలకలూరి పేట అంజనా రాథోడ్ థియేటర్స్ వారు ప్రదర్శించారు. ఈ కథకు రచన తాళాబత్తుల వేంకటేశ్వరరావు, దర్శకత్వం ఆర్ఎస్ఆర్ నాయక్ వహించారు. ఇక ఆర్థిక సంబంధాల నడుమ ఆప్తులను కోల్పోతున్న కథతో కొత్త భూతం నాటిక ఆకట్టుకుంది. ఈ భూతం నుంచి బంధాలను కాపాడుకునేందుకు ఒక తల్లి చేసిన ప్రయత్నమే ఈ నాటిక. జస్టిస్ డాక్టర్ గురుగుబెల్లి యతిరాజు సౌజన్యంతో ఒంగోలు జిల్లా కరవది, ప్రకాశం కళాపరిషత్ వారిచే ప్రదర్శించిన ఈ నాటికను డాక్టర్ శ్రీజ సాదినేని రచించగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. ఈ రెండు నాటికలకు సంగీతాన్ని లీలాకృష్ణ అందించారు.

రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలకు సబ్ కలెక్టర్‌కు ఆహ్వానం



టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డిని ఆహ్వానిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు

టెక్కలి: ఈ నెల 11 నుంచి 13 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా పోటీలకు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్.రామారావు, బి.అప్పలస్వామి, ఎస్.రవి, బి.లక్ష్మణరావు తదితరులు సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

క్లుప్తంగా

అప్పలనాయుడుకు డాక్టరేట్ ప్రదానం



ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి నుంచి డాక్టరేట్ స్వీకరిస్తున్న అప్పలనాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్ గ్రామానికి చెందిన న్యాయవాది సూర అప్పలనాయుడుకి ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. విద్యా విభాగంపై ప్రస్తుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్, ఏయూ విద్యావిభాగం ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు గైడ్‌గా జీవితంలో వ్యక్తికి అవసరమైన జీవన నైపుణ్యాలపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ వచ్చింది. ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి నుంచి అప్పలనాయుడు డాక్టరేట్‌ను అందుకున్నారు.

ప్రసాదం వితరణ



ప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం

గార: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా శ్రీకూర్మనాథాలయంలో సతివాడ సర్పంచ్ యాళ్ల నారాయణమూర్తి దంపతులు నాలుగు వేల మంది భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, పార్టీ కన్వీనర్ పీస శ్రీహరిరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఈఆర్ స్కూల్‌కు అంతర్జాతీయ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న సాయిచందు

రణస్థలం: రణస్థలంలోని ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సుకు ఇండో-యూకే గ్లోబల్ బిజినెస్ ఎంక్లేవ్‌లో ప్రామిసింక్ స్కూల్ ఇన్నొవేటింగ్ టీచింగ్ లెర్నింగ్ ప్రాక్టీస్, హలిస్టిక్ డెవలప్‌మెంట్ అవార్డు దక్కింది. ఈ విషయాన్ని స్కూల్ చైర్మన్ ఎస్.ఈశ్వరరావు శనివారం తెలిపారు. లండన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో జరిగిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎస్.సాయిచందు అవార్డును అందుకున్నట్టు చెప్పారు. ముఖ్య అతిథులుగా బ్రిటన్ అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాల మంత్రి వర్యులు రుత్ క్యాడ్బరి, భారత్, బ్రిటన్ యూరోపియన్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ దినేష్ ధమిజా, బ్రిటన్ పార్లమెంట్ ఎంపీలు పాల్గొన్నట్టు పేర్కొన్నారు. పాఠశాలకు అవార్డు రావడంపై ఆనందం వ్యక్తం చేశారు.

అవినీతిని అరికడదాం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీడీఓ కార్యాలయంలో విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. కరప్షన్ ఫ్రీ ఇండియా ఫర్ డెవలప్‌మెంట్ నేషన్ అనే అంశంపై అధికారులతో సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మధరావు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.విశ్వేశ్వరరావు, ఏడీ డ్రగ్స్ చంద్రశేఖరరావు, ఇరిగేషన్ ఈఈ సంతోష్ తదితరులు పాల్గొన్నారు. పెదపాడులోని అంబేడ్కర్ గురుకులంలో విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా ప్రిన్సిపాల్ యశోద లక్ష్మీ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: ఇటీవల రేణిగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాఫింగ్ రెజ్లింగ్ పోటీల్లో మునసబుపేటలోని గురజాడ-గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌కు చెందిన విద్యార్థులు ఆర్.భీమేశ్వరరావు, ఎస్.శ్యాంప్రసాద్ సత్తాచాటి రజత, కాంస్య పతకాలు సాధించారు. తద్వారా నవంబర్ 22న ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, తెలుగు విభాగాధిపతి గౌరీశంకర్, గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు శనివారం అభినందించారు.

చట్టాలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి కె.నాగమణి అన్నారు. శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, సీనియర్ అడ్వకేట్ ఈశ్వరరావు పాల్గొన్నారు.



ఇంద్రపుష్కరిణికి ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న దృశ్యం



అరసవల్లి ఇంద్ర పుష్కరిణిలో సూర్యనారాయణ స్వామి తెప్పోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తజనం

వైభవంగా తెప్పోత్సవం

క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా పలు క్షేత్రాల్లో తెప్పోత్సవ వేడుక ఘనంగా జరిగింది. అరసవల్లిలో ఆదిత్యుడు, శ్రీకూర్మంలో కూర్మనాథుడు, కలెక్టర్ బంగ్లా సమీపంలో కల్యాణ వేంకటేశ్వరుడు, బలగలో అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులు జల విహారం చేసి భక్తులకు కనువిందు చేశారు. అంతకుముందు స్వామివార్లకు అర్చకులు ప్రత్యేక పూజులు, అభిషేకాలు చేశారు. – అరసవల్లి/శ్రీకాకుళం కల్చరల్/గార



అరసవల్లిలో భక్తజన కోలాహలం



తెప్పలు వదులుతున్న భక్తులు



సన్నాయి మేళం



శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్పస్వామి ఆలయ మణిగంగ పుష్కరిణిలో తెప్పోత్సవం



తెప్పోత్సవంలో బాణాసంచా పేలుళ్లు



కోలాట ప్రదర్శన



ఉత్సవమూర్తులు



గార: శ్రీకూర్మంలోని శ్వేతపుష్కరిణి వద్ద భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా సమీపంలో పల్లకిలో ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరుడు



శ్రీకాకుళం కల్చరల్: విద్యుత్ వెలుగుల్లో అయ్యప్ప ఆలయం

'పది వేల కోట్లతో అభివృద్ధి పనులు'



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, పక్కనే ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: విశాఖలో సుమారు పదివేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఈ నెల 12న ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఎచ్చెర్లలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం పార్టీ నాయకులతో మాట్లాడారు. ప్రధానితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొనే కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు విశాఖ ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో సమావేశం ఉంటుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రధానికి ఘన స్వాగతం పలకాలన్నారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజధాని విశాఖ నినాదాన్ని ప్రధానికి తెలియజెప్పేందుకు ఇదో చక్కటి అవకాశమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ ప్రతినిధులను సన్నద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠం నాయుడు, రాష్ట్ర తూర్పు కాపు చైర్మన్ మామిడి శ్రీకాంత్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, జిల్లా నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరం

రణస్థలం: న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండి నేరాల నియంత్రణకు సహకరించాలని ఎక్సైజ్ ప్రొహిబిషన్ న్యాయస్థానం జిల్లా ఎంఎఫ్‌సీపీ భరణి అన్నారు. కోష్ట, జె.ఆర్.పురం, పైడిభీమవరం గ్రామ సచివాలయ పరిధిలో శనివారం న్యాయ సలహాలు, నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక ఆదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సత్వర న్యాయం పొందవచ్చునన్నారు. కక్షిదారులు కేసులను రాజీ కుదుర్చుకోవడం వలన విలువైన సమయాన్ని, డబ్బును అదా చేసుకోవచ్చునన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వరమే పరిష్కారమవుతాయనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం సీఐ బీసీహెచ్ స్వామినాయుడు, పంచాయతీ అధికారులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

లావేరు: విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్‌శాఖ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. సమస్యలపై తక్షణమే స్పందించాలని విద్యుత్‌శాఖ ఏఈ పి రమణమూర్తికి సూచించారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, లావేరు పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, బూత్ కమిటీ మండల మాజీ కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు, విద్యుత్‌శాఖ ఏఈ పి.రమణమూర్తి పాల్గొన్నారు.

నవ సమాజాన్ని నిర్మిద్దాం

శ్రీకాకుళం అర్బన్: అవినీతికి వ్యతిరేకంగా పోరాడి నవసమాజాన్ని నిర్మిద్దామని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ గురునాథరావు అన్నారు. జాగరుకతా వారోత్సవాలలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం రీజనల్ ఆఫీస్ తరపున రీజనల్ హెడ్ గురునాథరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం డేఅండ్ నైట్ జంక్షన్ వద్ద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ ప్రేమ్‌బాబు, దుర్గాప్రసాద్, చీఫ్ మేనేజర్లు కృష్ణ ,మాధురి, పవన్ మండల్, విజిలెన్స్ ఆఫీసర్ రాజశేఖర్, తేజేశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దరుప్పపేటలో వైద్య శిబిరం

ఎచ్చెర్ల: పెద్దరుప్పపేట గ్రామంలో పొన్నాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం కుమారిలు అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మంచినీటి వినియోగంపై స్థానికులకు అవగాహన కల్పించారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక డ్రైవ్

శ్రీకాకుళం రూరల్: అర్హులైన పట్టభద్రులు విధిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమోదు కోసం ఆదివారం గార, శ్రీకాకుళం మండలాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని, బీఎల్ఓలు ఉదయం 9 నుంచి 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

విశాఖకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈ నెల 12న జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలో వైఎస్సార్‌సీపీ టౌన్ హాల్‌లో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి వేలాదిగా విశాఖకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెడదామని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రూరల్, గార మండలాల నాయకులు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మూకళ్ల తాతబాబు, అంబటి శ్రీనివాస్, గొండు రఘు, పీస శ్రీహరి, చిట్టి జనార్దన రావు తదితరులు పాల్గొన్నారు.

సాయికుమార్‌కు బొత్స పరామర్శ

రణస్థలం: పాతర్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ తండ్రి రాంబాబు ఇటీవల మృతి చెందారు. దీంతో సాయికుమార్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ శ్రేణులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

రణస్థలం: అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జీవి చిట్టిరాజు హెచ్చరించారు. కొండములగాం, కోష్ట గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న వైఎస్సార్ జలకళ బోర్ వెల్స్, తోటల్లోని ట్రెంచ్ (కందకాలు) పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం చెరువుల్లో నీరు ఉన్నందున తోటల్లోని కందకాలు తవ్వే పనులు చేయాలని సూచించారు. సగటు వేతనం రూ. 250 వచ్చే విధంగా వేతనదారులతో పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా అగ్రస్థానంలో ఉండే విధంగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీఏవో శ్రీనివాసనాయుడు, ఈసీ గౌరీకృష్ణ ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కొత్తకోటలో సచివాలయ భవన నిర్మాణ క్వాలిటీని పరిశీలిస్తున్న అధికారులు

లావేరు: ప్రభుత్వ భవనాల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ ఈఈ శేఖర్ అన్నారు. కొత్తకోట, గోవిందపురం, మురపాక గ్రామాల్లో శనివారం క్వాలిటీ కంట్రోల్ ఈఈ శేఖర్, డీఓ శ్యాముల్, ఏఈ సత్యన్నారాయణలు పర్యటించి సచివాలయాలు, ఆర్‌బీకే, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనును తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు, క్వాలిటీ ప్రకారం నిర్మిస్తున్నారా లేదా పరిశీలించారు. భవనాలు నిర్మించిన కొన్ని చోట్ల ముక్కలు తీసి క్వాలిటీ పరీక్షల కోసం తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. పంచాయతీరాజ్ మండల ఏఈ లింగాల అప్పన్న, ఎంపీటీసీ సభ్యులు గంట్యాడ సత్యం, తేనేల సురేష్‌కుమార్, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.


సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న జయప్రకాష్

రణస్థలం: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సైన్స్ ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకోవాలని సమగ్రశిక్షా ఏపీసీ రోణంకి జయప్రకాశ్ అన్నారు. లంకపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ యాజమాన్యం అందజేసిన రూ. లక్షా ముప్పై వేల విలువైన మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్‌కు సంబంధించిన అన్ని సైన్స్ ప్రయోగాల పరికరాలను ఒకే బీరువా తరహాలో అమర్చి తరగతి గదులన్నింటికీ తీసుకెళ్లేలా తయారు చేయడం అద్భుతమైన విషయమన్నారు. రెడ్డీస్ ఫౌండేషన్ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. అనంతరం పాఠశాల ఆవరణను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ రీజనల్ మేనేజర్ ఎస్.ఫణీంద్ర మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో ల్యాబ్ ఆవశ్యకతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటువంటి మొబైల్ సైన్స్ ల్యాబ్‌లను సుమారు 50 పాఠశాలలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్ హైమావతి, రెడ్డీస్ ఫౌండేషన్ సభ్యులు నాగరాజు, కృష్ణ, సునీత ఉన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే



వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి రొక్కం సూర్యప్రకాష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి అడ్డంగా దొరికిన టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు శిక్ష అనుభవించాల్సిందేనని, చట్టం ముందు అందరూ సమానమేనని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రొక్కం సూర్యప్రకాష్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఆస్తులను దోచుకున్నారని, ఇప్పుడు స్వాధీనం చేసుకుంటే రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. బీసీల మీద దౌర్జన్యం అంటూ కులాల మధ్యన చిచ్చుపెట్టడాన్ని మానుకోవాలన్నారు. బీసీలపై జగనన్న చూపిస్తున్న అభిమానం చూసి ఓర్వలేకే టీడీపీ నేతలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధి కోసం మంత్రి పదవినే త్యాగం చేసేందుకు సిద్ధమయ్యారని, దాన్ని చూసి ఓర్వలేని పచ్చపత్రికలు అబద్ధాలు రాయడం సరికాదన్నారు



వెంకన్న డిపాజిట్లపై శ్వేతపత్రం

సాక్షి, అమరావతి, తిరుమల: తిరుమల శ్రీవారి మిగులు బంగారం, నగదు డిపాజిట్లన్నీ ప్రముఖ జాతీయ బ్యాంకుల్లో భద్రంగా దాచినట్లు టీటీడీ తెలిపింది. వెంకన్న ఆస్తులకు సంబంధించి సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాలు తరచూ తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న నేపథ్యంలో బ్యాంకులో దాచిన బంగారం, బ్యాంకు డిపాజిట్లపై టీటీడీ శనివారం శ్వేతపత్రం విడుదల చేసింది. బ్యాంకుల వారీగా ఏ బ్యాంకులో ఎంత బంగారం, డిపాజిట్లు ఉన్నాయన్న వివరాలను అందులో వెల్లడించారు.

మూడేళ్లలో రూ.2,913.59 కోట్లు పెరిగిన డిపాజిట్లు

ప్రస్తుతం 24 బ్యాంకుల్లో స్వామి వారి పేరిట రూ.15,938.68 కోట్లు డిపాజిట్లుగా ఉన్నట్లు టీడీపీ శ్వేతపత్రంలో వెల్లడించింది. 2019 జూన్ 30వతేదీ నాటికి రూ.13,025.09 కోట్లు ఉండగా కరోనా లాంటి అవాంతరాలు ఎదురైనా మూడేళ్లలో బ్యాంకుల్లో స్వామి వారి నగదు నిల్వ రూ.2,913.59 కోట్లు పెరగడం విశేషం. అత్యధికంగా రూ.5,358.11 కోట్లు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో డిపాజిట్లున్నాయి. టీడీపీ హయాంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఏపీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో రూ.50.77 కోట్లు స్వామి వారి నగదు బ్యాంకు డిపాజిట్లుగా ఉండగా ఇప్పుడు వాటిని ఇతర జాతీయ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేసినట్లు టీటీడీ తెలిపింది. ప్రస్తుతం ఏపీ కో ఆపరేటివ్ బ్యాంకులో రూ.1.30 కోట్లు మాత్రమే స్వామి వారి డిపాజిట్లు ఉన్నట్లు పేర్కొంది.

స్వామి వారి మిగులు బంగారం డిపాజిట్లు కేజీల్లో

బ్యాంకు పేరు	2019 జూన్ నాటికి	2022 సెప్టెంబరు
స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా	5,387.56	9,819.38
ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు	19,52.18	438.99
మొత్తం	7,339.74	10,258.37

95% మిగులు బంగారం ఎస్‌బీఐలోనే..

2019 జూన్ 30 తర్వాత బ్యాంకుల్లో స్వామి వారి మిగులు బంగారం నిల్వలు 2,918.63 కిలోలు పెరిగినట్లు టీటీడీ తెలిపింది. 2019 జూన్ 30 నాటికి 7,339.74 కిలోల బంగారం బ్యాంకుల్లో ఉండగా ఇప్పుడు 10,258.37 కిలోలకు పెరిగింది. భక్తులు స్వామి వారి హుండీలో సమర్పించే బంగారు కానుకలను ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మింట్‌లో కరిగించిన అనంతరం నిల్వలను 12 ఏళ్ల కాలానికి గోల్డ్ మానిటైజేషన్ స్కీంలో బ్యాంకుల్లో ఉంచినట్లు టీటీడీ పేర్కొంది. స్వామివారి మిగులు బంగారంలో 95 శాతం బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐలో దాచినట్లు తెలిపింది.

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

శ్రీవారి బంగారం, నగదు డిపాజిట్లను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడిగా పెడుతున్నట్లు ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా కొన్నాళ్లుగా సాగిస్తున్న ప్రచారాన్ని భక్తులెవరూ విశ్వసించవద్దని టీటీడీ శ్వేతపత్రంలో విజ్ఞప్తి చేసింది. 2019 తర్వాత స్వామి ఆస్తులను భద్రపరచే అంశంపై కట్టుదిట్టమైన చర్యలను చేపట్టినట్లు వివరించింది. కరోనా సమయాల్లోనూ నిర్వహణ ఖర్చులను తగ్గించుకుని స్వామివారి ఆదాయం పెరుగుదలకే చర్యలు చేపట్టిందని, మంచి పేరున్న జాతీయ బ్యాంకుల్లో మాత్రమే ఆస్తులను భద్రపరుస్తున్నట్లు తెలిపింది.

జాతీయ బ్యాంకుల్లోనే..

టీటీడీ చరిత్రలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వానికీ డబ్బులు ఇవ్వలేదు. భవిష్యత్తులోనూ ఇవ్వదు. చైర్మన్, టీటీడీపై బురద చల్లేందుకు కొందరు హిందూ మత వ్యతిరేకులు ఇలాంటి దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లలో టీటీడీ ఎప్పుడూ ఇన్వెస్ట్ చేయలేదు. ఇప్పటిదాకా రూ.15,900 కోట్లకుపైగా జాతీయ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేశాం. ఇకపై కూడా వడ్డీ ఎక్కువ ఇచ్చే జాతీయ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేస్తాం. – ధర్మారెడ్డి, టీటీడీ ఈవో

స్వామి వారి నగదు డిపాజిట్లు రూ.కోట్లలో

బ్యాంకు పేరు	2019 జూన్‌లో	2022 సెప్టెంబరులో
స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా	10.20	5358.11
యూనియన్‌బ్యాంకు ఆఫ్ ఇండియా	288.19	1694.25
బ్యాంకు ఆఫ్ బరోడా	1956.53	1839.36
కెనరా బ్యాంకు	4913.73	1351.00
యాక్సిస్ బ్యాంకు	151.59	1006.20
హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్	1253.68	2122.85
సౌత్ ఇండియన్ బ్యాంకు	1229.29	00
ఇండస్ ఇండ్ బ్యాంకు	1218.99	00
ఎస్ బ్యాంక్	1170.00	00
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	00	779.17
కేంద్ర ప్రభుత్వ బాండ్లు(8 శాతం వడ్డీ)	555.17	555.17
పంజాబ్ నేషనల్ బ్యాంకు	00	660.43
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు	4.87	306.31
ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు	00	101.43
ఇండియన్ బ్యాంకు	34.46	25.30
ఫెడరల్ బ్యాంకు	80.04	00
ఐసీఐసీఐ బ్యాంకు	00	9.70
సప్తగిరి గ్రామీణ బ్యాంకు	88.31	99.91
బ్యాంకు ఆఫ్ ఇండియా	5.53	00
యునైటెడ్ కమర్షియల్ బ్యాంకు	3.74	18.54
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	00	1.28
కరూర్ వైశ్యా బ్యాంకు	00	4.37
ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్	10.00	4.00
ఏపీ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకు	50.77	1.30
మొత్తం	13,025.09	15,938.68

● తెలంగాణ

నేడే మునుగోడు తీర్పు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తెలంగాణ వ్యాప్తంగా ఉత్కంఠ రేకెత్తిస్తున్న మునుగోడు ఉప ఎన్నిక ఫలితం మరికొన్ని గంటల్లో వెలువడనుంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన ప్రజా తీర్పు బహిర్గతం కానుంది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ఫలితం తేలిపోనుంది. అధికార టీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఓట్ల లెక్కింపునకు జిల్లా ఎన్నికల అధికారి వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ జరిగే విధానంపై సిబ్బందికి సాధారణ ఎన్నికల పరిశీలకులు పంకజ్ కుమార్ పలు సూచనలు చేశారు. నల్లగొండ ఆర్జాలబావిలోని గోదాముల్లో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు కోసం రెండు ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని 298 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు కోసం 21 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొదటగా చౌటుప్పల్ మండలానికి చెందిన ఓట్లను లెక్కించనున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ట్రెండ్ తెలిసిపోనుంది. 2–3 గంటల కల్లా ఎవరి భవితవ్యం ఏంటనేది తేలనుంది. నియోజకవర్గంలో 2,41,855 ఓటర్లు ఉన్నారు. అందులో సర్వీసు ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ కలుపుకొని ఈ ఉప ఎన్నికల్లో 2,25,878 ఓట్లు పోలయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా 93.41 శాతం పోలింగ్ నమోదైంది. భారీ స్థాయిలో ఓట్లు పోలైన నేపథ్యంలో కౌంటింగ్‌కు సంబంధించి ఎంత ఆలస్యం జరిగినా సాయంత్రం 4 గంటల వరకు ఫలితం వెల్లడి కానుంది.

టీఆర్‌ఎస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజీనామా నాటి నుంచే అనధికారికంగా ప్రచారం మొదలైన సంగతి తెలిసిందే. అక్టోబర్ 3వ తేదీన ఎన్నికల షెడ్యూల్ జారీ అయినప్పటి నుంచి అధికారికంగా ప్రచారం కొనసాగింది. హోరాహోరీగా సాగిన ఈ ప్రచారంలో టీఆర్‌ఎస్, బీజేపీ పెద్ద ఎత్తున పోటీ పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ కూడా తామేం తీసిపోమన్నట్లుగా ప్రచారం నిర్వహించింది. అయితే టీఆర్‌ఎస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. గులాబీ దళం, కమలనాథులు ఎవరికి వారు తమదే గెలుపనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పోషకాల మెండు.. కోడిగుడ్డు



సాక్షి, హైదరాబాద్: నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్‌ఈసీసీ) కోడిగుడ్డును పోషకాల నిలయంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో 'సండే యా మండే.. రోజ్ ఖావో అండే' అనే నినాదాన్ని ఇచ్చింది. దేశంలో పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధికి డాక్టర్ బీవీ రావు ఎన్‌ఈసీసీని 1982లో ప్రారంభించారు. ఆదివారం బీవీ రావు జయంతి సందర్భంగా కోడిగుడ్డు పరిశ్రమలో ఆయన అందించిన సేవలను ఎన్‌ఈసీసీ గుర్తు చేసుకుంది. బీవీ రావు పౌల్ట్రీ సేవలకు గుర్తుగా ఆయన్ను ఫాదర్ ఆఫ్ ఇండియన్ పౌల్ట్రీ ఇండస్ట్రీగా పేర్కొంటారు. ఫలితంగా నేడు ప్రపంచంలోనే కోడిగుడ్ల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో నిలిచింది. పౌల్ట్రీ పరిశ్రమ ఆర్థికపరమైన అభివృద్ధి సాధించడం మాత్రమే కాక పోషకాహార లోపం నిర్మూలించడంలో కూడా కీలకపాత్ర పోషిస్తోంది.

నాణ్యమైన పరికరాలనే కొంటున్నాం..

ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

సాక్షి, అమరావతి: డిస్కమ్ పరిధిలో వివిధ పనుల కోసం నాణ్యమైన పరికరాలనే కొనుగోలు చేస్తున్నామని ఏపీ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. డిస్కంలో నాసిరకం తీగలు, పరికరాలను కొనుగోలు చేస్తున్నారంటూ ఓ వర్గం మీడియా ప్రచారం చేయడం అవాస్తవమన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. వివిధ పనులకు టెండర్ల స్టాండర్డ్ స్పెసిఫికేషన్స్ రూపొందించే ప్రక్రియలో భాగంగా బిడ్డర్ అర్హతను తెలుసుకోవడం కోసం కూడా టెక్నికల్ స్పెసిఫికేషన్స్‌ను ఇండియన్ స్టాండర్డ్స్ స్పెసిఫికేషన్‌కు అనుగుణంగా తయారు చేస్తారని తెలిపారు. ఈ–ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో రివర్స్ బిడ్డింగ్ ద్వారా పారదర్శకంగా కాంట్రాక్టర్‌కు టెండరు దక్కాక సంబంధిత ఫ్యాక్టరీలో పరికరాల నాణ్యతను ఐఎస్ నాణ్యత ప్రమాణాలననుసరించి థర్డ్ పార్టీ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్‌తో పరీక్షిస్తామని ఆయన వెల్లడించారు. ఆఫీసర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా పరికరాల తరలింపునకు అనుమతించి, ఆయా ఫ్యాక్టరీల నుంచి సంస్థ పరిధిలోని స్టోర్లకు తరలిస్తామని తెలిపారు. స్టోర్లకు చేరిన పరికరాల నాణ్యతను ఐఎస్ నాణ్యత ప్రమాణాలననుసరించి మరోసారి పరీక్షించాకే వాటిని స్టాక్‌లోకి తీసుకుని క్షేత్ర స్థాయిలో అమర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ పనుల్లో, పరికరాల్లో నాణ్యత ప్రమాణాలను పరీక్షించేందుకు డిస్కంలలో ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాలు పని చేస్తున్నాయని వెల్లడించారు. అలాగే, డిస్కంలో లైన్‌మెన్ పోస్టులను కుదించేశారని పేర్కొనడంలో కూడా వాస్తవం లేదని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు క్షేత్రస్థాయిలో నియామకాలు జరగలేదన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే.. క్షేత్రస్థాయి సిబ్బంది నియామకాలకు ఆమోద ముద్ర వేశారని గుర్తు చేశారు. దీంతో 2019 అక్టోబర్‌లో ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 3,088, ఏపీఈపీడీసీఎల్ పరిధిలో 2,859 ఎనర్జీ అసిస్టెంట్లను నియమించినట్లు వివరించారు.

శ్మశానంలో ఆక్రమణలు తొలగించండి

కొండపల్లి మున్సిపల్ అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఉమ్మడి కృష్ణాజిల్లా, కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని సర్వే నంబర్ 431లో ఉన్న శ్మశానాన్ని ఆక్రమించుకుని చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా శ్మశానాల ఆక్రమణల తొలగింపు విషయంలో ఇప్పటికే ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్మశానాన్ని ఆక్రమించుకుని కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఆ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ కొండపల్లికి చెందిన దామెర్ల నాగ సాంబశివరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పూజారి నరహరి బాబు వాదనలు వినిపిస్తూ, కొండపల్లి పరిధిలో హిందూ శ్మశాన వాటికలో పెద్ద బసవయ్య అనే వ్యక్తి అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. శ్మశానంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడమే కాకుండా అంత్యక్రియలకు వచ్చే వారి నుంచి డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శ్మశానాల్లో ఆక్రమణల తొలగింపు విషయంలో ఇటీవల ఇదే ధర్మాసనం తీర్పునిచ్చిందని నరహరి వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, శ్మశానాల్లో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలంటూ ఇప్పటికే ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఈ కేసులో చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఈ ఆదేశాలతో ఈ వ్యాజ్యాన్ని పరిష్కరిస్తున్నట్లు ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

గృహ ప్రవేశానికి వచ్చి.. జలసమాధి

చెరువులో మునిగి టీచర్, ఐదుగురు మదరసా విద్యార్థుల మృతి

జవహర్‌నగర్ /గాంధీఆస్పత్రి /అంబర్‌పేట, కాచిగూడ: ఈత సరదా ఐదుగురు విద్యార్థుల ప్రాణాలను బలితీసుకుంది. వారిని రక్షించడానికి వెళ్లిన మదరసా టీచర్ సైతం మృత్యువాత పడ్డారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ విషాదకర ఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కాచిగూడ ప్రాంతానికి చెందిన హనీఫా మదరసాలో చదువుకునే దాదాపు 40 మంది విద్యార్థులు శనివారం డీసీఎం వాహనంలో వారి టీచర్ యహియా (25)తో కలసి జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని మల్కారంలో ఓ గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఉదయం 11 గంటల సమయంలో కొందరు ఫంక్షన్ జరుగుతున్న ఇంట్లోకి వెళ్లగా, మరికొందరు బయట ఆడుకుంటున్నారు. వీరిలో ఆరుగురు విద్యార్థులు సమీపంలో ఉన్న ఎర్రగుంట చెరువులో సరదాగా ఈతకు వెళ్లారు. నీటిలోకి దిగిన విద్యార్థులు ఈతరాక ఒక్కొక్కరుగా మునిగిపోయారు. వీరిని గమనించిన ఉపాధ్యాయుడు యహియా వేగంగా వచ్చి నీళ్లలోకి దిగి పిల్లలను కాపాడే ప్రయత్నం చేశారు. అయితే పిల్లలు ఆయనను గట్టిగా పట్టుకోవడంతో అందరూ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయారు. వీరిలో ఒక విద్యార్థిని అక్కడే ఉన్న స్థానికుడు రక్షించి ఒడ్డుకు చేర్చాడు. ఈ లోగా టీచర్ యహియాతో పాటు ఐదుగురు విద్యార్థులు.. ఇస్మాయిల్ (11), జాఫర్ (10), సోహెల్ (09), అయాన్ (09), రియాన్(12)లు మృత్యువాతపడ్డారు. పోలీసులు ఈతగాళ్లను రప్పించి మృతదేహాలను బయటకు తీశారు.

ఒడిశా పోలీసుల వాహనం అపహరణ

- పార్వతీపురంలో పట్టుబడిన వైనం
- రాయఘడ పోలీసులకు అప్పగింత



రుద్ర శివ కుమార్‌ను అదుపులోకి తీసుకుంటున్న ఎస్‌ఐ ఫక్రుద్దీన్

పార్వతీపురం టౌన్: ఒడిశా రాష్ట్రం రాయఘడ పోలీసుల వాహనాన్ని ఓ యువకుడు అపహరించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ ఫక్రుద్దీన్ తెలిపిన వివరాలు.. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన రుద్ర శివకుమార్ ఒడిశా రాష్ట్రం శంబల్‌పూర్‌లో తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. రాయఘడ మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి వచ్చి ఓ లాడ్జిలో రూం తీసుకున్నాడు. అక్కడ లాడ్జిలో శివకుమార్‌కు చెందిన రూ.10 వేల నగదు, మొబైల్ ఫోన్ ఎవరో చోరీ చేశారని రాయఘడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడి పోలీసులు ఫిర్యాదును పట్టించుకోకుండా తనపై దాడి చేశారన్న కారణంతో మద్యం మత్తులో వారి కన్నుగప్పి పోలీసుల బొలేరో వాహనాన్ని దొంగిలించి రాజమండ్రి వైపు వెళ్తుండగా రాయఘడ పోలీసులు తెలుసుకొని పార్వతీపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన పార్వతీపురం పోలీసులు పట్టణంలో పట్టుకున్నారు. పట్టణ ఎస్‌ఐ ఫక్రుద్దీన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాయఘడ పోలీసులకు సమాచారం అందించి వాహనాన్ని, శివకుమార్‌ను అప్పగించారు. రాయఘడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10లోగా ఫీజు చెల్లించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: డీఎడ్ నాల్గో సెమిస్టర్ (2020–22 బ్యాచ్) విద్యార్థులు (2019–21 బ్యాచ్) పరీక్ష తప్పిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోగా అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ కె.వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 14 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పరీక్ష రుసుంను పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని సూచించారు. రెగ్యులర్ విద్యార్థులు ఫీజు రూ.250, ఒక సబ్జెక్టు రూ.125, రెండు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.175, నాలుగు సబ్జెలకు రూ.250 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పేదలందరికీ ఇళ్లు

- నెలరోజుల్లో 40 వేల మందికి గృహాల రిజిస్ట్రేషన్
- టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



టిడ్కో గృహ నిర్మాణాలపై ఆరాతీస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన



తోటపల్లి కుడికాలువవద్ద టిడ్కో ఇళ్లకు నీటిసరఫరా మ్యాప్‌ను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన, తదితరులు

పార్వతీపురం: పేదలందరికీ పక్కా ఇంటి భాగ్యం కల్పించాలన్నది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, నెల రోజుల్లో 40 వేల మంది లబ్ధిదారులకు గృహాలను రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. పార్వతీపురం మండలం అడ్డాపుశీల వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహాలను పర్యవేక్షక ఇంజినీర్ డి.నరసింహమూర్తి, కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్.జ్యోతితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 21 నాటికి 1.50 లక్షల గృహాలను రాష్ట్రంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు వెల్లడించారు. ఇందులో ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి 8,400 గృహాలను లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో టిడ్కో గృహాల నిర్మాణాన్ని ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేస్తున్నట్టు వెల్లడించారు. పార్వతీపురంలో 768 టిడ్కో గృహాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 20వ తేదీన పనులను ప్రారంభించామని ఇప్పటివరకు 324 గృహాల నిర్మాణం పూర్తయిందన్నారు. రివర్స్ టెండరింగ్ విధానంలో ప్రాజెక్టు గృహాలను రూ.65 కోట్లతో నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. 1992 నుంచి 2020 సంవత్సరం వరకు చేపట్టిన ప్రాజెక్టులలో టిడ్కో గృహాల ప్రాజెక్టు అతిపెద్దదిగా పేర్కొన్నారు. టిడ్కోకాలనీల్లో 24 గంటలూ తాగునీటి సరఫరా ఉంటుందని, మురుగు నీటిపారుదలకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రజాసంకల్ప యాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి 300 చదరపు అడుగుల ఇళ్లను ఒక రూపాయికే లబ్ధిదారులకు అందిస్తామని తెలియజేశారని, ఆ మేరకు పార్వతీపురంలో 768 గృహాలను కేవలం ఒక రూపాయికే లబ్ధిదారులకు అందిస్తున్నారని చెప్పారు. గృహాల రిజిస్ట్రేషన్ విలువ రూ.50 వేలు ఉందని, దానిని కూడా ప్రభుత్వమే భరించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తోందన్నారు. ఒక యూనిట్ ఖరీదు రూ.6.50 లక్షలుగా ఉందని, దానితోపాటు 20 గజాల అవిభాజ్య స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, వీటి మొత్తం వెరసి రూ.10 లక్షల ఖరీదైన ఇంటిని ఒక్క రూపాయికి ఇస్తున్నట్టు వివరించారు. గృహాలకు పుట్టీ, వెట్రిఫైడ్ ఫ్లోరింగ్, వంటగదిలో గ్రానైట్ స్లాబ్ వేస్తున్నామని తెలిపారు. ఇంత గొప్పటి సంక్షేమ ప్రభుత్వం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశంలో కోటి 20 లక్షల యూనిట్ల ఇళ్లు మంజూరు చేస్తే, ఏపీకి 32.60 లక్షల ఇళ్ల మంజూరుతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రెండు, మూడవ స్థానాల్లో నిలిచాయని చెప్పారు. 17 మున్సిపాలిటీల్లో 50 వేల గృహాలను ఇప్పటికే లబ్ధిదారులకు అందించామని, అందులో 25 వేల గృహాలను రూపాయి విలువకే అందజేసినట్టు తెలిపారు.

తోటపల్లి నుంచి నీటి సరఫరా

తోటపల్లి ప్రాజెక్టు నుంచి టిడ్కో గృహాలకు తాగునీరు నీరు సరఫరా చేసే పనులు చేపట్టామని ప్రసన్న కుమార్ తెలిపారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ సమీపంలోని ఉల్లిభద్ర వద్ద ఇంటెక్ వెల్‌ను నిర్మించి టిడ్కో గృహాలకు నిరంతరం తాగునీరు సరఫరాకు చర్యలు తీసకుంటున్నట్టు వెల్లడించారు. ఇంటెక్ వెల్ నిర్మాణ ప్రదేశాన్ని ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ జియాలజిస్టు వీవీ రావుతో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో డీఈ బాలకృష్ణ, తోటపల్లి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరితగతిన పునరావాస పనులు



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

- భోగాపురం ఎయిర్ పోర్టు, గిరిజన వర్సిటీలకు త్వరలో శంకుస్థాపన
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

విజయనగరం అర్బన్: భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కోర్టు అడ్డంకులు తొలగిపోయాయని, నిర్వాసితుల పునరావాస పనులు త్వరితగతిన పూర్తిచేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా అధికారులకు సూచించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం అంశంపై కలెక్టరేట్‌లో కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్‌లతో శనివారం సమీక్షించారు. ఎయిర్ పోర్టు, గిరిజన విశ్వవిద్యాలయాల శంకుస్థాపన పనులకు ఏర్పాట్లు చేయాలన్నారు. నిర్వాసితుల పునరావాస కాలనీలకు పూర్తిస్థాయిలో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గిరిజన వర్సిటీకి భూసేకరణలో భాగంగా రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకోవాలన్నారు. నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాసం, నిర్మాణ సంస్థ జీఎంఆర్‌కు నిర్మాణ పనుల కోసం భూమి అప్పగింత తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు.

- ఫ్లై ఓవర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన యజమానులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామితో కలిసి మంత్రి బొత్స సత్యనారాయణను కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. తమకు న్యాయబద్ధంగా పరిహారం ఇప్పించాలని, మార్కెట్ ధరలకు తగ్గట్టుగా పరిహారం ఇవ్వాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ కలెక్టర్ తన పరిధిలో ఉన్న మేరకు గరిష్టంగా ధరను నిర్ణయించి చెల్లిస్తారని చెప్పారు.
- శాసన సభ్యుల నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి బొబ్బిలి పట్టణంలో రోడ్ల విస్తరణ, విద్యుత్ స్తంభాల తొలగింపునకు నిధులు కేటాయించాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. స్తంభాల మార్పిడికి రూ.20 లక్షల అవసరం ఉంటుందని విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు, రోడ్లు భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత

భామిని: అనారోగ్యంతో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్ద దిమిలి గ్రామానికి చెందిన కరణం కృష్ణమూర్తికి వలంటీర్ బి.నవీన శనివారం పెన్షన్ అందజేశారు. అస్వస్థతకు గురై, హైదరాబాదులోని కొడుకు ఇంట్లో చికిత్స పొందుతున్న సొలికిరి గ్రామ వృద్ధురాలు కద్రక సుందరమ్మకు వలంటీర్ ఎరుకుమజ్జి శ్రీను పెన్షన్ అందజేశారు. లబ్ధిదారులు ఎక్కడున్నా వారి వద్దకు వలంటీర్లు వెళ్లి, పెన్షన్ అందిస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కృష్ణమూర్తికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ నవీన

అరటి దవ్వలతో అద్భుత అలంకరణ

ఆయన ఓ ఎలక్ట్రీషియన్. అరటి దవ్వలు, పూల మాలలతో అయ్యప్ప మండపాలను అందంగా.. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దడంలో సిద్ధహస్తుడు. అంబలం పూజా మండపాలను ఆకర్షణీయంగా రూపొందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాడు. ఆయనే.. వీరఘట్టంకు చెందిన పూతి మజ్జీశ్వరరావు. ఆయన రూపొందించిన మండపాలకు ఈ చిత్రాలే సజీవ సాక్ష్యాలు.

– వీరఘట్టం



స్టార్ ఆకారంలో రూపొందించిన అంబలం



శివ లింగాకారంలో...



పురివిప్పిన నెమలి ఆకారంలో...



అయ్యప్ప సన్నిధానం నమూనాలో...



అరటి దవ్వలతో అంబలంను తయారు చేస్తున్న మజ్జీశ్వరరావు

అలనాటి ఆకాశ వాణి


● శారదా శ్రీనివాసన్

**"కలదు ఆ శారదకు వీణ కరములందు
కలదు ఈ శారదకు వీణ గళమునందు
కలదు ఆ శారద కవుల కవితలందు
కలవు కవితలే ఈమె గానామృతమందు
శారద కాని శారదకు శారదలోగల
సత్కళా సుధా సారదకున్... విశారదకు
సాదర పూర్వ నమస్సుమాంజలులు"**

రేడియో కళాకారిణి శారదా శ్రీనివాసన్‌కు ఆచార్య ఆత్రేయ కలం నుంచి జాలువారిన ప్రశంస ఇది. 19.6.1977వ తేదీన ఆత్రేయ స్వహస్తాలతో రాసిన ఈ లేఖ శారదా శ్రీనివాసన్ దగ్గర ఇంకా భద్రంగా ఉంది. ఈ నెల రెండవ తేదీన హైదరాబాద్‌లో 'లాడ్లీ మీడియా అండ్ అడ్వర్‌టైజింగ్ అవార్డ్స్ ఫర్ జెండర్ సెన్సిటివిటీ' ప్రాంతీయ పురస్కారం అందుకున్నారామె. 45 ఏళ్ల కిందటి ఆత్రేయ గారి ప్రశంస, ఇప్పుడు ఈ పురస్కారానికి మధ్య ఆమె అందుకున్న గౌరవాలను లెక్క పెట్టడం సాధ్యం కాని పని. అలాగే ఆమె గళమిచ్చిన పాత్రల సంఖ్య కూడా! వేలల్లో ఉంది. తనకు గుర్తింపు, గౌరవం అన్నీ రేడియోతోనే అన్నారామె. శారదా శ్రీనివాసన్ తన రేడియో ప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారు.

గళం దేవుడిచ్చాడు! ఉచ్చారణ ఇల్లు నేర్పించింది!

"నేను పుట్టింది కృష్ణాజిల్లా, అవనిగడ్డ. మా నాన్న ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి. అప్పుడు అక్కడ ఉద్యోగం చేసేవారు. నాకు భగవంతుడు చక్కటి గొంతునిచ్చాడు. చక్కగా ఉచ్చరించడం మా ఇంట్లో అలవడింది. ఏ తొందరపాటులోనో ఒకపదంలో ఒక్క ఒత్తును సరిగ్గా పలకకపోయినా సరే ఉపేక్షించేవారు కాదు, 'ఏం పలికావు? మళ్లీ పలుకు' అని కోప్పడుతూ ఎప్పటికప్పుడు సరిదిద్దేవారు. మేము తణుకులో ఉన్నప్పుడు నన్నయ భట్టారకుని జయంతి సందర్భంగా పాఠశాల బాలికలకు పద్యపఠనం నిర్వహించారు. నేను కూడా ఓ నాలుగు పద్యాలు కంఠతా పట్టి ఆ పోటీల్లో వినిపించాను. నాకు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. బహుమతితో ఇంటికి వస్తే మా నాన్న ఏమన్నారో తెలుసా... 'ఏ చెట్టూ లేని చోట ఆముదం చెట్టే మహా వృక్షం అన్నట్లు, నీకు ప్రథమ బహుమతి వచ్చిందా' అని నవ్వారు.

యాదృచ్ఛికంగా మొదలైంది!

మేము విజయవాడ, మాచవరంలో ఉన్నప్పుడు హిందీకాలేజ్‌లో ప్రవీణ, ప్రచారక్ చేస్తున్న రోజుల్లో అనుకోకుండా వచ్చింది అవకాశం. రేడియో కాంటాక్ట్ కోసం వాయిస్ టెస్ట్ చేశారు. మా లెక్చరర్ చొరవతో వాయిస్ టెస్ట్‌లో పాల్గొనడం, సెలెక్ట్ కావడం జరిగిపోయింది. ఇది 1956–57ల నాటి మాట. అలా మొదలైన నా ఆకాశవాణి ప్రయాణంలో నన్ను నేను తీర్చిదిద్దుకున్నాను. 1995 ఆగస్టులో రిటైరయ్యే వరకు నేను గళమిచ్చిన ప్రతి కార్యక్రమం నాకు ఒక పాఠమే. నన్ను సమగ్రంగా తయారు చేసిన యూనివర్సిటీ రేడియో.



ఆకాశవాణి... నా బడి గుడి!

నాటికలు నా ప్రధాన విభాగం. అయినప్పటికీ స్పోకెన్ వర్డ్ ఆర్టిస్ట్‌గా రకరకాల స్క్రిప్టులు చదివాను. సాహిత్యం, చరిత్ర, నవలాపఠనం, వైద్య కథనాలు, మహిళలు – పిల్లల అంశాలు, కార్మికుల కార్యక్రమాలు, పిల్లల పాఠ్యాంశాలు... ఇలా అదీ ఇదీ అని పరిమితం కాకుండా అన్ని విభాగాల్లోనూ నా గొంతు వినిపించాను. యువవాణి మినహా రేడియోలో అన్ని విభాగాల్లోనూ నా గొంతు వినిపించాను.

● లాడ్లీ అవార్డు అందుకుంటున్న శారద

నవరసాలూ గొంతులోనే

పానుగంటి వారి రచనల్లోని పాతతరం తెలుగు భాషను ఒంటపట్టించుకోవడం కొంచెం శ్రమ అనిపించేది. అంతే తప్ప మరెక్కడా ఇబ్బంది పడలేదు. బాలగంగాధర తిలక్ 'సుప్తశిల' నేను చాలా బాగా చేశానని నాకనిపించిన నాటిక. రంగస్థలం మీద నటించేటప్పుడు హావభావాలు ప్రేక్షకులకు కనిపిస్తుంటాయి. రేడియోలో అలా కాదు. నవరసాలనూ గొంతులోనే పలికించాలి. అంతేకాదు, శ్రోతలకు మేము కనిపించడం లేదు కదా అని ఒకే చోట కూర్చుని మాట్లాడుతూ నాటికను రికార్డు చేస్తే జీవం రాదు. ఒక గదిలో నుంచి మరో గదిలోకి వెళ్తున్న సన్నివేశంలో కానీ, ఒక పాత్ర ఇంటి నుంచి బయటకు వెళ్తూ 'వెళ్లొస్తాను' అంటూ వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడు మొదటి అక్షరం పలకడానికి చివరి అక్షరం పలకడానికి మధ్య మైక్‌కు దూరం వెళ్తేనే ఆ సన్నివేశం శ్రోతలను ఆకట్టుకుంటుంది. ఇలాంటి చిన్న చిన్న విషయాలను దర్శకులు చెప్పరు. ఎవరికి వారు సాధనలో తెలుసుకోవాలి. మరో ముఖ్యమైన విషయం... ఉచ్చారణ ఉద్దేశం ఏమిటి? ఎదుటి వారికి తెలియాల్సిన ఒక విషయాన్ని మనం చెబుతున్నామనే కదా! పదాలను ఎక్కడ ఆపాలో, ఎక్కడ కలిపి పలకాలో స్పష్టత లేకపోతే వినేవాళ్లకు విషయం ఎలా తెలుస్తుంది? టీవీలో వార్తలు చదివే వాళ్లు ఈ ఒక్క నియమాన్ని పాటిస్తే బావుణ్ణనిపిస్తుంటుంది.

ఉత్సాహాన్నిచ్చింది

ఇక నా కుటుంబ విషయానికి వస్తే... చెన్నై నుంచి వచ్చిన ఫ్లూట్ ఆర్టిస్ట్ శ్రీనివాసన్‌తో రేడియోలోనే పరిచయమైంది. పెళ్లి చేసుకున్నాం. మాకు ఒకమ్మాయి నీరద. నాటికల ద్వారా ఎన్నో జీవితాలను ఆయా పాత్రల్లో ఇమిడిపోయినంతగా చదివాను. అందుకే ఎన్నో కోణాలను అర్థం చేసుకోగలిగాను. ముందే చెప్పాను కదా... ఆకాశవాణి అనే యూనివర్సిటీలో పట్టా పొందిన విద్యార్థిని నేను. ఈ రోజు లాడ్లీ వంటి సంస్థ గుర్తించడానికి కారణమూ రేడియోనే. ఎనభై ఎనిమిదేళ్ల వయసులో ఈ అవార్డు నాకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఇప్పటికీ గళం సహకరిస్తూ ఉండడం నా అదృష్టమనే చెప్పాలి" అని సంతోషాన్ని వ్యక్తం చేశారు రేడియో ఆర్టిస్ట్, రచయిత శారదా శ్రీనివాసన్.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: మోహనాచారి

ఆమెకు అండ

ఎవరికి వారు తమ సొంత జీవనం కోసం ఎప్పుడూ తపిస్తుంటారు. అందులో మహిళ అయితే.. తన పుట్టింటి గురించి, పెళ్లయితే అత్తింటి గురించి అహర్నిశలూ కష్టపడుతుంటుంది. కానీ, తనకంటూ ఏ గుర్తింపు లేకుండా ఒక చాకిరీ యంత్రంగా ఉండిపోయిన 'ఆమె' సొంతంగా ఎదిగేందుకు కృషి చేస్తోంది సామాజిక సేవాకార్యకర్త షాహినా. జార్ఖండ్‌లో పుట్టి పెరిగిన షాహినా కుటుంబాన్ని వదిలి మహిళా అభ్యున్నతికి పాతికేళ్లుగా కృషి చేస్తోంది. నేటికి మూడు వేల మంది బాలికలను చదువువైపుగా అడుగులు వేయించింది. అందుకే షాహినాను 'బాలికల అమ్మ' అని అంతా పిలుస్తుంటారు.


● షాహినా

షాహినా తండ్రి వైద్యరంగంలో ఉండటంతో ఆమె కూడా మెడిసిన్ వైపుగా అడుగులు వేసింది. చదువులో తండ్రితో పోటీపడాలని పంతొమ్మిదేళ్ల వయసులో మెడిసిన్ చదవడానికి పాట్నాకు వచ్చింది. ఆ తర్వాత చుట్టూ ఉన్న సమాజం పట్ల ఆసక్తితో జర్నలిజంలో డిగ్రీ చేసింది. అమ్మాయిల మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, స్త్రీ చదువులో వెనకబాటుతనం చూసిన షాహినా వాటికి అడ్డుకట్ట వేయడానికి సామాజిక కార్యకర్తగా మారింది. గ్లోబల్ ఆర్గనైజేషన్ వారి 'ది హంగర్' ప్రాజెక్ట్‌తో కలిసి మహిళాభ్యున్నతికి కృషి చేస్తోంది.

గ్రామ పంచాయితీ.. పోరాటం...

ఏళ్లు గడుస్తున్నా సమాజంలో ఏ స్థాయిలో మార్పు వచ్చిందో తెలియజేస్తూ ఒక ఉదాహరణను మన ముందుంచుతుంది షాహినా. 'గ్రామ పంచాయతీలో గెలుపొందిన మహిళలకు సాధికారత కల్పించడం కోసం ఏళ్లుగా కృషి చేస్తున్నాను. అయినా, ఇంకా అక్కడ మగవారి పెత్తనమే నడుస్తోంది. ఆడపిల్లల హక్కుల కోసం పోరాడాలని అవగాహన తరగతులు నిర్వహిస్తూనే ఉన్నాను. యాభై ఏళ్లుపైబడిన మగవారికి అభం శుభం తెలియని బాలికలను ఇచ్చి పెళ్లి చేస్తుంటారు. పెళ్లి పేరుతో డబ్బు వస్తుందని ఆశ పడే కుటుంబాలే దీనికి కారణం. మార్పుకు ఎన్నేళ్లు పడుతుందో చెప్పలేం. కానీ, తప్పక మార్పు చూస్తాం' అంటూ మన దేశ గ్రామాల్లో బాలికల పరిస్థితిని వివరిస్తుంది.


● అవగాహనా కార్యక్రమంలో షాహినా

అవగాహనా కార్యక్రమాలు...

లింగసమానత్వం లేని గ్రామాలను ఎంచుకుని, ఆ దిశగా తన బృందంతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటుంది షాహినా. 'ఆడపిల్లలు, మహిళల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం, తమను తాము ప్రేమించుకోవడం గురించి చెబుతాను. సొంతంగా చిన్న చిన్న నిర్ణయాలు తీసుకునేలా సిద్ధం చేస్తుంటాను. దీని వల్ల అమ్మాయిలు తమ శక్తిని గుర్తించగలుగుతారని నా ఉద్దేశం' అని చెబుతారు ఈ సోషల్ యాక్టివిస్ట్. ప్రతి ఒక్క బాలికనూ స్కూల్‌కు పంపేందుకు ఊరూరు తిరుగుతుంటుంది. అమ్మాయిలు చదువుకుంటే వారికై వారు ఎదిగే శక్తిని పెంచుకుంటారని, ఆ ప్రయత్నాన్ని ప్రతీ కుటుంబం చేయాలని చెబుతుంది.

వివాహానికి దూరం..

తను ఎంచుకున్న సామాజిక సేవకు ఆటంకం కలుగుతుందనే షాహినా పెళ్లి ఆలోచన పక్కన పెట్టేసింది. తన కుటుంబం చుట్టూ ఉన్న బంధుమిత్రులు అవహేళన చేసినవారే. అయినా, వారందరినీ కాదని తనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుంది షాహినా. 'నేను ఎవరికోసం పని చేస్తున్నానో ఆ స్త్రీలు, బాలికలే నా కుటుంబం. సమాజ ఉన్నతికి కొత్త స్క్రిప్ట్ రాయాలంటే నన్ను నేనే దిద్దుకోవాలి' అంటారు ఆమె.


బెదిరింపులను ఎదుర్కొంటూ..

'కోవిడ్ కాలంలో చాలా మంది బాలికల మానవ అక్రమ రవాణా జరిగింది. ఆర్గనైజేషన్ ద్వారా వారిని కాపాడటానికి నా శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశాను. అందుకు బీహార్ ప్రభుత్వం నాకు పూర్తి మద్దతునిచ్చింది. ఈ క్రమంలో బెదిరింపులను ఎదుర్కొన్నాను. సమాజం అమ్మాయిలను ఒక వలయంలో ఉంచింది. దాని నుండి బయటపడి ఎవరికి వారు సొంత గుర్తింపును సాధించడం ముఖ్యం. ఆడపిల్లలు ఆత్మగౌరవంతో జీవించడం నేర్చాలి. నియంత్రిస్తే ఆమె తనకు తానుగా ఒక ఫ్రేమ్‌లో ఇమిడిపోయి, అభివృద్ధివైపుగా అడుగులు వేయడం ఆపేస్తుంది. ప్రతి అమ్మాయికి ధైర్యంతో కూడిన మద్దతునిచ్చినప్పుడు వారి కళ్లలో చూసిన ఆనందాన్ని ప్రపంచంలోని ఏ విలువైన వస్తువుతోనూ పోల్చలేం. ప్రతి అమ్మాయి ప్రత్యేకమైనది. వారిని సరిగ్గా అర్థం చేసుకోవడం, సమాజ ఉన్నతివైపుగా మళ్లించడం మనందరి బాధ్యత' అని వివరించే షాహినా నేటికి మూడు వేల మంది బాలికలకు విద్యావకాశాలు కల్పించింది. తమకు తాముగా ఎదిగేందుకు తగిన శక్తిని అందజేసింది. అందుకే షాహినాను 'బాలికల అమ్మ'గా కీర్తిస్తుంటారు.

హెల్త్

కండరాల జబ్బు... మయోసైటిస్!

సినీనటి సమంతకు 'మయోసైటిస్' వచ్చిందనే న్యూస్ వెలువడగానే దాని గురించి ఆరాలు మొదలయ్యాయి. చాలా మంది ఆ జబ్బు గురించి అంతో ఇంతో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. చిన్న చిన్న వీడియో క్లిపింగ్స్‌లో సంక్షిప్తంగానే తప్ప సమగ్రంగా దానిపై ఇప్పటికీ చాలామందికి పెద్దగా అవగాహన లేదు. ఈ నేపథ్యంలో మయోసైటిస్ అంటే ఏమిటి, దాని లక్షణాలు, నిర్ధారణ, చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసమే ఈ కథనం.



ఏ స్పెషలిస్టును సంప్రదించాలి?

ఇది రకరకాలుగా వస్తూ దేహంలోని అనేక భాగాలను ప్రభావితం చేస్తున్నందున... ఏ భాగం దుష్ప్రభావానికి లోనైతే ఆ వైద్యనిపుణులను సంప్రదిచడం అవసరం. ఉదాహరణకు డర్మటోమయోసైటిస్‌కు డర్మటాలజిస్టులు, జువెనైల్ మయోసైటిస్‌కు చిన్న పిల్లల నిపుణులు, కీళ్లు, చిన్న చిన్న కీళ్లు ప్రభావితమైతే రుమటాలజిస్టులు, గుండెప్రభావితం అయినప్పుడు హార్ట్ స్పెషలిస్టులు, ఊపిరితిత్తుల కేసులో పల్మొనాలజిస్టులు వంటి వారిని సంప్రదించడం మేలు.

'మయో' అంటే 'కండరం'... 'సైటిస్' అంటే ఇన్‌ఫ్లమేషన్/ఇన్ఫెక్షన్. వెరసి కండరాల్లో వచ్చే ఒక రకం ఇన్‌ఫ్లమేషన్ (అంటే... కండరం లోపలి బాగాల్లో వాపు, మంట, ఎర్రబారి ఉండటం వంటివి) రావడం. దీన్ని 'ఇన్‌ఫ్లమేటరీ మయోపతి'గా కూడా పేర్కొంటారు. చిన్నవారు, పెద్దవారు అందరిలో ఈ వ్యాధి కనిపించినప్పటికీ... మహిళలే దీని బారిన ఎక్కువగా పడే అవకాశం ఎక్కువ. ఇది ఒక్కోసారి ఆటోఇమ్యూన్ జబ్బులా కూడా రావచ్చు. సొంత వ్యాధినిరోధక వ్యవస్థే మనపై ప్రతికూలంగా పనిచేయడం వల్ల వచ్చే సమస్యను 'ఆటో ఇమ్యూన్ వ్యాధి'గా పేర్కొంటారు. అంటే మన దేహంలోని వ్యాధినిరోధక వ్యవస్థ మన కండరాలను దెబ్బతీయడం వల్ల వస్తుందన్నమాట. ఒక్కోసారి ఇదొక్కటే గానీ లేదా లూపస్, ఐఎల్‌డీ లాంటి మరికొన్ని ఇతర ఆటోఇమ్యూన్ సమస్యలతో కలిపి కూడా కనిపించవచ్చు.

ఒకప్పుడు అరుదుగా వచ్చేది చెప్పినా... ఇటీవల ఇది ఎక్కువగానే కనిపిస్తోంది. మయోసైటిస్ అనే ఒక్కమాటతో సూచించినప్పటికీ ఇందులో ఐదారు రకాలు ఉంటాయి. అవి...

1. దర్మటో మయోసైటిస్
2. ఇంక్లూజన్ బాడీ మయోసైటిస్
3. పాలీమయోసైటిస్
4. టాక్సిక్ మయోసైటిస్
5. ఇమ్యూన్ మీడియేటెడ్ నెక్రొటైజింగ్ మయోసైటిస్
6. జువెనైల్ మయోసైటిస్ (పిల్లల్లో వచ్చేది కావడంతో దీన్ని ఇలా పిలుస్తారు).

1. దర్మటో మయోసైటిస్

అన్ని రకాల్లోనూ దీన్ని సులువుగా గుర్తించవచ్చు. ఎందుకంటే చర్మంపై ఎరుపు–పర్పుల్ ర్యాష్... అది కూడా 'హీలియోట్రోప్' అనే ఒక రకం పువ్వు ఆకృతిలో ఈ ర్యాష్ చర్మంపై కనిపిస్తుండటం వల్ల దీన్ని తేలిగ్గా గుర్తించడం సాధ్యమవుతుంది. ఇది ఒంటిపై ప్రధానంగా కనురెప్పల మీదుగా కళ్ల చుట్టూతా రావచ్చు. అంతేగాక... ముఖం, ఛాతీ, మెడ, వీపు ఇలా ఏ భాగంలోనైనా వచ్చే అవకాశాలున్నాయి. దీన్ని గుర్తించడానికి మరో ముఖ్యమైన సూచన ఏమిటంటే వేళ్ల చివర కణుపుల (పిడికిలి మూసినప్పుడు ప్రస్ఫుటంగా కనిపించే నకుల్స్) మీద, బొటనవేలి మీద ఈ ర్యాష్ ఎక్కువగా కనిపిస్తుంది. ర్యాష్ వచ్చిన చోట చర్మం పొడిబారిపోయి, రఫ్‌గా మారి కనిపిస్తుంది. చర్మం కింద కదుముల్లా కాయలు/గడ్డలు కనిపించవచ్చు. కొందరిలో గొంతు బొంగురుపోవచ్చు. మింగడం కష్టం కావచ్చు. గుండెదడ, గుండెలయ తప్పడం వంటి లక్షణాలూ కనిపిస్తాయి.

- ఛాతీ మీద వచ్చే ర్యాష్ ఛాతీ నుంచి మెడ మీదుగా శాలువా కప్పినట్టుగా కనిపిస్తుంది కాబట్టి దాన్ని 'షాల్ సైన్' మయోసైటిస్ అనీ,
- చేతుల మీద వస్తే అది మెకానిక్‌ల చేతుల్లా రఫ్‌గా ఉన్నందున 'మెకానిక్స్' హ్యాండ్' మయోసైటిస్ అని కూడా అంటారు.
- వెళ్ళకణుపులు, ముంజేతులు, మోకాళ్లు, బొటన వేళ్ల దగ్గర ఉబ్బెత్తుగా కనిపిస్తూ, అక్కడి చర్మం పొడిబారి, పొట్టులా రాలుతున్నట్లు కనిపించవచ్చు. ఇలా కనిపించే గుర్తులను 'గట్రన్స్ సైన్స్' అంటారు. (చిన్నపిల్లలకు వచ్చే జువెనైల్ మయోసైటిస్‌లోనూ ఈ లక్షణం కనిపించవచ్చు).

2. ఇంక్లూజన్ బాడీ మయోసైటిస్

ఇది మాత్రం మహిళల్లో కంటే పురుషుల్లో , అందునా 50 ఏళ్ల పైబడినవాళ్లలో ఎక్కువ. దీనిలో కీలక లక్షణాలేమిటంటే... వేళ్లు, పిడికిలి బిగింపు బలహీనంగా ఉండటం, తొడల కండరాల్లో నిస్సత్తువగా అనిపించడం; పెద్దవాటి కంటే, చిన్న కండరాలు బలహీనంగా అనిపించడంతో పాటు మరోపక్క ఉండే కండరాల కంటే దేహానికి (ఏదో) ఇంకోవైపు ఉన్నవి ఇంకా ఎక్కువగా బలహీనంగా అనిపిస్తాయి. ఇది పూర్తిగా జన్యుపరమైనదని వైద్య వర్గాల మాట. ఇందులో ప్రత్యేకంగా కనిపించే లక్షణాలివి...

- నడక కష్టంగా మారడం – తూలుతూ నడవడం (నడుస్తున్నప్పుడు బ్యాలెన్స్ కోల్పోవడంతో పాటు ఒక్కోసారి పడిపోవడం కూడా), వేళ్లను కచ్చితంగా, నిర్దిష్టంగా ఉపయోగించలేకపోవడం (చిటిక వేయలేకపోవడం, కచ్చితంగా దేన్నైనా నొక్కలేకపోవడం, సూది లాంటి చిన్న వస్తువులను పట్టుకోలేకపోవడం వంటివి).

3. పాలిమయోసైటిస్

ఇందులో ముఖ్యంగా మొండానికి దగ్గర్లో ఉన్న భాగాల్లోని కండరాలు బలహీనంగా మారతాయి. అందులోనూ ఒక్కో వ్యక్తిలో ఒక్కోలాంటి ప్రత్యేక/నిర్దిష్ట లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా పాలి మయోసైటిస్... మరికొన్ని ఇతర ఆటోఇమ్యూన్ జబ్బులతో పాటు కలిపి కనిపిస్తుంది. మింగడం కష్టంగా మారడం, దీర్ఘకాలికంగా కనిపించే పొడి దగ్గు, చేతుల్లోని చర్మం మందంగా మారడం, శ్వాసతీసుకోవడం కష్టం కావడం, బరువు తగ్గడం, గొంతుబొంగురు... ఇందులో కనిపించే నిర్దిష్ట లక్షణాలు.

4. టాక్సిక్ మయోసైటిస్

దేహంలో ఏవైనా హానికరమైన/విషం లాంటి రసాయనాలు చేరడం వల్ల వచ్చే కండరాల జబ్బు అని పేరును బట్టే తెలుసుకోవచ్చు. అయితే సాధారణంగా కోరి కోరి ఎవరూ హానికరమైన/విషతుల్యమైన వాటిని తీసుకోరుగానీ... కొన్ని రకాల ఔషధాలు, హానికరమైన మందులు, చాలా అరుదుగా కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి వాడే మందులతో ఇది రావచ్చు. డ్రగ్స్ వంటివి అలవాటై తీసుకునే కొకైన్ వంటి మాదకద్రవ్యాలతో పాటు పెయింట్‌ను పలచబార్చేందుకు వాడే టాల్విన్ అనే రసాయనాన్ని కొందరు మత్తు కోసం అలవాటుగా పీలుస్తుంటారు. దానివల్ల ఇది రావచ్చు.

5. ఇమ్యూన్ మీడియేటెడ్ నెక్రొటైజింగ్ మయోసైటిస్

ఇది ఒక రకం ఆటోఇమ్యూన్ జబ్బు. చాలా అరుదు. పది లక్షల్లో కేవలం 20 మందికి వస్తుంది. (19వ శతాబ్దపు వందేళ్లలో 30 కేసులు, అలాగే గత 70 ఏళ్లలో కేవలం 80 కేసులు వచ్చాయి). ఇందులో భుజాలకిరువైపులా తీవ్రమైన బలహీనత వస్తుంది. చేతులతో బలమైన పనులేవీ చేయలేని పరిస్థితి.

6. జువెనైల్ మయోసైటిస్

పేరును బట్టి ఇది పిల్లల్లో వచ్చే కండరాల జబ్బు అని తేలిగ్గా చెప్పవచ్చు. ఇది పిల్లల కండరాలతో పాటు వారి చర్మం కూడా ప్రభావితం కావచ్చు. పిల్లలు అనాసక్తితో, మూడీగా కనిపించవచ్చు. పిల్లల్లోని రోగనిరోధక శక్తి వారికి రక్తనాళాల కణజాలంపై ప్రతికూలంగా పనిచేయడం వల్ల... వారిలోని సన్నటి/చిన్న రక్తనాళాలు దెబ్బతింటాయి. పిల్లల్లో వచ్చే ఇన్ఫెక్షన్లు, ముఖ్యంగా వైరల్ ఇన్ఫెక్షన్ల తర్వాత వ్యాధి కనిపించడం; అలాగే వారికి తగిలే దెబ్బలు, మందుల రియాక్షన్... ఇలాంటివన్నీ జువెనైల్ మయోసైటిస్‌కు కారణం కావచ్చు. జువెనైల్ మయోసైటిస్‌కు ఇప్పుడు కచ్చితమైన చికిత్స లేకపోయినా... పెరిగే పిల్లల్లో స్వాభావికంగానే జరిగే కండరాల పెరుగుదల, వాటికి తగిన వ్యాయామం సమకూరడం, చాలాకాలం పాటు ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవడం వంటి కారణంగా... వారు మిగతా పిల్లల్లాగే ఆరోగ్యకరంగానే కనిపించడం/పెరగడం జరుగుతుంటాయి. అందుకే దీన్ని బినైన్ ఎక్యూట్ ఛైల్డ్‌హుడ్ మయోసైటిస్ అని అంటుంటారు. కాబట్టి విచారం అక్కర్లేదు.

చికిత్స

ప్రధానంగా ఫిజియోథెరపీ, స్ట్రెచ్చింగ్ వ్యాయామాలు, యోగా వంటివి కండరాలను బలంగా చేసేందుకు, బలహీనపడకుండా నివారించేందుకు (మజిల్ అట్రోఫీ కాకుండా చూసేందుకు) ఉపయోగపడతాయి. ● స్టెరాయిడ్స్, కార్టికోస్టెరాయిడ్స్‌ను తగిన మోతాదులో ఉపయోగించి నొప్పి, బాధ తగ్గించగలుగుతారు. ● సొంత వ్యాధినిరోధక వ్యవస్థ బలంగా పని చేయడాన్ని తగ్గించేందుకు అజాథయోప్రిన్, సైక్లోఫాస్ఫొమైడ్, మెథోట్రెక్సేట్, మైకోఫెనొలేట్ మొఫెటిల్ వంటి 'ఇమ్యూనో సప్రెసెంట్స్' ఇవ్వాల్సి రావచ్చు. ● క్యాన్సర్‌కు ఉపయోగించే రిటుక్సిమాబ్ అనే కొత్త మందు (కీమోథెరపీ కోసం, అలాగే మోనోక్లోనల్ యాంటీబాడీ మెడిసిన్‌గా కూడా) కూడా మయోసైటిస్‌కు బాగా పనిచేస్తుందని తేలడంతో ఇటీవల దీన్ని కూడా ఉపయోగిస్తున్నారు. ● ఇమ్యూనోగ్లోబ్యులిన్స్ అనే ఆధునికమైన ఔషధాలనూ వాడుతున్నారు.


డాక్టర్ ఆరతి బెల్లారి
సీనియర్ ఫిజీషియన్

కామన్ లక్షణాలు

పైన పేర్కొన్నవి ఆయా నిర్దిష్టమైన/ప్రత్యేకమైన 'మయోసైటిస్'లలో కనిపించే ప్రత్యేక లక్షణాలు కాగా మరికొన్ని సాధారణ (కామన్ లక్షణాలు) ఈ కిందివిధంగా ఉంటాయి. దాదాపు అన్ని కేసుల్లోనూ... ● జ్వరం ● కండరాలు బలహీనంగా మారడం ● తీవ్రమైన నీరసం/నిస్సత్తువ ● బరువు తగ్గడం ● కూర్చున్న చోటి నుంచి లేవలేకపోవడం ● మింగడంలో నొప్పి వంటివి.

నిర్ధారణ

ఇది అంత తేలిక కాదు. మయోసైటిస్‌లో కనిపించే లక్షణాలు చాలా ఇతర లక్షణాలతో కలిసి ఉండటం, కండరాల నొప్పి, నిస్సత్తువ/నీరసం వంటివి ఇతర జబ్బుల్లోనూ కనిపించే చాలా సాధారణ లక్షణాలు కావడంతో గుర్తింపు కష్టమవుతుంది. ఇలా చేతులు బలహీనంగా మారుతుండటం, కూర్చుని గబుక్కున లేవలేకపోవడం వంటివి పదేపదే రిపీట్ అవుతుండటంతో దీన్ని లక్షణాలను బట్టి (క్లినికల్‌గా) తొలుత గుర్తిస్తారు. ఆ తర్వాత నిర్ధారణ కోసం రక్తపరీక్షలు... మరీ ముఖ్యంగా కండరాల కదలికలను ప్రభావితం 'క్రియాటినిన్ ఫాస్ఫో కైనేజ్' (సీపీకే) వంటి ఎంజైములను కనుగొనే రక్తపరీక్షలతో పాటు 'మయోసైటిస్ స్పెసిఫిక్ యాంటీబాడీ పానెల్' రక్తపరీక్షలు చేయాల్సి ఉంటుంది. అటు తర్వాత నిర్ధారణతో పాటు అది ఏ రకానికి చెందిందో తెలుసుకోవడం కోసం మజిల్ బయాప్సీ చేయవచ్చు. అలాగే అవసరాలను బట్టి ఎలక్ట్రోమయోగ్రఫీ, ఎమ్మారై, ఆటోఇమ్యూన్ జబ్బులను తెలిపే... యాంటీ-న్యూక్లియర్ యాంటీబాడీ పరీక్షలు, జన్యుపరీక్షలు చేయాల్సిరావచ్చు.

దాదాపు జీవితాంతం చికిత్స అవసరమైనప్పటికీ... (చాలా అరుదుగా తప్ప) ప్రాణాపాయం లేకపోవడం, కొన్ని సందర్భాల్లో చాలాకాలం పాటు అసలు జబ్బు ఉన్న దాఖలా/లక్షణాలు కనిపించకపోవడం (లాంగ్ టర్మ్ రెమిషన్ ఉండటం)తో ఆందోళన పడకుండా, డాక్టర్ల సలహా మేరకు 'క్రియాటినిన్ ఫాస్ఫో కైనేజ్' కనుగొనే రక్త పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు చేయించుకుంటూ ప్రశాంతంగా ఉండటం మేలు.



రితీశ్ రెడ్డి, అమన్ రావు సెంచరీలు: హైదరాబాద్ 462/6

కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19 క్రికెట్ టోర్నీలో భాగంగా సిక్కిం జట్టుతో శనివారం మొదలైన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్యాటర్లు అదరగొట్టారు. ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ 90 ఓవర్లలో 6 వికెట్లకు 462 పరుగులు సాధించింది. ఓపెనర్ అమన్ రావు (113 : 10 ఫోర్లు, 6 సిక్స్‌లు), రితీశ్ రెడ్డి (110 : 8 ఫోర్లు) సెంచరీలతో ఆకట్టుకున్నారు. అరవెల్లి అవినాశ్ (92 : 8 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో సెంచరీ కోల్పోగా... ధీరజ్ గౌడ్ (68 : 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), విఘ్నేశ్ రెడ్డి (39 : 4 ఫోర్లు) కూడా రాణించారు. అమన్, అవినాశ్ తొలి వికెట్‌కు 206 పరుగులు జోడించడం విశేషం.

ఇంగ్లండ్ హిట్... ఆస్ట్రేలియా అవుట్!

సెమీఫైనల్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ సత్తా చాటింది. ఛేదనలో కొంత తడబాటుకు గురైనా, చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకను ఓడించి తుది నాలుగు జట్లలో తమ స్థానాన్ని ఖరారు చేసుకుంది. పనిలో పనిగా తమ చిరకాల ప్రత్యర్థి ఆస్ట్రేలియాను సెమీస్ చేరకుండా నిలువరించడంలో కూడా సఫలమైంది. ఆసీస్ బృందం తమ ఆశలన్నీ లంకపైనే పెట్టుకోగా, సాధారణ ప్రదర్శనతో ఆ జట్టు ఓటమిని ఆహ్వానించింది. హేల్స్, స్టోక్స్, రషీద్ ఇంగ్లండ్ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య ఆస్ట్రేలియా సెమీ ఫైనల్ కూడా చేరకుండానే నిష్క్రమించింది. ప్రపంచకప్‌లో ఇప్పటి వరకు ఏ జట్టూ టైటిల్ నిలబెట్టుకోలేకపోగా, ఆతిథ్య దేశం కూడా ట్రోఫీని గెలవలేదు. ఈసారీ అదే కొనసాగనుంది. గత ఏడాది చాంపియన్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించిన వారంతా ఈసారి పేలవ ప్రదర్శనను కనబర్చడంతో ఆసీస్ కుదేలైంది. న్యూజిలాండ్, ఇంగ్లండ్‌లాగే మూడు విజయాలు సాధించినా, తొలి మ్యాచ్‌లో కివీస్ చేతిలో 89 పరుగులతో చిత్తయి భారీగా రన్‌రేట్‌లో వెనుకబడిన ఆసీస్ జట్టు మళ్లీ సెమీఫైనల్ రేసులోకి రాలేకపోయింది.

- సెమీఫైనల్లో బట్లర్ బృందం
- చివరి మ్యాచ్‌లో 4 వికెట్లతో శ్రీలంకపై విజయం
- సెమీస్ చేరకుండానే ఆసీస్ నిష్క్రమణ


స్టోక్స్

సిడ్నీ: మాజీ చాంపియన్ ఇంగ్లండ్ వరుసగా మూడోసారి టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన 'సూపర్ 12' గ్రూప్–1 చివరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 4 వికెట్ల తేడాతో శ్రీలంకపై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. నిసాంక (45 బంతుల్లో 67; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. మార్క్ వుడ్‌కు 3 వికెట్లు దక్కగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రషీద్ (1/16) పొదుపైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్ట డి చేశాడు. అనంతరం ఇంగ్లండ్ 19.4 ఓవర్లలో 6 వికెట్లకు 144 పరుగులు చేసి గెలిచింది. అలెక్స్ హేల్స్ (30 బంతుల్లో 47; 7 ఫోర్లు, 1 సిక్స్), బెన్ స్టోక్స్ (36 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు), జోస్ బట్లర్ (23 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) (సబ్) జోర్డాన్ (బి) రషీద్ 67; మెండిస్ (సి) లివింగ్‌స్టోన్ (బి) వోక్స్ 18; ధనంజయ (సి) స్టోక్స్ (బి) కరన్ 9; అసలంక (సి) మలాన్ (బి) స్టోక్స్ 8; రాజపక్స (సి) కరన్ (బి) వుడ్ 22; షనక (సి) బట్లర్ (బి) వుడ్ 3; హసరంగ (రనౌట్) 9; కరుణరత్నే (సి) హేల్స్ (బి) వుడ్ 0; తీక్షణ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 141. **వికెట్ల పతనం:** 1–39, 2–72, 3–84, 4–118, 5–127, 6–140, 7–141, 8–141. **బౌలింగ్:** స్టోక్స్ 3–0–24–1, వోక్స్ 3–0–24–1, వుడ్ 3–0–26–3, స్యామ్ కరన్ 4–0– 27–1, రషీద్ 4–0–16–1, లివింగ్‌స్టోన్ 2–0– 16–0, అలీ 1–0–5–0.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బట్లర్ (సి) కరుణరత్నే (బి) హసరంగ 28; హేల్స్ (సి అండ్ బి) హసరంగ 47; స్టోక్స్ (నాటౌట్) 42; బ్రూక్ (సి అండ్ బి) ధనంజయ 4; లివింగ్‌స్టోన్ (సి) ధనంజయ (బి) కుమార 4; అలీ (సి) షనక (బి) ధనంజయ 1; కరన్ (సి) రజిత (బి) కుమార 6; వోక్స్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (19.4 ఓవర్లలో 6 వికెట్లకు) 144. **వికెట్ల పతనం:** 1–75, 2–82, 3–93, 4–106, 5–111, 6–129. **బౌలింగ్:** తీక్షణ 4–0–22–0, రజిత 3–0–40–0, కుమార 3.4–0–24–2, హసరంగ 4–0–23–2, ధనంజయ 4–0–24–2, అసలంక 1–0–8–0.

1992 వన్డే వరల్డ్‌కప్‌లో కూడా ఆస్ట్రేలియా డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య జట్టు హోదాలో టోర్నీలో అడుగు పెట్టింది. టోర్నీ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలోనే 37 పరుగులతో ఓడిన తర్వాత మళ్లీ కోలుకోలేకపోయిన ఆసీస్ సెమీస్ చేరడంలో విఫలం కావడాన్ని తాజా ప్రదర్శన గుర్తుకు తెచ్చింది.

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
న్యూజిలాండ్	5	3	1	1	7	2.113
ఇంగ్లండ్	5	3	1	1	7	0.473
ఆస్ట్రేలియా	5	3	1	1	7	-0.173
శ్రీలంక	5	2	3	0	4	-0.422
ఐర్లాండ్	5	1	3	1	3	-1.615
అఫ్గానిస్తాన్	5	0	3	2	2	-0.571

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X నెదర్లాండ్స్ (ఉ.గం. 5:30 నుంచి)
పాకిస్తాన్ X బంగ్లాదేశ్ (ఉ.గం. 9:30 నుంచి)
భారత్ X జింబాబ్వే (మ.గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం



ముస్తాక్ అలీ ట్రోఫీ విజేత ముంబై

కోల్‌కతా: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని ముంబై జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. ఫైనల్లో రహానే కెప్టెన్సీలోని ముంబై జట్టు మూడు వికెట్ల తేడాతో రిషి ధావన్ సారథ్యంలోని హిమాచల్ ప్రదేశ్ జట్టుపై నెగ్గింది. ముందుగా హిమాచల్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 143 పరుగులు చేసింది. ముంబై 19.3 ఓవర్లలో 7 వికెట్లకు 146 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. శ్రేయస్ అయ్యర్ (34; 4 ఫోర్లు, 1 సిక్స్), సర్ఫరాజ్ ఖాన్ (36 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించి ముంబై విజయంలో కీలకపాత్ర పోషించారు.

గెలిస్తే గ్రూప్ టాపర్‌గా...

సరిగ్గా రెండు వారాల క్రితం మెల్‌బోర్న్ మైదానంలో భారత క్రికెట్ జట్టు ఒక అద్భుత విజయాన్ని అందుకుంది. పాకిస్తాన్‌పై సాధించిన ఈ గెలుపు అభిమానులందరికీ చిరస్మరణీయ జ్ఞాపకాన్ని అందించింది. ఇప్పుడు అదే వేదికపై లీగ్ దశను ముగించేందుకు టీమిండియా మళ్లీ మైదానంలోకి అడుగు పెడుతోంది. బలహీన ప్రత్యర్థిని ఓడించి గ్రూప్-1లో మొదటి స్థానంలో నిలవాలని రోహిత్ బృందం పట్టుదలతో ఉంది. అయితే స్టార్లు లేకపోయినా జింబాబ్వేను తక్కువగా అంచనా వేస్తే ప్రమాదమే! అలసత్వంతో అనూహ్య ఓటమిని ఎదుర్కొన్న పాకిస్తాన్ ఇప్పటికీ టోర్నీలో సెమీస్ స్థానం కోసం పోరాడుతోంది. ఈ నేపథ్యంలో మరో ఆదివారం మధ్యాహ్నం అభిమానులకు వినోదం ఖాయం.

- నేడు భారత్ చివరి లీగ్ మ్యాచ్
- జింబాబ్వేతో టీమిండియా 'ఢీ'
- జోరు మీదున్న రోహిత్ సేన
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



1 టి20 ప్రపంచకప్ చరిత్రలో భారత్, జింబాబ్వే మధ్య ఇదే తొలి మ్యాచ్.

మెల్‌బోర్న్: పాకిస్తాన్, నెదర్లాండ్స్, బంగ్లాదేశ్‌లపై విజయాలు, దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి తర్వాత భారత జట్టు టి20 వరల్డ్‌కప్ లీగ్ దశలో తమ చివరి పోరుకు సిద్ధమైంది. నేడు జరిగే పోరులో జింబాబ్వేతో భారత్ తలపడుతుంది. అధికారికంగా భారత్‌కు ఇంకా సెమీస్ స్థానం ఖరారు కాలేదు కానీ ఈ మ్యాచ్‌లో గెలిస్తే గ్రూప్ టాపర్‌గా భారత్ సెమీస్ చేరుతుంది. అదే జరిగితే ఈ నెల 10న అడిలైడ్‌లో ఇంగ్లండ్‌తో రెండో సెమీఫైనల్లో టీమిండియా తలపడుతుంది. టోర్నీ ఆసాంతం స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చిన జింబాబ్వే మరో సంచలనాన్ని ఆశిస్తోంది. పాక్‌తో మ్యాచ్ తరహాలోనే 90 వేలకు పైగా సామర్థ్యం ఉన్న ఎంసీజీలో ఈ పోరుకు కూడా అన్ని టికెట్లూ అమ్ముడవడం విశేషం.

చహల్‌కు అవకాశం దక్కేనా...

గత మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై చివర్లో గట్టెక్కినా... తుది జట్టులో మార్పులు ఉండకపోవచ్చు. టాపార్డర్ బ్యాటర్ల నుంచి బౌలర్ల వరకు అందరూ సమష్టిగా రాణిస్తున్నారు. ఒక్క వికెట్ కీపర్ విషయంలోనే కాస్త సందేహాలు అనిపించాయి. బంగ్లాతో పోరులోనే కార్తీక్ బదులుగా పంత్ ఆడతాడని అనిపించినా, చివరకు అది జరగలేదు. అంటే ఫినిషర్‌గా కార్తీక్‌పైనే జట్టు మేనేజ్‌మెంట్ ఎక్కువగా నమ్మకముంచుతోంది. పేసర్లు షమీ, భువనేశ్వర్, అర్ష్‌దీప్ ప్రతీ మ్యాచ్‌లో అంచనాలకు అనుగుణంగా రాణించారు. జింబాబ్వేపై కూడా ఈ ముగ్గురు ప్రభావం చూపగలరు.

సమష్టిగా రాణిస్తే...

పాకిస్తాన్‌పై విజయంతో ఒకదశలో జింబాబ్వే జట్టులో కూడా సెమీస్ ఆశలు రేగాయి. అయితే బంగ్లా, నెదర్లాండ్స్ చేతుల్లో పరాజయాలు ఆ జట్టును దెబ్బకొట్టాయి. ఈ రెండుసార్లు బ్యాటింగ్ వైఫల్యంతోనే జింబాబ్వే ఓడింది. సికందర్ రజా, విలియమ్స్‌పైనే జట్టు బ్యాటింగ్ ప్రధానంగా ఆధారపడి ఉంది. మరోవైపు జింబాబ్వే బౌలింగ్ కాస్త మెరుగ్గా కనిపిస్తోంది. పేసర్లు చటారా, ఎన్‌గరవ, ముజరబానిలను జట్టు నమ్ముకుంటోంది. ఈ ముగ్గురూ టోర్నీలో వేర్వేరు దశల్లో చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. పట్టుదలగా బౌలింగ్ చేస్తే వీరు భారత బ్యాటింగ్‌ను కొంత వరకు ఇబ్బంది పెట్టగలరేమో చూడాలి.


శనివారం మెల్‌బోర్న్ మైదానంలో తన బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న కోహ్లి

పిచ్, వాతావరణం

ఎంసీజీలో ఈ ప్రపంచకప్‌లో ఐదు మ్యాచ్‌లు షెడ్యూల్ కాగా, మూడు రద్దయ్యాయి. ఒక మ్యాచ్‌ను కుదించగా, భారత్-పాక్ మ్యాచ్ మాత్రమే పూర్తిగా సాగింది. ఆదివారం వర్ష సూచన లేకపోవడం సానుకూలాంశం. కొత్త పిచ్‌పై పేసర్లు కొంత ప్రభావం చూపగలరు కానీ ఓవరాల్‌గా బ్యాటింగ్‌కే అనుకూలం.

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
భారత్	4	3	1	0	6	0.730
దక్షిణాఫ్రికా	4	2	1	1	5	1.441
పాకిస్తాన్	4	2	2	0	4	1.117
బంగ్లాదేశ్	4	2	2	0	4	-1.276
జింబాబ్వే	4	1	2	1	3	-0.313
నెదర్లాండ్స్	4	1	3	0	2	-1.233

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

శ్రీజ, నిఖత్‌లకు 'అర్జున'!

న్యూఢిల్లీ: ఈ ఏడాది జాతీయ క్రీడా పురస్కారాలు అందుకోనున్న క్రీడాకారుల జాబితా సిద్ధమైంది. రిటైర్డ్ జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ అధ్యక్షుడిగా ఉన్న సెలక్షన్ కమిటీ తుది జాబితాను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు పంపించింది. కేంద్ర క్రీడా శాఖ ఆమోదముద్ర పడిన తర్వాత అధికారికంగా ప్రకటిస్తారు. భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) స్టార్ ఆచంట శరత్ కమల్‌కు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్ రత్న' ఖరారైంది. తమిళ నాడుకు చెందిన 40 ఏళ్ల శరత్ కమల్ బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో మూడు స్వర్ణాలు, ఒక రజతంగెలిచాడు. 2020లో ఐదుగురికి, 2021లో 12 మందికి 'ఖేల్‌రత్న' లభించడం గమనార్హం. ఇక ఉత్తమ క్రీడాకారులకు ఇచ్చే 'అర్జున అవార్డు' కోసం 25 మందిని కమిటీ నామినేట్ చేసింది. ఈ జాబితాలో తెలంగాణ మహిళా బాక్సర్ ప్రపంచ చాంపియన్, కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత నిఖత్ జరీన్... జాతీయ టీటీ చాంపియన్, కామన్వెల్త్ గేమ్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్ స్వర్ణ పతక విజేత ఆకుల శ్రీజ ఉన్నారు. 'అర్జున'కు నామినేట్ అయిన నిఖత్, శ్రీజలకు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

సినిమా

రేపు కమల్‌హాసన్ జన్మదినం

లోక నాయకుడు

టీనేజ్‌లో ఇంట్లో నుంచి గెంటేస్తే పట్టుదలగా బార్బర్ షాపులో పని చేశాడు కమల్‌హాసన్. గ్రూప్ డాన్సర్‌గా అవస్థలు పడ్డాడు. నటన నేర్చుకోవడానికి కె. బాలచందర్ చేతిలో చెంపదెబ్బలు తిన్నాడు. కాని సహించి భరించి ప్రయాణం కట్టేవాడే విజేత అవుతాడు. కమల్‌హాసన్ జీవితం, అతని లక్ష్యసిద్ధి ఏ తరానికైనా ఆదర్శమే. ఫ్యామిలీ అంతా విపరీతంగా మెచ్చే ఈ విశ్వ కథానాయకుడు ఇప్పటికీ హీరో. ఎప్పటికీ హీరో.

'మీ పక్కన కాస్తంత చోటివ్వండి' అంటాడు కమల్‌హాసన్ 'సాగర సంగమం'లో జయప్రదతో ఫొటోకోసం నిలబడుతూ. ఆ ఫొటోలో అతను పడడు. కాని భారతీయ సినిమా రంగంలో అతని చోటును నేటికీ కదిల్చేవాళ్లు లేరు. అతని పక్కన చోటు కోసం పాకులాడని వారు లేరు. 'స్టార్' లేదా 'యాక్టర్' రెండు ముద్రలుంటాయి ఇండస్ట్రీలో. కాని యాక్టర్‌గా ఉంటూ స్టార్ అయినవాడు కమల్‌హాసన్. తెర అంటే ఏమిటి? నటనకు వీలు కల్పించేది. నటించాల్సినది. నటన లేకుండా తెర మీద వెలగడం అంటే పులి గాండ్రించకుండా ఉండటమే. కమల్ గాండ్రించే పులి. పాత్రలను వేటాడే పులి కూడా. ఇండస్ట్రీలో బాల నటులుగా ప్రవేశించిన వారికి శాపం ఉంటుంది. యవ్వనంలో రాణించలేని శాపం. దానికి కారణం బాల నటులుగా ప్రవేశించాక చదువు సరిగ్గా నడవదు. అప్పటికే కెమెరా కాటేసి ఉంటుంది. ఏవేవో మెరుపు కలలు. కాని బాల్యంలో ఉన్న ముఖం వయసు పెరిగాక అంత ముద్దు రాకపోవచ్చు. బాల్యంలో ఉన్న ఈజ్ యవ్వనంలో మొద్దుబారవచ్చు. చాలా తక్కువ మందే చిన్నప్పుడు నటించి ఆ తర్వాత పెద్దయ్యాక కూడా స్టార్లు అయ్యారు. నటీమణుల్లో శ్రీదేవి. నటుల్లో కమల్‌హాసన్. నటన అతనిలో జన్మతః ఉంది. నటులు ఏం చేయాలో అతనికి తెలుసు.

'సొమ్మొకడిది సోకొకడిది' సినిమాలో 'ఆ పొన్న నీడలో ఈ కన్నెవాడలో ఉన్నా' అనే పాట ఉంటుంది. ఆ పాటను తీసింది కొబ్బరి చెట్ల మధ్య. అందుకే కమల్ మొదటి లైన్ పాడుతూ కొబ్బరి చెట్ల వైపు చూస్తూ ఇవి పొన్న చెట్లు కావే అన్నట్టుగా చూసి పాట కొనసాగిస్తాడు. న్యుయాన్సెస్ అంటారు దీనిని. కళ అంటేనే అది. 'సాగర సంగమం' సూపర్ డూపర్ హిట్ అయ్యాక కె. విశ్వనాథ్ 'స్వాతిముత్యం' తీశారు. 'సువ్వీ సువ్వీ సువ్వాలమ్మ' పాట చిత్రీకరణ. అంత మంచి దర్శకుడు విశ్వనాథ్ కూడా 'ఈ పాటకు మంచి స్టెప్స్ కంపోజ్ చేద్దాం' అన్నారట పాత్ర ఔచిత్యం మరిచి. అప్పుడు కమల్ 'సార్... ఈ పాటకు నేను డాన్స్ చేయను. ఎందుకంటే వీడు బాలు కాదు. శివయ్య. వీడికి డాన్సు రాదు' అన్నారట. అదీ కమల్. ఆ తర్వాత ఆ పాటలో శివయ్య అను కమల్ వేసిన వచ్చీ రాని స్టెప్స్‌ను లోకం మురిసిపోయి చూసింది.

కమల్ చార్లీ చాప్లిన్‌ను చూసి నటన మెరుగుపర్చుకున్నాడు. 'డాన్స్‌మాస్టర్'లో స్వయంగా చాప్లిన్ పాత్ర చేశాడు. ఆ తర్వాత రాబిన్ విలియమ్స్ నటనతో కూడా ప్రభావితం అయ్యాడు. మంచి నటుడు బ్లాటింగ్ పేపర్ లాంటి వాడు. ఒక్క బొట్టు మంచి దొరికినా పీల్చేసుకుంటాడు. 'గాడ్‌ఫాదర్'ను మోడల్‌గా పెట్టుకుని మణిరత్నం 'నాయకుడు' తీశాడు. గాడ్‌ఫాదర్‌లో మార్లెన్ బ్రాండో చేసింది గొప్పదే. 'నాయకుడు'లో కమల్ చేసింది కూడా గొప్పే. కొడుకు చనిపోయినప్పుడు తండ్రి దుఃఖాన్ని ఒక్కో నటుడు ఒక్కోలా చేస్తాడు. కమల్ చేసింది ఒక సిలబస్.

కమల్ చేసిన అతి ముఖ్యమైన పని ఆహార్యం గురించి శ్రద్ధ పెట్టడం. ఆహార్యం, దేహభాష ఒక పాత్రలో నటుణ్ణి నశింపచేసి పాత్రను సజీవం చేస్తుంది. ప్రతి సినిమాలో ఒకేలా ఉంటూ ఒకే నటన చేస్తూ నటుల్లా వెలిగే వారు ఉన్నారు నేటికీ. కాని కమల్ పాత్రను బట్టి మారుతాడు. అతని శరీర కదలికా మారుతుంది. ఆధునిక మేకప్‌లు రాని రోజుల్లోనే 'సత్యమే శివం' వంటి సినిమాల్లో ఆయన ఆహార్యం అద్భుతం. కమల్ తమిళంతో సమానంగా తెలుగులో కూడా సూపర్‌స్టార్. తెలుగులోనే నేరుగా సినిమాలు చేశాడు. 'మరో చరిత్ర', 'ఇది కథ కాదు', 'ఆకలి రాజ్యం' కొన్ని. ఒక గొప్ప నటుడు ఎవడయ్యా అంటే కామెడీ చేయగలిగినవాడు. సీరియస్ నటుడైన దిలీప్ కుమార్ కామిక్ టైమింగ్ అద్భుతం. అమితాబ్ కామెడీకి తిరుగు లేదు. కమల్ కామెడీ చేసి 'పుష్పక విమానం', 'మైఖేల్ మదన కామరాజు', 'ముంబై ఎక్స్‌ప్రెస్', 'తెనాలి'... లిస్టు పెద్దది. ఒక గొప్ప హీరో తన దర్జాకు తగిన కోస్టార్‌ను పెట్టుకుంటాడు. కాని కమెడియన్ అయిన కోవై సరళతో 'సతీ లీలావతి' చేసి హిట్ కొట్టాడు కమల్.

సినిమాలో సంపాదించింది సినిమాకే పెట్టాడు కమల్. నిర్మాతగా దర్శకుడుగా హిట్స్ ఫ్లాప్స్ ఇచ్చాడు. లాభపడ్డాడు. నష్టపోయాడు. కాని హీరోగానే ఉన్నాడు. హీరోగానే ఉండటానికి ఎంత ప్రొఫెషనల్‌గా, క్రియేటివ్‌గా ఉండాలో పరిశ్రమకు చూపించాడు. 67 ఏళ్ల వయసులో 'విక్రమ్' వంటి హిట్ ఇచ్చాడు. స్టార్లు పుడతారు. గిడతారు. కాని నటులు శాశ్వతం. కమల్ శాశ్వత నటుడు. హ్యాపీ బర్త్‌డే.


కమల్‌హాసన్


విజయ్, రష్మిక

రంజితమే..

విజయ్, రష్మికా మందన్నా జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మిస్తున్న చిత్రం 'వారసుడు' (తమిళంలో 'వారిసు'). ఈ చిత్రంలోని రెండో పాట 'రంజితమే...' (తమిళ వెర్షన్) లిరికల్ వీడియోను విడుదల చేశారు. తమన్ స్వరపరచిన ఈ పాటకు వివేక్ సాహిత్యం అందించగా, ఎమ్ఎమ్ మానసితో కలిసి హీరో విజయ్ పాడారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. తెలుగు వెర్షన్ పాటను త్వరలో రిలీజ్ చేయనున్నారు. సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ పళని, సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత.

ఇట్లు... తేదీ మారింది

'అల్లరి' నరేష్ హీరోగా రూపొందిన చిత్రం 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం'. ఏఆర్ మోహన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆనంది కథానాయికగా నటించారు. హాస్య మూవీస్, జీ స్టూడియోస్‌పై రాజేష్ దండా నిర్మించారు. తొలుత ఈ నెల 11న చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. అయితే కొంచెం ఆలస్యంగా ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు శనివారం ప్రకటించారు. ''గిరిజన ప్రాంతమైన మారేడుమిల్లిలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారిగా ఇంటెన్స్ పాత్రలో నరేష్ కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: రాంరెడ్డి.


'అల్లరి' నరేశ్

సుక్కు... సౌండ్ బాగుంది - దర్శకుడు సుకుమార్


● సుకుమార్, శివ నాగేశ్వరరావు, సిరాశ్రీ

''శివనాగేశ్వరరావుగారు 'వన్స్ మోర్' అని యూట్యూబ్ చానల్ పెట్టి, తన అనుభవాలను అబద్ధం లేకుండా చెబుతున్నారు. నేను ఆయనకు ఫ్యాన్'' అన్నారు దర్శకుడు సుకుమార్. ప్రణవ చంద్ర, మాళవిక సతీషన్, అజయ్‌ఘోష్, బిత్తిరి సత్తి ప్రధాన పాత్రల్లో శివ నాగేశ్వరరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దోచేవారెవరురా'. బొడ్డు కోటేశ్వరరావు నిర్మాత. రోహిత్ వర్ధన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సుక్కు... సుక్కు ....' అంటూ సాగే పాటని సుకుమార్ విడుదల చేసి, మాట్లాడుతూ – ''సుక్కు... సౌండ్ బాగుంది. నా పేరుతో వచ్చే ఈ పాటకు అజయ్ ఘోష్‌తో డాన్స్ చేయించాలనే ఆలోచన శివ నాగేశ్వరరావుగారికి రావడం హ్యాట్సాఫ్'' అన్నారు. ఈ పాటను సిరాశ్రీ రాశారు. ''సుక్కు..' పాటని విడుదల చేయగలరా? అని సుకుమార్‌కి మెసేజ్ పెట్టాను.. ఓకే అని పది నిమిషాల్లోనే రిప్లయ్ వచ్చింది'' అన్నారు శివ నాగేశ్వరరావు. ఈ సినిమాకి కెమెరా: ఆర్లి గణేష్, లైన్ ప్రొడ్యూసర్: శామ్ సన్.

అసలైన పవర్ భయానిదేరా!

ఆనంద్ రవి హీరోగా శ్రీపతి కర్రి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కొరమీను'. హరీష్ ఉత్తమన్, శత్రు, కిషోరీ దత్రక్, రాజా రవీంద్ర కీలక పాత్రల్లో నటించారు. పెళ్లకూరు సమన్య రెడ్డి నిర్మాత. ఈ సినిమా టీజర్‌ని డైరెక్టర్ గోపీచంద్ మలినేని విడుదల చేశారు. 'డబ్బుకు ఎక్కువ పవర్ అనుకుంటారు గానీ, అసలైన పవర్ భయానిదేరా' అంటూ హరీష్ ఉత్తమన్ చెప్పే డైలాగ్ టీజర్‌లో ఉంది. ''జాలరిపేట అనే మత్స్యకారుల కాలనీకి వస్తాడు పోలీస్ మీసాల రాజు. ఆయన మీసాల ఎవరు తీశారనేది ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు శ్రీపతి కర్రి. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ కొప్పెర, నేపథ్య సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పవన్‌కుమార్ జన స్వామి.


● కిషోరి, ఆనంద్ రవి

దర్శక-నిర్మాతలకు మర్యాద ఇవ్వాలి - అర్జున్



''విశ్వక్‌సేన్ నిబద్ధత లేని నటుడు. షెడ్యూల్ ప్రకారం షూటింగ్‌కి రాకుండా క్యాన్సిల్ చేసుకోండి? అని ఇబ్బందులకు గురి చేశాడు.. దర్శక–నిర్మాతలంటే గౌరవం, సినిమా అంటే బాధ్యత లేని తనతో ఇకపై సినిమా చేయాలనుకోవడం లేదు'' అని నటుడు, దర్శక–నిర్మాత అర్జున్ సర్జా అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''సినిమా ఇండస్ట్రీలో 42 ఏళ్ల కెరీర్ నాది. ఇన్నేళ్లలో ఎవరి గురించి ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడ లేదు. నా కుమార్తె ఐశ్వర్యని తెలుగులో పరిచయం చేయాలనుకుని అద్భుతమైన కథ రాశా. విశ్వక్ సేన్‌కి సీన్ టు సీన్ వివరిస్తే, అద్భుతంగా ఉందన్నాడు.. సినిమా ప్రారంభించాం. ఓపెనింగ్‌కి రావాలని చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్‌గార్లను అడిగాను. షూటింగ్‌తో బిజీగా ఉన్నాం.. మా డైరెక్టర్, ప్రొడ్యూసర్‌ని అడిగి చెబుతామన్నారు. అదీ నిబద్ధత అంటే. ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్ వంటి హీరోలకు పరపతి ఉన్నా షూటింగ్‌కి టైమ్‌కి వచ్చేస్తారు. విశ్వక్‌సేన్ మాత్రం 'రేపు షూటింగ్ క్యాన్సిల్ చేయండి' అని మెసేజ్‌లు పెడతాడు. కేరళలో షెడ్యూల్‌కి పూర్తిగా రాకపోవడంతో జగపతిబాబుతో సహా ఇతర నటీనటుల డేట్స్ వృథా అయ్యాయి. నటుడిగా అతడు కొన్ని సూచనలు చేయడంలో తప్పు లేదు. కానీ, మేకర్‌గా నాకు నచ్చాలి కదా! దర్శక–నిర్మాతలకు మర్యాద ఇవ్వాలి. పద్ధతులు తెలియకపోతే సినిమాలు చేయకండి. ఇలా ఇబ్బందులకు గురి చేయవద్దు'' అన్నారు.

తలకోనలో ఏం జరిగింది?


● అప్సర, సి. కల్యాణ్

